నవశక్తి

Vol. 2, no. 17

(Apr. 12, 1939)

బెజవాడ, 1939

Record no. 682

Navaśakti

Vol. 2, no. 17

(Apr. 12, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపుటం 2 | బుధవారం 12—4—39 బెజవాడ | సంచిక 17



త్రిపురిలో వాలంటీరు దళము పతాకాభివందనముగావిస్తూ ముందుకు సాగుతూఉంది.

నవశక్తి

ఏజెంట్లు గమనించాలి

1. అమ్మిన ప్రతి కాపీకి 25% కమిషను ఇవ్వబడును.
2. ఏజెంట్లుకు పంపిన కాపీలలో 10% (నూటికి పది) కన్న ఎక్కువ కాపీలు తిరిగి తీసుకోబడవు.
3. ప్రతి నెల బిల్లులు, మరుసటి నెల 15 వ తారీఖు లోపల చెల్లించవలయును.
   ఉదా:—మార్చి నెల బిల్లు ఏప్రిల్ 15 వ తారీఖులోపల చెల్లించవలయును.
4. అట్లు చెల్లించని వారికి పత్రిక ఆ పైన పంపబడదు.
5. ఏ ఏజెంటుకైనను 10 కాపీలకు తక్కువ పంపించబడవు.

—మేనేజరు.

* * *

చందా వివరాలు

సంవత్సర చందా	రూ 3—0—0
అర్ధ సంవత్సర చందా	1—10—0
ఏకప్రతి	0—1—0

బర్మా రేట్లు

సంవత్సర చందా	రు 5—0—0
ఏక ప్రతి	0—1—6

ప్రకటన రేట్లు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు)

20 అం॥ లోపల ప్రతి అంగుళానికి	రూ.	0—6—0
20" అం॥ పైన	..	0—4—0
100" అం॥ పైన	..	0—3—0
పేజీ	రు 10—0—0 లు	
½ పేజీ	6—0—0 లు	
¼ పేజీ	3—0—0 లు	

సూచన:—ఈ రేట్లుపైన కమిషన్లు, డిస్కౌంటులు ఇవ్వబడవు. రు 0—8—0 లకు తక్కువ ప్రకటనలు తీసుకొనబడవు. నెలకగు సొమ్ము ముందుగా ఇవ్వవలెను.

ప్రత్యేక చోటునకు, ప్రత్యేక రేట్లు.

* * *

	ఏప్రిల్ నెల కోటా	మొదటి వారములో చేర్పించినది.
విశాఖపట్టణం	10	0
తూ. గోదావరి	30	1
ప. గోదావరి	30	2
కృష్ణా జిల్లా	50	3
గుంటూరు	30	2
నెల్లూరు	25	3
రాయలసీమ	16	4
చిత్తూరు	5	1
కర్నూలు	5	0
ఇతర స్థలాలు	15	3
	200	15

విదేశాలలో మా ఏజెంట్లు

శ్రీ కాళిదాసు, 209 మీయూర్ స్ట్రీట్ రంగూన్.

పర్కూరిన్స్ బుక్ షాప్, 14 కింగ్సు స్ట్రీట్, లండన్. W. C. 2.

లీగ్ ఆఫ్ ఇండియాన్ ఫ్రీడం, 112 ఈస్ట్ 19 వ స్ట్రీట్, న్యూయార్కు సిటీ.

సంపుటం 2

సంచిక 17

నవశక్తి

బుధవారం

12–4–39

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

జలియన్ వాలాబాగ్: జాతీయవారము

రేపే జలియన్‌వాలాబాగ్ దినం. జాతీయ వారములోని తుది దినం. మఱచిపోరాని—మఱచిపో వీలులేని చరిత్రాత్మక దినం.

తలచుకొంటేనే ఒడలు జలదరిస్తుంది. 20 ఏండ్లు గడిచినా ఆనాడు అమృతసరులో జరిగిన భీషణ హత్యాకాండ స్మృతి పథంనుండి తొలగిపోదు. ఒకరా—ఇద్దరా—400 మంది మరణించారు. 2000 మంది గాయపడ్డారు. 20 వేల ప్రజలపై—నిరోధించక శాంతముగా ఉన్న ప్రజలపై—'పాఠం నేర్పడానికి' డయ్యరు 1600 రౌండ్లు పేల్చాడు. ఈ చిత్రవధను ఇంతటితో ఎందుకాపెనో తెలుసునా "ఆయుధ సామాగ్రి అయిపోవుట" వలన.

1919 వ సంవత్సరము మార్చి నెలలో హిందూ దేశ ప్రజల బానిసత్వాన్ని మరింత దృఢపఱచే రౌలట్ చట్టం ప్రవేశపెట్టబడింది. రౌలట్ చట్టానికి ప్రతిరేకముగా, ఏప్రిల్ 6 వ తేదీనుండి సత్యాగ్రహము సాగించాలని నిశ్చయింపబడింది. ఏప్రియల్ 6 నుండి 13 వ తేదీవరకు దేశమంతటా పోరాటాలే. సాటిలేని ఐక్యతతో భారతీయులు 6 వ తేదీన హర్తాలు జరిపారు. ఊరేగింపులు సభలు, అత్యుత్సాహంతో జరిగాయి. ఢిల్లీ, కలకత్తా, అహమ్మదాబాదులలో ప్రజలకు పోలీసులకు ఘర్షణలతో, ప్రారంభమై పంజాబ్‌లో మార్షల్ లా ప్రకటింపబడి అమృతసర్‌లోని హత్యాకాండతో ఏప్రిల్ 13 వ తేదీసముగిసింది. స్వేచ్ఛకై, స్వాతంత్ర్యానికై దేశమంతటా జరిగిన పోరాటాలను ప్రతిబింబించుచున్నది ఆవారం.

ఏప్రిల్ 21 వ తేదీన అఖిల భారత కాంగ్రెస్ సమావేశమై. పంజాబు అక్రమాలను గురించి ఇంగ్లండుకు రాయబారము పంపారు. జూన్ 8 వ తేదీన యీ హత్యల విచారించడానికి ఒక విచారణ కమిటీ నియమించారు. తర్వాత అమృతసరులో జరిగిన కాంగ్రెస్ మహాసభలో "వైస్రాయిని ఇంగ్లండుకు పిలిపించాలనీ, జనరల్ డయ్యరును పదవిలోనుండి తొలగించాలిసిందనీ, మైకేల్ ఓడయ్యర్‌ను అతని పదవినుండి తొలగించాలిసిందనీ, మార్షల్‌లా వలన నష్టపడినవారికి పరిహారము కలిగించవలసిందనీ" తీర్మానించబడింది. కాని 'ప్రజలకు పాఠము నేర్పిన' డయ్యరును పొగిడి, ప్రజల కోర్కెలను బ్రిటిషు ప్రభుత్వము తిరస్కరించింది. ప్రజలు పాఠము నేర్చుకొన్నారు: తుపాకుల కాల్పులతోనే గాదు; బ్రిటిషు పతాకానికి నిర్బంధముగా బాల బాలికలచే సలాము చేయించుటవలననే గాదు; ఇరుకుసందులగుండా ప్రజల పొట్టలపై ప్రాకునట్లు చేయుటచేతనే గాదు; సామ్రాజ్యవాదము ప్రజాభిప్రాయాన్ని తిరస్కరించడమువల్ల గూడా, పాఠము నేర్చుకొన్నారు: రాయబారాలతో, సంప్రదింపులతో లాభము లేదని, మితవాదులను విడనాడిన నాటి కాంగ్రెస్ నూతన ఘట్టములో ప్రవేసించింది. 1920 లో ప్రథమ సత్యాగ్రహ సమరాన్ని ప్రారంభించింది।

నేడు మనము జలియన్‌వాలాబాగ్ దినోత్సవము జరపడము, "హిందూ దేశములో బ్రిటిషు ప్రభుత్వములో జరిగిన ఒక అమానుష అవమానకర చరిత్రను తిరిగి స్మృతికి తెచ్చుకొనడానికేనా" అను ప్రశ్న రావచ్చును. కాంగ్రెసు అధ్యక్షుడు చెప్పినటుల "సాధారణముగా ఒకజాతి స్వాతంత్ర్యమూ, ఆత్మగౌరవమూ పోల్పోయినపుడు, బాధలు, అవమానాలు. నిర్బంధమూ జాతీయ ఆత్మ పునర్జీవనానికి తోడ్పడతాయి. జాతీయ వారాన్ని జరుపుట....మన మెంతటి ఉన్నత స్థితినుండి అధోగతికి పతన మయ్యామో జ్ఞప్తికి తెచ్చుకొని, దేశ స్వాతంత్ర్యానికి, స్వయంపరిపూర్ణతకు తగిన అభివృద్ధిని ప్రోత్సహించడానికే"

1919 నాటి ఆ వారము ప్రజాపోరాటాలను—స్వాతంత్ర్య పిపాసను తెల్పింది. ఆనాటినుండి ఈనాటివరకు దేశమెంతో ముందుకు పోయింది. అనేక సమరాలు జరిగాయి. కొన్నిసార్లు మనము సామ్రాజ్యవాదముపై దాడి సలిపాము. పోరాటము సాగించాము. ఓడిపోయాము. కాని ఈ పోరాట ఫలితముగా, ఓటమి ఫలితముగా మన జాతి మేల్కొన్నది. పాఠము నేర్చుకొన్నది: బ్రిటిషు సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించడానికి. నేడు ఆసేతుహిమాచలపర్యంతము, ఉత్సాహభరితమై యున్నది, బ్రిటిషు ఇండియాలో సంస్థానాలలో, కార్మికులలో కర్షకులలో ఉజ్వల చైతన్యము గోచరిస్తున్నది. ఈ జాగృత జాతికి జాతీయ వారము ప్రబోధించవలసిన దేమిటి? నేడు మనము జాతీయవారములో చేయుచున్న దేమిటి? మరో మహా స్వాతంత్ర్య సంగ్రామానికి దారి తీయడానికి జాతిని మేల్కొలపాలి. కాని అటుల జరుగుటలేదు.

జాతీయ వారము ఖద్దరు వారముగా మారిపోయింది. మహాత్ముడు "ఈ వారములో సాధ్యమగునంతవరకు ఖద్దరు స్వయముగా ఉత్పత్తిచేయుట, లేదా కొనుట ప్రతి భారతీయుని ఉత్తమ విధి" అని అన్నారు. అఖిల భారత చర్కా సంఘమువారి ఆంధ్రశాఖ జాతీయ వారమును ఖద్దరు వారముగ మార్చినది. వారి విజ్ఞప్తి ఇది. "ఏప్రిల్ 6 వ తేదీనుండి ప్రారంభముగానున్న జాతీయ (ఖద్దరు) సప్తాహ కార్యక్రమంలో పాల్గొని కృతకృత్యులు కావలెనని విన్నవించుచున్నాము."

ఇక సీతారామశాస్త్రిగారి విజ్ఞాపన చూడండి. "ఈ ఎనిమిది దినములు అఖండ రాట్న యజ్ఞమును జరిపి ఆ వడికిన నూలును యజ్ఞపురుషుడగు శ్రీ గాంధీజీకి అర్పించుట మేలు."

గాంధీవాదుల నిర్మాణ కార్యక్రమములో ఖద్దరొకటి. ఈ నిర్మాణ కార్యక్రమం వారి దృష్టిలో ఆంధ్రపత్రిక చెప్పినటుల "భారత స్వరాజ్య సంపాదన సాధనము. స్వరాజ్య పోషకము, స్వరాజ్య ప్రవర్ధకము" కావచ్చును. అయినప్పటికీ మహమ్మదీయ మనః ప్రవత్తి (సెంటిమెంటు)కి బాధ గల్గించేటట్లు "సప్తాహం", "అఖండ యజ్ఞం", "యజ్ఞ పురుషుడు" మొదలగు పదాలను వాడరాదు. అట్టి హిందూ మత సాంప్రదాయాలు గాంధీవాదుల కార్యక్రమానికైనా తగలరాదు.

మా ఉద్దేశ్యములో ఖద్దరొకటే నిర్మాణ కార్యక్రమము కాదు. కాంగ్రెసు అధ్యక్షుడు ఆదేశించినట్లు "ఖద్దరు ప్రచారము, మద్యనిషేధము, అస్పృశ్యతా నివారణము, వివిధ మత సఖ్యత, కాంగ్రెసు సభ్యులకు చేర్చుట, అవిద్యా నిర్మూలనము" లనే గాక, జాతిని స్వాతంత్ర్య సంగ్రామానికి తయారుచేయుటకు పునాదులను నిర్మించుటే నిర్మాణమని మా అభిప్రాయము. దీనికి కాంగ్రెసు అధ్యక్షుడు సెలవిచ్చినటుల "సామ్రాజ్య ప్రతికూలసంఘాలన్నీ—(కిసాన్, కార్మికసంఘాలు)—కలిసి కాంగ్రెస్ సభ్యులను చేర్పించుట, దొంగ మెంబర్లను తొలగించుట" ఒక కర్తవ్యము. రెండవది మొన్న త్రిపురిలో జరిగిన కాంగ్రెస్‌తీర్మానాలను ప్రజలకు బోధపరచుట. అందులకు బ్రహ్మాండమగు సభలు, ఉత్సవాలు, పతాక వందనాలు అవసరము. ప్రజా సభలకు, సంరంభాలకు, గాంధీవాదులు ఎలా భయపడుతున్నారో చూడండి! కుమారప్పన్‌గారు "సభలూ, ఉపన్యాసాలూ, ఊరేగింపులూ, పతాకవందనాలూ మొదలయినవి ప్రతి గ్రామములోనూ, పట్టణములోనూ, నగరములోనూ జరుపుతూనే ఉంటారు. వీటివల్ల ప్రజలలో తాత్కాలికోత్సాహము మాత్రమే కల్గుతుంది గాని స్థిరమైన లాభము కల్గడము లేదు" అందుకోసమని కుమారప్పగారు "చేతితో తయారుచేసిన కాగితమూ, వస్తువులూ వాడి" చివరకు ఇండియా మిల్లు వస్తువులను కూడ బహిష్కరించి, 20 వ శతాబ్దములో ఉన్నామన్నసంగతి మరచిపొమ్మంటారు. ఈవిధముగా జాతీయవారము యొక్క ప్రధానోద్దేశ్యము పెడత్రోవలకు ఈడ్వబడి పోరాటము సంగతే మరచిపోతున్నాము.

పోరాటము అనేసరికి పట్టాభిగారు ఇలా అంటారు. "దేశాన్ని పోరాటానికి తయారుచేయాలన్న విషయము గురించి చాలా చాలా వింటున్నాము....నిర్మాణ కార్యక్రమ రంగములో జాతీయ సేవ గావించడానికి అడ్డంకులు లేకుండ అవకాశాలను పొందటానికేగదా పోరాటము అట్టి అవకాశాలు కగ్గితే పోరాటమే అవసరము లేదు."

జాతీయ వారంలో 6 దినాలు గడచిపోనే పోయినవి. రేపే తుద దినం. రేపైనాసరియైన నిర్మాణకార్యక్రమం ప్రారంభించాలి. నేడు చాలమంది గాంధీవాదులు, "ఖద్దరు, మద్యపాన నిషేధం, చేతి పరిశ్రమలు, అస్పృశ్యతా నిర్మూలన" మొదలగు కార్యక్రమాన్నైనా చేయడంలేదు. ఒక ఆరు నెలలు కాంగ్రెసు అధికారాలను ఎలా సంపాదించుదామా అని, మరో ఆరునెలలు వచ్చిన అధికారాలను ఎలా నిలబెట్టు కొందామా అని కీచులాటలతో కాలం వృథా చేస్తున్నారు. నైతికపతనం నుండి మేల్కోవాలి.

త్రిపురీ కాంగ్రెస్ "జాతీయ వాంఛా తీర్మానము" ద్వారా దేశాన్ని స్వాతంత్ర్య సంపాదనకు సిద్ధం కమ్మన్నది. ఈ విషయాన్ని మూల మూల ప్రజలకు తెలియజేయాలి. అందుకు సోషలిస్టులు ప్రజలలో ప్రచారంచేయడానికి ఇదివరకే నిశ్చయించుకొన్నారు గాని, చేసిన పనిని గూర్చి ఎట్టి రిపోర్టులుగాని రాలేదు. ఇదివరకు ప్రారంభించకపోతే రేపైనా ప్రారంభించాలి.

యుద్ధచ్ఛాయలు క్రమ్ముకున్నాయి, బానిస రాజ్యాంగ చట్టం మరింత సంకుచితం గావించబడింది. ఈ సంకుచిత రాజ్యాంగ చట్టాన్ని భగ్నము కావిస్తామని, ఫెడరేషన్ నాశనము చేస్తామని, యుద్ధంలో ధనమానవ సాయం సామ్రాజ్యవాదానికి చేయమని, జాతీయ వాంఛా తీర్మానానుసారము దేశాన్ని సత్వర స్వరాజ్య సిద్ధికి సన్నిద్ధము చేస్తామని రేపు శపథం చేయాలి! సామ్రాజ్య వాదానికి అంత్యక్రియలు సల్పాలి. ఇదే మనం నేర్చుకొన్న పాఠం! డయ్యరుకు—కాదు—బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి మనం నేర్పే పాఠం॥

ఈనాటి రాజకీయాలు

ఇండియా చట్టములో సవరణలు

ఏప్రిల్ 6 వ తేది ఇంగ్లండులో, పార్లమెంటు ప్రభువుల సభలో ఇండియాచట్టానికి కొన్ని సవరణలను. ఇండియామంత్రి ఉపపాదించాడు.

యుద్ధము వస్తే? భారతదేశము యుద్ధములో చిక్కుకొనే పరిస్థితులలోనూ, దేశములో శాంతిరక్షణ అలవిగాక పోయినప్పుడున్నూ, ఫెడరలు శాసనసభ, రాష్ట్రీయశాసనసభలను త్రోసి రాజని, తన ఇష్టము వచ్చిన చట్టాలు చేయడానికి ఇప్పుడున్న చట్టములోనే వీలుంది. రాష్ట్రశాసనసభలు, ప్రజామంత్రుల చేతులతో ఉంటాయి కనుక అవసరమయినప్పుడు, పరదేశ ప్రభుత్వపు అధికారాన్ని శాశ్వతముగావించు శాసనాలను చేయుటకు పనికివచ్చుననియే, తమ గులాములగు స్వదేశసంస్థానాధీశుల ప్రతినిధులతోను, తదితరులతోను నిండియుండు ఫెడరలు శాసనసభకు ఇట్టి ప్రత్యేక అధికారమును కల్గించియుండిరి. కాని ప్రస్తుతపు చట్టంలో, ఈ ఆత్యవసర ఫెడరల్ శాసనములను అమలులో పెట్టవలసిన బాధ్యత రాష్ట్ర మంత్రివర్గాల మీద ఉన్నదని కాదు. దానిని ఆధారముగ తీసుకొని, ప్రజామంత్రివర్గాలు, ఇండియా ప్రభుత్వానికి అనేక ఇబ్బందులు కలిగించవచ్చును. అట్టి హక్కులుకూడ లేకుండునట్లు ఇప్పుడీ సవరణ తేబడినది. దీనిప్రకారము గవర్నరుజనరలు, భారతదేశము యుద్ధములో చిక్కుకొనే పరిస్థితులున్నాయని ప్రకటించినంత మాత్రాన, ఫెడరలు శాసనసభ, వివిధరాష్ట్రాలకు, అన్నివిషయాలందు శాసనములొనర్పగలదు. వానిని రాష్ట్రమంత్రివర్గము ఆచరణలో పెట్టితీరాలి.

ఇంతటితో ఊరుకోలేదు. పన్నులు వేసే అధికారాన్ని లాగివేశారు.

మంత్రి వర్గాలకు డబ్బు లేదు. కాంగ్రెసుమంత్రివర్గాలకు, ప్రజల కనుకూలమైన సౌకర్యాలు చేయుటకు తగినంత డబ్బులేదు. ఆయినా ఏదోరీతిని క్రొత్తపన్నులు విధించి, తమ కార్యక్రమాన్ని అమలులో పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. బీరారులో ప్రత్తిపంట సరిగా పండనందున, 33 లక్షల పన్నులో 9 లక్షల పన్ను రిమిషను ఇచ్చింది ఇంకను ఇవ్వమని శాసనసభ్యులు ఆందోళన చేసినపుడు, రాష్ట్రముయొక్క ఆర్థికస్థితి తారుమారవుతుందని మంత్రులు జవాబు చెప్పవలసివచ్చింది. బొంబాయి మంత్రివర్గము మద్రాసుకన్న ఒక్క అడుగు మద్యపాన నిషేధమందు ముందడుగు వేసింది, బొంబాయిలో పూర్తిగ మద్యపాన నిషేధాన్ని ఈ సంవత్సరములో బొంబాయి రాష్ట్రమంతటా అమలులో పెట్టుతామని మున్షి ప్రకటించాడు.

ఈ లోటును పూడ్చడానికి వేసిన క్రొత్త పన్నులలో ఒకటి విద్యుచ్ఛక్తి కంపెనీలమీద. ఈ పన్ను

విద్యుచ్ఛక్తిపై పన్ను వేయకూడదు. ముఖ్యంగా ధనికులమీదనే పడుతూ ఉంది. దీని వలన వచ్చే పన్నునుకూడ రాష్ట్ర ప్రభుత్వాలకు లేకుండ జేయుడానికి ఇండియా చట్టములోని ఒక సవరణ పనికి వస్తుంది. ఫెడరలు శాసనసభ అనుమతి లేకుండా, ఫెడరలు ప్రభుత్వానికి, ఫెడరలు రైల్వే బోర్డుకు లేక ఫెడరలు రైలుమార్గాలలో రైళ్ళను నడుపుటకు కావలసిన విద్యుచ్ఛక్తిమీద పన్ను వేయకూడదట. పన్ను వేసినచో మామూలుగ విద్యుచ్ఛక్తిని ఎక్కువగా కొనుక్కొను వారికి గిట్టుధరకు, పన్నుమొత్తమును తీసివేసి, మిగిలిన ధరకే విద్యుచ్ఛక్తిని ఫెడరలు ప్రభుత్వానికి, ఫెడరలు రైల్వేబోర్డువారి పనులకు సరఫరా చేయాలట.

ఇంగ్లండు ఉద్యోగులకు పెన్షలు మనమివ్వాలి మన దేశమునుండి ఇదివరకే 30 కోట్ల రూపాయల వరకు భారతదేశములో పనిచేసివెళ్లిన ఇంగ్లీషు ఉద్యోగస్థులకు పెన్షనులక్రింద, తదితర ఖర్చుల క్రింద ఖర్చు పెడుతున్నారు. ఐ. సి. యస్., ఐ. యమ్ యస్. మొదలగు ఇంగ్లీషు పట్టాలను పొందిన ఉద్యోగుల జీతాలను తగ్గించడానికి వీలు లేదన్నారు. ఇది చాలక, భారతదేశములో పనిచేయడానికని ఇంగ్లండులోని ఉద్యోగులను కొంతకాలము (ఇచ్చటికి వారి హక్కుల రక్షణార్థము, మన సంకెళ్ళను మరింత బిగువు చేయుటకు) పంపితే వారికికూడ పెన్షనులను కొంతవరకు మన దేశమే ఇచ్చుకోవాలని మరియొక సవరణ.

ఇంతవరకు మన దేశములో 562 సంస్థానాలే ఉన్నాయి.

సంస్థానాలంటే ఇకముందు స్వదేశ సంస్థానానికి క్రొత్తఅర్థము చెప్పబడుతుంది మరియొక సవరణలో. అది సంస్థానమంటే. బ్రిటిషు ఇండియా భాగానికి చెందని ఒక సంస్థానముగాని, ఎస్టేటుగాని, జాగీరుగాని, మరి యేపేరుతోనైనా పిలువబడే ప్రదేశము. ఇట్టి సంస్థానాలు మనదేశములో ఎన్ని వేలుంటాయని ముందు ప్రకటిస్తారో చూడాలి. వానినన్నిటిని శాశ్వతముగా బ్రిటిషు ప్రభుత్వము, రక్షించడానికి హామీ ఇస్తుందనే ఈ సవరణ కర్థమయి ఉండాలి.

కండ్లు తుడవడానికి ఈవిధంగా మన హక్కులను తొలిగిస్తూ కండ్లనీళ్లు తుడవడానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు బెనారస్, అలిఘర్ విశ్వవిద్యాలయాలమీద తప్ప మిగిలిన విశ్వవిద్యాలయాలను గూర్చి శాసనములుచేసే హక్కు ప్రతిపాదించింది. రస్తాలపై పోయే బండ్లమీద పన్నులు వేసుకోవచ్చునంది. రస్తాలపై పోయే బస్సులు, ఎద్దుబండ్లు, ఎక్కువ భారతీయులవే కాబట్టి, వానిపై పన్నులు భారతీయులే ఇచ్చుకుంటారు. కనుకనే ఈ దయ!

భారతీయ పరిశ్రమలు:టారిఫులు

వర్తకపు ఒడంబడిక భారతీయ పరిశ్రమలకు ఇండో బ్రిటిషు ఒడంబడిక ఏవిధంగా నష్టమో నవశక్తి పాఠకులకు ఇదివరకే తెలుసు. దానిని అస్సెంబ్లీ త్రోసివేసినా, ఆచరణలో పెట్టడానికి టారిఫ్ చట్టాలను తెచ్చారు. ఈ టారిఫులను మార్చుటకు కొన్ని సవరణలను కాంగ్రెసు వారిచ్చిఉన్నారు. కాని వానికి వైస్రాయి అనుమతి కావాలసి యుంటుందని, అట్టి అనుమతి వైస్రాయి ఇవ్వడని, అందుచే అసలుచట్టాన్నే త్రోసివేయాలని కాంగ్రెసు పార్టీ నిశ్చయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి.

టారిఫ్ చట్టము బియ్యము, పట్టు, కాగితపు, పరిశ్రమ, మెగ్నీషియము క్లోరైడులపై దిగుమతి పన్నుల గూర్చి ఒక చట్టము ఢిల్లీ అస్సెంబ్లీలో తేబడింది. విదేశాలనుండి మన దేశానికి దిగుమతిఅయ్యే బియ్యము పైన, పట్టుపైన, పట్టు గుడ్డలపైన మునుపటి లాగనే పన్నులు మరియొక సంవత్సరమువరకు మాత్రమే ఉంటాయి. అంతకన్న ఎక్కువ ఉంచడానికి వీలు లేదని ఆర్థిక సభ్యుడన్నాడు. కాగిత పరిశ్రమకు పౌనుకు 11 దమ్మిడీలు రక్షణ సుంకముండాలని టారిఫ్‌బోర్డు సూచించి ఉంటే, 9 దమ్మిడీలే సరిపోతుందన్నాడు. ఇందులోను గడ్డినుండి కాగితము తయారుచేసినచో ఎట్టి రక్షణలేదు. కేవలము వెదురునుండి తయారుచేసిన కాగితమునకే ఈ రక్షణమైనా, అదీ కేవలము మూడు సంవత్సరాలవరకే. టారిఫ్‌బోర్డు 7 సంవత్సరాలవరకు ఇవ్వమని సూచించింది. మెగ్నీషియము క్లోరేడుకు హండ్రెడువెయిటుకు (112 పౌనులకు) 15 అణాలు రక్షణ ఉండాలని టారిఫ్ బోర్డువారి సూచన. ఆర్థిక సభ్యుడు అది చాల ఎక్కువ, 12 అణాలు సరిపోతాయంటాడు. చక్కెర పరిశ్రమకు 15 సంవత్సరాలు హండ్రెడ్‌వెయిటుకు రు 7-4-0 వంతున రక్షణ ఉండాలంటే, ఇప్పటికి 9 సంవత్సరాలనుండి ఇచ్చాము, మరియొక రెండు సంవత్సరాలు 6-12-0 వంతున ఇస్తాము, ఆపిమ్మట మానివేస్తామని ఆర్థిక సభ్యుడంటాడు. చాల నిపుణులైన ఆర్థికవేత్తలు, ప్రభుత్వముచే నియమించబడినవారే, చేసిన సూచనలను కూడ ప్రభుత్వము ఆచరణలో పెట్టకపోతే మన పరిశ్రమలపై దాని సవతితల్లి ప్రేమ ఎలా ఉన్నదీ స్పష్టముగ తెలుతూఉంది. అందుచేతనే అస్సెంబ్లీ విదేశాలనుండి వచ్చే కాగితముపై ఖరీదునుబట్టి నూటికి 25 వంతునగాని లేక టన్నుకు 35 రూపాయలు లు గాని ఏది ఎక్కువయితే ఆపన్ను విధించవలసినదిగ తీర్మానించింది. అయితే తీర్మానము వైస్రాయి బుట్టదాఖలు చేస్తాడని మనము గట్టిగా నమ్మవచ్చు.

దీనికితోడు, ఈ కాస్త రక్షణ ప్రయోజనముకూడ లేకుండ జేయడానికి, విదేశీయ మూలధనంతో, విదేశీయ మేనేజ్‌మెంటు క్రింద 150 పరిశ్రమాగారాలు మన దేశములో స్థాపించబడ్డాయని భారతీయ వర్తక ఫెడరేషను అధ్యక్షుడు ప్రకటించాడు.

ముస్లింలీగు దాడి

కాంగ్రెసుబలాన్ని, ప్రజామంత్రివర్గాల బలాన్ని అణచివేయడానికి బ్రిటిషు ప్రభుత్వము కేవలము ఇండియా చట్టములో మార్పులు చేయడముతోగాని, భారతీయ పరిశ్రమలను విచ్ఛిన్నముగావించే టారిఫువిధానములోగాని తృప్తిచెందడము లేదు. ఒకవైపు ముస్లింలీగు, హిందూమహాసభలలాంటి మత సంస్థలను రెచ్చగొట్టుతూ ఉంది. మరియొకవైపు జమీందారులను సంఘీకృతము గావించడానికి ప్రయత్నిస్తూ ఉంది.

పీర్‌కమిటీ: వార్ధా విద్యా విధానము ముస్లింలీగు నియమించిన పీర్‌కమిటీ: "వార్ధా విద్యావిధానము ఉర్దూ భాషాభివృద్ధికి అడ్డంకి, మహమ్మదీయులయొక్క మతసాంప్రదాయాలను, నాగరికతను రూపుమాపుతుంది. అంతేగాక మహమ్మదీయులు, ఒక ప్రత్యేకజాతి (నేషనాలటీ). వారి జీవిత సమస్యలన్నిటిపై వారిదృక్పథమువేరు, వారికిని, ఈ దేశీయుల రక్తముతోగాని రంగుతోగాని, ఎట్టి సంబంధమూలేదు అందుచే మహమ్మదీయులకు తమ విద్యావిధానమందు పూర్ణ స్వతంత్రత ఉండాలి. దాని ధోరణి, దాని ఆర్థికస్థితి, పాఠక్రమము (సిలబసు), పరిశీలన, అన్నీవారి చేతిలోనే ఉండాలి." అని నివేదించింది.

దేశీయైక్యతకు ఇంతకన్న వినాశకరమైన పద్ధతి ఇంకొకటి అదిసూచించి యుండలేదు.

ముస్లింలీగు: సంస్థానాధీశులు ముస్లింలీగ్ రాజకోటలో గాంధిజీ ఉపవాసాన్ని ఖండించింది. ఇదివరకు రాజకోట రాజు ఏర్పరచిన ఇరువురు మహమ్మదీయులను, సంస్కరణకమిటీ నుండి తీసివేయగూడదట! జైపూరునుండి ఢిల్లీకి వెళ్లి ప్రవాసము వెళ్లిన 6000 మంది మహమ్మదీయులను వెనక్కివెళ్లి పోరాటము ముగించమన్నది, హైదరాబాదు నవాబుకు వ్యతిరేకంగా, హిందువులు, కాంగ్రెసు సాయముతో తమ మత హక్కులు కాపాడుకోదానికనే నెపంతో దాడివెడలు తున్నారట! ఇది మాననిచో, లేక దీనిని ఇండియా ప్రభుత్వము అణచివేయనిచో మతపోరాటాలు తప్పవట!

ఢిల్లీ ముస్లిం లీగు సభలో మహమ్మదాబాద్ నవాబు, భారతదేశాన్ని అనేక చిన్న ధాగాలుగ విభజించాలన్నాడు! హిందువులందరు కొన్నిచోట్లలో, మహమ్మదీయులంతకు మరి కొన్నిచోట్లలో, గుమిగూడాలట! అనకంగా దేశమంతట జరుగాలట! ఈ వివిధ సమూహాలకు పూర్ణస్వాతంత్ర్యము కావాలట.

బెంగాలు ముస్లింలీగు సభలో బెంగాలు ప్రధాని ఫజ్లుల్‌హక్కు హిందువులు అన్యాయము చేస్తున్నారు కాంగ్రెసుమంత్రి వర్గాలు మహమ్మదీయులను పీడిస్తున్నారు అందుచే మహమ్మదీయులందరూ ఒకటికావాలనీ, ఉపన్యసించాడు!

జమీందారుల దాడి

భారతదేశములోని జమీందార్లందరూ లక్నోలో ప్రోగయ్యారు దర్భాంగ రాజాధిరాజు యాజమాన్యాన. కాంగ్రెసు మంత్రివర్గాలు, తమవర్గాన్ని లేకుండ జేయడానికి పూనుకొన్నారని సర్‌మహమ్మద్ యూసఫ్ అన్నాడు. బెంగాలు ప్రభుత్వముకూడ వారి ననుసరించడము ఆశ్చర్యమన్నాడు!

దర్భాంగ రాజాధిరాజు ఇలా అన్నాడు : జమీందారీ విధానం, పెట్టుబడిదారులకు కూలీలకుమధ్య పెట్టుబడిదారులను రక్షిస్తున్న ఒక చక్కని కోట. ఆ కోట పోయిన మరుక్షణమే పెట్టుబడిదారీవర్గము కూడ ఉండదు. పెట్టుబడిదారులు, జమీందారులు లేనిచో ఈ దేశములో సంతృప్తి, శాంతి ఉండవట! జమీందారుల పొలాలను లాక్కోవడము, దోచుకోవడము బెదరించడము, ఖూనీలు చేయడము ప్రతిరోజూ పరిపాటయి పోయింది, ఇకనైన కాంగ్రెసు మంత్రివర్గాలు మేల్కొని ఈ అరాజకాన్ని అరికట్టాలట. బ్రిటిషు ప్రభుత్వానికి యుద్ధమువస్తే తమ సర్వశక్తులను బ్రిటిషు ప్రభుత్వాన్ని రక్షించడానికి తయారుగా ఉన్నామని అభయమిచ్చాడు. అంతేకాదు. దానికోసం జమీందారులందరూ ఒకే సంఘముగా ఏర్పడాలన్నాడు.

ఫరీకీ అను రత్నపూరు నవాబు (బెంగాలు) జమీందారులను కేవలము శిస్తు వసూలు చేసేవారినిగా అనేకచట్టాలు చేసివేసే శాయని వగచాడు. మైత్రాయి సూచన ననుసరించి, తమరైతుల సహకారము సంపాదించడానికి పూనుకోవాలన్నాడు. దానికి మార్గం రిజర్వుబ్యాంకు, వారికి అప్పు ఇవ్వడానికి తయారుగ ఉంది. ఆ డబ్బుతో ఒక కేంద్ర సిండికేటును ఏర్పరుస్తారట. దాని శాఖలు ప్రతి ఎస్టేటులో ఉంటాయి. ఆ ఎస్టేటురైతులకు మార్కెటు ధరలేలా ఉన్నాయో ఎప్పటికప్పుడు తెలియజేస్తారట రైతుల ధాన్యానికి, అంతకుముందు మూడు సంవత్సరాలలోని ఏవరేజి ధరను వారి పంటకు ఇస్తారట! అందునుండి జమిందారుకు కట్టవలసిన మగతాను మాత్రము మినహాయించుకుంటారట. పిదప ధాన్యమును అమ్మిన పిమ్మట ఎక్కువగా ఏమైనా వస్తే తిరిగి రైతులకిస్తారట. ఈవిధానమువలన రైతుకు లాభం వస్తుందని అతడువాదిస్తాడు. దానితో మనమెవ్వరమూ ఏకీభవించలేము. కాని అతని ఈ ఆఖరి వాక్యాలను అందరమూ అంగీకరిస్తాము. "ఈపద్ధతి జమీందారులకొక గొప్ప వరము లాంటిది. ఎందుకంటే వారి శిస్తులను రొఖ్ఖంగా వసూలు చేసి పెట్టుతాయి ఈ సిండికేటులు. చాల ఖర్చుపెట్టి అనేకులను నియమించాలసిన బాధ తప్పుతుంది. కోర్టుల కెక్కి డిక్రీలు పొందడము మరిఇట్టి ఇతర కతిపర్యలను తీసుకోవడము కాని, అవసరముండదు." అవును, నిజమే. ఈ సిండికేటు జమీందారుల కంత లాభకరము కాబట్టే, వారు సూచించారు. కాని రైతులెవరూ దానిలో చేరరు. చేరడము ముప్పు అని తెలుసుకోవాలి.

కాంగ్రెసు ఏమి చేస్తూ ఉంది

ఈవిధంగా అన్నివైపులా ప్రజా స్వాతంత్ర్య పోరాటముపై దాడి ఆరంభమవుతూ ఉంటే కాంగ్రెసు మంత్రివర్గాలు, కాంగ్రెసు సంఘాలు ప్రజా సామాన్యమూ ఏమి చేస్తున్నాయో చూస్తాము.

యు. పి. కాంగ్రెసు తీర్మానము సంయుక్తరాష్ట్ర కాంగ్రెసు వర్కింగు కమిటీ "ఇండియా చట్టములోని క్రొత్త మార్పులకు, ముఖ్యంగా యుద్ధంవచ్చినప్పుడు హక్కులను సంకుచిత పరచడాన్ని, అంగీకరించవద్దు; వీటిని లక్ష్యము చేయక కాంగ్రెసు విధానాన్ని మంత్రివర్గాలు ఆచరణలో పెట్టాలి" అని హెచ్చరించింది. అంటే అవసరమయితే ప్రతి ప్రభుత్వముకూడ సాగించడానికి తయారు కమ్మనినది. అంతేకాదు ఈలాంటి కార్యక్రమము అవలంబించాలంటే సుశిక్షిత వాలంటీరు సైన్యముండాలని తెలుసు కొని పనిచేస్తూ వచ్చింది. గత 6 మాసాలలో 30 జిల్లాక్యాంపులు, 103 తాలుకా క్యాంపులు నడిపింది. 60 వేల మందికి మిలటరీ శిక్షణ యిచ్చింది. వచ్చే 6 నెలలలో 10 వేల మంది స్త్రీలనుకూడ ఆలాగే తయారుచేయడానికి పూనుకుంది.

కేరళరాష్ట్ర కాంగ్రెసు సంఘముకూడ ప్రతి తాలూకాకు 500 మంది నైనా వాలంటీర్లను తయారు చేయాలని సంకల్పించింది.

బొంబాయిలో అప్పుల నివారణ బిల్లు. కాంగ్రెసు మంత్రివర్గాలు, ప్రజలను పోరాటములోనికి తీసుకరావడానికి వారి కష్టాలను తమకు సాధ్యమైనంతవరకు తీర్చడానికి ప్రయత్నిస్తున్నారు. బొంబాయి మంత్రివర్గము, ఈవారము అస్సెంబ్లీలో అప్పుల నివారణ బిల్లు ప్రవేశపెట్టారు. పొలాలను స్వయముగా సాగుచేసుకొనే వారిలో 100 రూపాయలకు తగ్గని, 15000 రూ. లకు మించని అప్పున్నవారికి ఇది వర్తిస్తుంది. ఇట్టి ఋణగ్రస్తుడు కో-ఆపరేటివు సొసైటీలో సభ్యుడుగా ఉండాలి. అతను ఎంత చెల్లించగలడో నిర్ణయించడానికి ఒక బోర్డును ప్రభుత్వము ఏర్పరుస్తుంది.

పంచాయితీ బిల్లు బొంబాయిలో గ్రామపంచాయితీ చట్టాన్నిగూడ చేశారు. 2000 జనాభా ఉన్న ప్రతి గ్రామములోను నిర్బంధంగా పంచాయితీబోర్డును ఏర్పరచాలి. వీనికి నామినేషనులు ఉండవు, ఆస్థానాలన్నీ ఎన్నికద్వారానే పూర్తికావాలి. సివిల్, క్రిమినల్‌కేసులను విచారించి తీర్పులిచ్చే హక్కులతో గ్రామ కోర్టులనుగూడ ఈబిల్లు ఏర్పాటు చేస్తుంది.

మ్యునిసిపలు చట్టాలు మధ్యపరగణాలలో మ్యునిసిపలు అధ్యక్షులను, మ్యునిసిపలు సభ్యులుగాక, మామూలు ఓటర్లే ఇకముందు ఎన్నుకుంటారు, అధ్యక్షునిమీద విశ్వాసము లేనిచో కేవలము మెజారిటీతో తొలిగిస్తారు. ఈ రెండు సూచనలు ప్రజాతంత్ర హక్కులను క్రొంతవరకు గుర్తిస్తున్నాయి. కొన్నిరాష్ట్రాలలో మూడింట రెండువంతులుగాని, ముప్పాతిక మెజారిటీగాని రానిదే విశ్వాసరాహిత్య తీర్మానము ప్యాసుకాదని ఉంది. దీనిమూలాన, ఎక్కువమంది నూటికి 51 మంది సభ్యులు ఇష్టపడక పోయినా అధ్యక్షుడు ఉంటాడు కాని అతని పనిని దేనినికూడ కమిటీ అంగీకరించదు కాన అతడేమి చేయలేక పోతున్నాడు. ఇట్టి గొడవను ఈ బిల్లు తొలిగిస్తుంది.

మాతృ సహాయ చట్టము మద్రాసు ప్రభుత్వము యజమానులు తాము పనిలో నుంచు స్త్రీలకు గర్భము వచ్చినప్పుడు చట్టముప్రకారం సహాయము చేయక తప్పించుకోవడము కనిపెట్టింది. ఇకముందు ఆలా జరుగకుండా చేయాలని ఒక సవరణవేసింది. ముందుచట్టములో ఒక స్త్రీ తనకు మాతృత్వ సహాయ మివ్వవలసినదిగా అర్జీపెట్టుకొన్న నాటికి 9 నెలలు ఆ యజమానుని వద్ద వరుసగా పనిచేసి ఉంటేనే సహాయము ఇవ్వవలసిఉండేది. ఈ 9 నెలలకు మామూలుగా యజమాని ఇవ్వవలసిన సెలవులే గాక, మరి 14 దినాలు సెలవులనుకూడ కలిపి యెంచేవారు. అయినా లాభ ముండేదికాదు. ఇప్పటి సవరణ ప్రకారం ఒక యజమానియొక్క ఏ ఫ్యాక్టరీలో పనిచేసినా, అర్జీ పెట్టుకొన్న నాటికి ఒక్క సంవత్సరము నుండి 240 రోజులు పనిచేసి ఉంటే, మాతృత్వ సహాయము వస్తుంది. కాని ఇది కార్మికులకు కావలసినంత సౌకర్యము కలుగజేయడము లేదు.

బొగ్గు గనులను సురక్షితము గావించు బిల్లు బొగ్గు గనులలో పనిచేసేవారి ప్రతినిధులనుగూడ, వసూలైన బొగ్గు సెస్సును వినియోగించే కమిటీలో వేయాలని ఢిల్లీ అసెంబ్లీలో కార్మికనాయకుడు యన్. యమ్. జోషి ఒక సవరణ తెచ్చాడు. దానికి ఒక్క రంగా తప్పితే మరే కాంగ్రెసు సభ్యుడుకూడా ఓటు చేయలేదు. తటస్థంగా ఉన్నారు. బొగ్గు గనులను సురక్షితముగా ఉంచడానికని తెచ్చిన చట్టమును అమలులో పెట్టునపుడు ప్రభుత్వము చేయు ఆర్డరులను పరిశీలించడానికి, మార్పుచేయుమని సూచించడానికి ఒక కమిటీని ఏర్పరుస్తారు. దానిలో కార్మిక ప్రతినిధు లిరువురుండాలని జోషీ మరియొక సవరణ పెట్టాడు. రంగా తప్పితే మిగిలిన కాంగ్రెసు సభ్యులు తిరిగి తటస్థంగా ఉన్నారు. ఈ దృక్పథము కార్మికులను కాంగ్రెసునుండి దూరముచేయడానికి తోడ్పడుతుంది.

మద్రాసులో వైద్య సహాయము విశాఖ పట్టణములోని మెడికలు కాలేజీ డిగ్రీలను మెడికలు కౌన్సిలు రెండేండ్ల వరకుగుర్తించింది. మద్రాసు మంత్రివర్గము దీనికై కృషి చేసింది. కాని పూర్తిగా ఎట్టి కాలపరిమితి పెట్టక గుర్తించేటట్లు చేయాలి.

హెల్తు కో-ఆపరేటివులు డాక్టరు రాజన్ అన్ని గ్రామాలకు నిపుణతగల్గి, వైద్యమును పూర్తిగా నభ్యసించిన డాక్టరులుదొరుకుటకు ఆ మధ్య హెల్తు (ఆరోగ్య) కో-ఆపరేటివు సొసైటీలను సూచించాడు. కొన్ని గ్రామాలకు ఒక కేంద్రాన్ని (సొసైటీని) ఏర్పరచాలి, ఈ గ్రామాలు 2000 కుటుంబాలకు మించరాదు. 1000 కుటుంబాలకు తగ్గరాదు. కనీసము 500 మంది వ్యక్తులు కుటుంబానికి ఒకరు చొప్పున ఈ హెల్తుసొసైటీలో చేరుతారని ఆశించవచ్చు. ప్రతివ్యక్తి నెలకు 0-2-0 లు వంతున సంవత్సరానికి 1-8-0 చెల్లించాలి. సభ్యులకు మందులు ఉచితముగా ఇవ్వబడుతాయి. కాని డాక్టరు ఇంటికి వచ్చి పరిశీలించాలంటే వచ్చినపుడెల్లా 0-4-0 ఇవ్వవలసి ఉంటుంది, ఈ డబ్బుకూడ హెల్తు కో-ఆపరేటివుకే జమకట్టబడుకు. దీనికి మూలధనము రు. 1000 లు కావలసి ఉంటుంది. ప్రతి సంవత్సరమూ మరియొక రు. 900లు కావలసి ఉంటుంది. మూల ధనాన్ని ప్రభుత్వముగాని, జిల్లా బోర్డులుగాని సరఫరా చేయాలి, ప్రతి సంవత్సరము కావలసిన డబ్బు సభ్యుల చందాల మూలంగా ప్రోగవుతుంది.

ఈ స్కీముకు మైసూరు ప్రభుత్వ మవలంబించిన పద్ధతి, అమలంపంగా ఉంటుంది. ఒక కేంద్రమునుండి చుట్టూ ఐదు మైళ్ళ దూరములోనున్న గ్రామాలకు వారానికి రెండు పర్యాయాలు వైద్యసహాయము అందజేయడము, దీనికి ఒక నాలుగు చక్రాల ఎద్దుబండి. ఆ బండికి వెనుకాల మందులతో నిండిన మరియొక చిన్నబండి తగిలించి ఉంటుంది, ఈ బండితో గూడ డాక్టరేగాక, ఒక ట్రెయిన్డు ఆరోగ్యశిక్షణను పొందిన నర్సు ఉంటుంది. ఈనర్సు పని, తల్లులు కనుటకు ముందు, కనిన పిదప తీసుకొనవలసి నంత శ్రద్ధ తీసుకొనేటట్లు చేయడము. ఈపద్ధతి మూలాన, గ్రామ పారిశుభ్రము, వ్యక్తి శుభ్రత, గ్రామాలలోని బిడ్డలకు తప్పక వైద్యపరీక్ష, క్వినైన్ ఇటువంటి పేటెంటు మందులు అందరకూ అందుబాటులో ఉండడము సాధ్యమవుతుంది.

దేశమందంతటా ఈస్కీమును ఆచరణలో పెట్టించగల్గితే ఎంతో లాభకారి. కాని కేవలము గ్రామస్థుల సహకారబుద్ధికే ఏదిలివేస్తే లాభముండదు. ప్రభుత్వము దీనికయ్యే ఖర్చులన్నీ భరించడానికి కూడ తయారుకావాలి.

లంచగొండితనము : బొంబాయి మంత్రి వర్గము లంచగొండితనాన్ని పోగొట్టడానికి బొంబాయి మంత్రివర్గం ప్రతి జిల్లాలోను ఒక కమిటీని ఏర్పరుస్తుంది. దానికి అధ్యక్షుడు జిల్లాకలెక్టరు. అందు ఇద్దరు అనధికార సభ్యులు. జిల్లా పోలీసు సూపరింటెండెంటు ఉంటారు. ఇద్దరి అనధికార సభ్యులను, కలెక్టరు ప్రభుత్వామోదాన్ని పొంది నియమిస్తారు. ఈ కమిటీకి అన్ని డిపార్టుమెంటు అధిపతులు పూర్తిగా సహకారము చేస్తారు. ఈకమిటీ చేసిన సూచనలను ఆయా డిపార్టుమెంటులు ఆచరణలో పెట్టవచ్చు. పెట్టితీరాలి అని నిబంధనలేదు. ఈ కమిటీ వలన అట్టే ప్రయోజనముండదు. అనధికార సభ్యులు మెజారిటీ ఉండాలి. వారి సూచనలను తప్పక అమలులో పెట్టితీరాలి. అప్పుడే ఫలితముంటుంది.

సింధు మంత్రి వర్గము: వివాహ కట్నాలు కాంగ్రెసు మంత్రివర్గాలిన్ని మంచిపనులు చేస్తూఉన్న సాంఘిక విషయాలలో ఇంకా ముందంజవేయాలి. కాంగ్రెసేతర సింధు మంత్రివర్గము వివాహాలలో కట్నాలు 500 రూపాయలకు మించి ఇవ్వగూడదని, ఇచ్చినచో 1000 రూపాయలు జరిమానా, లేక ఒక నెల ఖైదు లేక రెండూ విధించవచ్చునని చట్టము చేసింది.

(మిగతా 21 వ పేజీలో)

కిసాన్ సభ సభ్యులు

గత సంవత్సరం ఆయా ప్రాంతాలలో రైతు సంఘ సభ్యు లీవిధంగా చేరారు.

బీహారు	409,000
ఆంధ్రా	48.000
పంజాబ్	37,308
తమిళ్‌నాడ్	20.000
మలబార్	10,000
సి. పి. మూరాతి	2,300
సింధు	3.200
బీరార్	176
సుర్మా-వల్లీ (అస్సాం)	26,500
గుజరాత్	6,800
హైద్రాబాద్ (దక్కన్)	5,000
ఒరిస్సా సంస్థానాలు	30,000
ఒరిస్సా	20.000
తిరువాన్‌కూరు	2,500
మైసూరు	2.500
బెంగాలు	48.377
మొత్తం	6,72.161

యు. పి మహారాష్ట్ర, కర్నాటక, ద॥ ఇండియా, రాజపుతానా సంస్థానములనుండి సరియైన లెఖ్ఖలు ఇంకా రాలేదు. మొత్తం సభ్యుల సంఖ్య 7 లక్షలు ఉంటారు. గయ మహాసభలో పూర్తి వివరాలు ప్రకటింపబడతాయి.

బీహారు

పండిట్ రాహుల్ సంకృతాయన్‌ను ఇదివరకు అమానుషంగా కొట్టారు. మరల మార్చి 12 వ తేదీన రియొలా సత్యాగ్రహ నాయకుడగు డాక్టర్ రాధాక్రిష్ణన్‌గారిని మాలషైర్ జిల్లా గహలౌర్ గ్రామంలో జమీందారు తరఫు 'గూండా' (రౌడీ) లు అమానుషంగా గాయపఱిచారు.

గాయపడి, రక్తం కారుతున్న డాక్టర్‌ను గ్రామంచుట్టూ త్రిప్పారు. మంచంమీద పడుండి, శాంతియుతంతా ఉండవలసిందని. ఆవేశపరులైన రైతులకు బోధించాడు. బీహార్ కిసాన్ సభాకార్యదర్శి, అవదేన్‌ప్రసాద్ సిన్హా, కిసాన్ సభ హింసగావించుచున్నదన్న ఆరోపణలను ఖండించుతూ ఒకప్రకటన గావించారు. "ఈదౌర్జన్యంనుండి నేర్చుకోదగిన పాఠం జమీందార్లు చేస్తున్న గూండాయిజాన్ని హింసను, దౌర్జన్యాన్ని, అపవలసిన ఆవశ్యకత ఉన్నది" అని తెలియజేశాడు.

స్వామీ సహజానంద సరస్వతీగారీ ఘోర కృత్యాన్ని ఇలావర్ణించారు.

"రియొరా సత్యాగ్రహం జయప్రదంగ జరిపిన తర్వాత డాక్టర్, గహలేర్ అనే గ్రామానికి వెళ్లారు. ఆ గ్రామంలోని పేదలైన రైతులు (గోవాలాలు, కూమెరీలు) జమీందారీ దౌర్జన్యం వలన ఆ గ్రామాన్ని విడిచిపెట్టి, దగ్గరగానున్న మరొక జమీందారీ గ్రామంలో గుడిసెలలో నివసిస్తూ సాగారు. వాళ్ల పరిస్థితులు చాలా హీనంగా ఉన్నాయి. దారిద్ర్యం తాండవిందు తున్నది. బాధల వర్ణించడానికి అలవికాదు. అయినా ఆ జమీందార్ల భూములు, కొన్ని వాళ్లచేతన, మరి కొన్ని ఇతరులచేతను వ్యవసాయం చేయబడుతున్నాయి. ఆ గ్రామస్థులు పదే పదే కోరుటచేత అచటి పరిస్థితుల గూర్చి స్వయంగా తెలుసుకుందామని మా డాక్టర్ వెళ్లారు. మార్చి 12 వ తేదీన, 4 గంటలకు డిప్యూటీ సూపరెండెంటు ఎదుటను, స్థానిక పోలీసుల యెదుటను ఒక ఉపన్యాస మిచ్చారు. డాక్టర్ వారి కష్టాలను గురించి ప్రశ్నలడిగి, వారిని ధైర్యంగాను: ఖచ్చితంగాను ఉండమని, అహింసాత్మకంగా ఉండాలని బోధించారు. తిరిగి గయకు డాక్టర్‌ను తీసుకువద్దామని, వెళ్లిన గయా జిల్లా కార్యదర్శియగు యస్. డి. ఓ. ఈ విషయాన్ని గురించి ఒప్పుకొన్నారు.

5 గంటలకు మీటింగు పూర్తి అయాక, పోలీసులు, ఒక ప్రక్క వెళ్లి పోయారు. ఇంకా ప్రక్క డాక్టరు భోజనానికి తన గ్రామానికి బయలుదేరారు. జమీందారు (రామేశ్వర బాబు) గారి గూండాలు ఊరిబయట ఎదుర్కొన్నారు. ఒక్కొక్కరే లాఠీలతోను, పదునైన భయంకరమైన ఆయుధాలతోను, చావమోది చచ్చిపోయాడనుకొని వెళ్ళిపోయారు. జమీందార్లపత్రిక "ఇండియన్ నేషన్" ఒకమనిషి చనిపోయాడని ప్రకటించింది. గడ్డికోసే కత్తులు కొడవళ్లు డాక్టరు భుజాన్ని, పొత్తికడుపును కోయడానికి ఉపయోగించారు. డాక్టరు తాను స్పృహ తప్పిపోయేటప్పటికి 5 లాఠీదెబ్బలు తగిలినట్లు తెలుసునట. భుజంమీద 2½×8 అంగుళాల పొడవు, లోతుగాయం, పొత్తికడుపుమీద ఒక అంగుళం లోతు గాయం ఉంది. ఇంకా కొంచం లోతుకు కత్తిపోతే అక్కడే చనిపోయి ఉండేవాడని డాక్టర్లు చెబుతున్నారు.

ఇది జరిగిన 10 నిమిషాలకు పెద్ద అరపు అరచారు. అన్ని దిశలనుండీ ప్రజలు పుంగెత్తుకవచ్చారు. వేలకొలది పోగయ్యారు. యస్. డి. ఓ. కూడ అక్కడకు పరుగెత్తుక వెళ్లాడు. అక్కడ తనకూ తన సిబ్బందికి, జమీందార్ల మనుష్యులకూ ప్రాణాపాయం. జమీందార్ల ఆఫీసును తగులబెట్టే అపాయం కన్పడింది. ప్రజ అలా ఆవేశపరులైనారు. కాని మా డాక్టరుకు స్మృతి కల్గగానే ప్రథమ చికిత్స పొందటానికి "జాముయి" అనే గ్రామానికి పోయేముందు ఒక మంచంమీద పడుకొని గ్రామమంతా తిరిగాడు. ప్రజలను శాంతిపఱిచాడు. ఏమాత్రం హింస గావించినా తాను భావిలో దుమికి చనిపోతానని తెల్పాడు. అవిధంగా బ్రతికించాడు. నేనీ విషయాన్నంతా యస్. డి. ఓ. ప్రకటనను దాదాపు తెల్పుచున్నాను. డాక్టరు కొంచెంకోలుకున్నాడు. "ఇది మా "దండా" నీతి. కిసాన్ ఉద్యమం దీనికి గర్వపడుతుంది."

ఇంకా భూమితగాదాలు, రైతులపై దౌర్జన్యం, కొట్లాటలు బీహారులో సాగుతున్నాయి.

ధర్భాంగజిల్లా దెబూలాలో జమీందారు మనుష్యులు, రైతులను కొట్టి, పంటను లాక్కొనిపోయారు. ఒక కమిటి తగాదాలను విచారించుచున్న సమయంలోనే ఈదౌర్జన్యం జరిగింది.

ఇదే జిల్లాలో, దహోపోర్‌లో, బలవంతంగా రైతులను భూములనుండి తొలగించితే ఎదురు తిరిగారు. 46 గురి అరస్టు చెయబడ్డారు. పందలకొలది స్త్రీలు తయారుగా ఉన్నారు, అరెస్టు అవడానికి.

వివిధ రాష్ట్రాలలో

సంయుక్తరాష్ట్రాలు

యూన్పిజిల్లా పూరా, కలాం, గ్రామంలో జరిగిన మండల కిసాన్‌సభకు 15,000 మంది రైతులు హాజరయ్యారు. సభ ఫిబ్రవరి 26,27వ తేదీలలో జరిగింది. యు. పి. కిసాన్‌సంఘం ప్రధానకార్యదర్శి, మోహనలాల గౌతమ యం. యల్. ఏ. అధ్యక్షత వహించాడు. అజిత ప్రసాద్ జైన్ - పార్లమెంటు కార్యదర్శి సభకు విచ్చేసి మాట్లాడారు. కంపెన్సేషన్ ఇవ్వకుండా జమీందారీవిధానం రద్దు చేయాలని, 1935 రాజ్యాంగ శాసనాన్ని ధ్వంసం చేయాలని, ఫెడరేషన్‌ను నాశనం గావించాలని, బకస్త్‌భూములకై బీహారు రైతులు గావించుచున్న ఉద్యమాన్ని, ప్రోత్సాహపరుస్తూ, తీర్మానాలు గావించబడినయి.

ఝూన్సిజిల్లా, చరుధా తహసిల్ కిసాన్ మహాసభ శంబునాథ్‌జీ ఆజాద్‌గారి అధ్యక్షత క్రింద జరిగింది. జమీందారీ విధానము, పర్వారీ విధానమూ రద్దుచేయాలని తీర్మానాలు గావించబడినయి.

సరిహద్దు రాష్ట్రం

మొదటి హజారా జిల్లా కిసాన్ మహాసభ ఫిబ్రవరి 25, 26 వ తేదీలలో కామ్రేడ్ మౌలానా ఏ. ఆర్. పోహల్లాయ్ అధ్యక్షతక్రింద, మన్స్రెహ్‌రావద్ద సమావేశమయింది. 30 వేల రైతులు హాజరయ్యారు. నేటి జాతీయ అంతర్జాతీయ సమస్యలను గురించి చెప్పినపిమ్మట, భూస్వామ్య విధానాల నన్నిటినీ ఎదుర్కొంటూ ఈ విధంగా గంభీరంగా మాట్లాడారు.

"బ్రిటిషు గవర్నమెంటుకు తమ మాతృభూమిని అమ్మిన ఫలితమే నేటి జాగీర్లు, సంస్థానాలు. వాటిని సృష్టించకపోతే. విదేశీ పరిపాలన ఇక్కడ అసాధ్యం. అందుకనే నేడు కొద్దిమంది పెట్టుబడిదారులు, భూస్వాములు తమ సోదరులకు ద్రోహం చేసినవారు—విలాసాలలో మునిగియుండే, లక్షలకొలది ప్రజలు—నిజంగా విలాసాలను నన్ని సృష్టించిన ప్రజలు—ఆకలితో కృశించుచున్నారు."

అధ్యక్షుడు ఇంకా ఇలా చెప్పారు: కిసాన్ ఉద్యమం రెడ్ షర్టు ఉద్యమాభివృద్ధి పరిఢింప జేసిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికను పూర్తిచేయమని మంత్రులను అడగటం నేరం కాదన్నారు. ఆలిండియా కిసాన్ సభ కార్యక్రమం కాంగ్రెసుకు విరుద్ధంకాదనీ, దానిని కొనసాగించాలని తెల్పాడు. బ్రిటిషు సామ్రాజ్య వాదాన్ని తుది దెబ్బగొట్టడానికి "ఇండియాకు వెన్నెముక అయిన రైతాంగాన్ని సంఘటనపరచాలి" అని తెల్పాడు.

ఆలిండియా కిసాన్‌సభ ప్రణాళికలో దెల్పబడిన రైతుల కోర్కెలను బలపఱచుమా; తక్షణం అవసరమైన రైతుసభ కోర్కెలను ప్రాంటీయరు ప్రభుత్వానికి నివేదించుకూ; సంస్థాన ప్రజలకష్టాలు తెలుసుకొని, వారి పోరాటానికి సహాయం చేయడానికి రాష్ట్రకిసాన్ సంఘం ముందు ఒక ప్రోగ్రాం పెట్టుటకుగాని ఒక విచారణ కమిటీని నియమించుతూ; సరిహద్దులోని పార్వర్డ్ పాలసీని అవలంబిస్తున్న బ్రిటిషు ప్రభుత్వ చర్యను, పాలస్తీనులో ప్రభుత్వ చర్యను ఖండిస్తూ తీర్మానాలు గావించబడినయి.

మహాకోసల

సియోనీ రైతుల మహాసభజరిగింది. ప్రొఫెసర్ జోగ్లేకర్ అధ్యక్షతవహించారు. ముంగేరీ వాస్తవ్యులు, ముంగేరీ కిసాన్‌సభ కార్యదర్శి కిసాన్ రామాయణ గ్రంధకర్తయగు గణపతిలాల్ ఠాకూర్‌గారు ఉపన్యాసకులు. త్రిపురీ కాంగ్రెసును కాంగ్రెస్ గురించి, ఎన్నికలలో గావించిన వాగ్దానాలు చెల్లించక పోవడాన్ని గురించి విశదపరచారు. కిసాన్ సంఘాలను బలపరచాలని, కాంగ్రెసులో అధిక సంఖ్యాకులుగ చేరి తమ కష్టాలను అక్కడ ప్రతిబింబింప జేసుకొనేటట్లు చూడాలని చెప్పారు.

సితాపూర్ వద్ద మరొకసభజరిగింది. అనేక తీర్మానాలు గావించబడినాయి. ఒక తీర్మానంలో రాష్ట్రపతి సుభాసుబాబు ఆరోగ్యం త్వరగా పొందుగాకయని కోరుతూ తీర్మానించారు. సి. పి. ప్రభుత్వం నూటికి 50 దాకా రెమిషన్లు నీయాలని కోరుతూ మరొక తీర్మానం ప్యాసయింది. ఈ విషయమై చిక్కులువస్తే మంత్రులు రాజీనామా ఈయాలనిందని కోరబడింది.

త్రిపురిలో

జబల్పూర్‌లో నియమించబడిన ఆగ్జలైజుగుకమిటీ విజ్ఞప్తి ననుసరించి 15000 రైతులు, జబల్పూరులో వేలకొలది కార్మికులతో కలిసి, త్రిపురీజండాచౌకులో సమావేశ మయ్యారు. సహజానంద అధ్యక్షతవహించారు. స్వామిజీ, కామ్రేడ్ జయ్యాజీ, పుల్కర్ణీ, గులాబ్‌చంద్ గుప్తా మొదలగువారును, స్థానిక నాయకులును

కిసాన్ బులిటెన్

చేసినప్రచారం రైతులను సమావేశపఱుచుటకు ఉపయోగపడింది. మైళ్లపొడవున ఊరేగింపు జరిగింది. ఎఱ్ఱజండాలతోను, కిసాన్ నినాదాలతో ఊరేగింపు జరిగింది. సుభాషబాబుకు ఈ క్రింది కోర్కెలుగల తీర్మానం సమర్పించారు. ఈ తీర్మానం 8 వ తేదీ గౌరీఘాట్‌లో జరిగిన రైతుసభలో ప్యాసయింది.

తీర్మానంలోని కోర్కెలు

(1) కంపెన్సేషన్ లేకుండా జమీందారీ విధానం మాల్‌గుజారీపద్ధతిని రద్దుచేయడం. (2) అన్ని విధములయిన వ్యవసాయఋణాలను రద్దుచేయుడం. (3) డిక్రీలు అమలుపఱుచుచున్నపుడు వేలంలో పశువులు, పాత్రలు మొదలైనవి వదలివేయుడం (4) లాండ్ రెవిన్యూ, ఇతరపన్నులలో 100 కి 50 చొప్పున తగ్గించడం (5) వెట్టిచాకిరి (బేగార్) ని రద్దుచేయటం (6) పెండ్లి, చావు, పుట్టుకలకు రైతుకుటుంబాలనుండి తీసుకునే మామూళ్లను రద్దుచేసి, వసూలు చేయువారిని శిక్షించుట (7) రైతులకు నూటికి మూడు చొప్పున చౌకవడ్డీకేటిప్పించుట. (8) అడవులలోని కట్టె, గడ్డి, పచ్చు ఉచితంగా తెచ్చుకొనుట (9) నదులు, తటాకాలు, అడవులు (మేపుకోడానికి) ఉచితంగా ఉపయోగింపుకోనిచ్చుట (10) పంటలు కాపాడుకొనేందుకు ఆయుధాలు (11) బాకీలకు, మగతాలకుగాను భూములనుండి రైతులను తొలగించే పద్ధతిని రద్దుచేయుట (12) అన్నావారి (పంటధరల) విధానంలో తీవ్రమైన మార్పులు గావించుట (13) తటాకాలు, వంతెనలు పునర్నిర్మించుట (14) జబల్‌పూరుజిల్లాలో ఎడ్లబండ్లమీద లోకల్ బోర్డు టోలుగేట్లపన్నును రద్దుచేయడం (15) పంటపండని ప్రదేశాలలో పూర్తి రెమిషన్ ఈయడం (16) 1930-32 లో అటవీసత్యాగ్రహంలో భూములు పోగొట్టుకొన్న రైతులకు తిరిగి వారిభూములను ఇప్పించుట.

రైతు ఉద్యమం

బీరార్

యం.డి. దేశపాండే, విదర్భ కిసాన్ సంఘ కార్యదర్శి గారిట్లు వ్రాయుచున్నారు.

"బీరారు ప్రజలు సహాయమో అని ఎలుగెత్తి అరచుచున్నా, ప్రభుత్వోద్యోగుల దౌర్జన్యాలు మితిమీరుతున్నాయి. లాండ్ రెవిన్యూ వసూలు చేసుకొనుటలో, రైతుల పరిస్థితులను గమనించక తొందర పడుచున్నారు. వారంట్లు పెట్టుతున్నారు. పెద్ద మనిషి తరహా, మామూలు మర్యాద ఏమీ ఉండటం లేదు.

కిసాన్ సంఘానికి, అనేక రివెన్యూ ఆఫీసర్లు చేసే దౌర్జన్యాల గురించి అనేక కంప్లయింట్లు వస్తున్నాయి. వీటివల్ల రైతుల పంటలు ధాన్యపు రాసులు, పశువులు, బండ్లు, గుడిసెల రేకులు, మొదలగు అవసర వస్తువులన్నీ వేలం వేసి ఎలా అక్రమాలు చేస్తున్నదీ తెలుస్తుంది. ఒక ఉదాహరణ ఒక ఆఫీసర్ వారంటు సర్వు చేయడానికి రాత్రిపూట వెళ్లి, స్త్రీలను నగలిమ్మని నిర్బంధించాడు.

ఇలాంటి కృత్యాలను ప్రతిదినమూ బీరారులో ప్రతిగ్రామాన జరగనీయడం చేత కాంగ్రెసు మంత్రివర్గం విమర్శనల పాలైంది. రైతులకు తగిన సహాయం ఈయాలన్న ప్రజాభిప్రాయం ఈనాడున్నంత ఎపుడూ లేదు. ఇదివరకు లేని, కలలోనైన ఊహించని నిర్బంధ విధానాన్ని అవలంబించిన ప్రభుత్వం, ఇదివరకే కృశించిన రైతుల తుది రక్తపు బిందువును పీల్చయత్నించునట్లు తోస్తుంది.

ఇంతవరకు ప్రతిఘటన సాగించిన బీరారు రైతులు నిజంగా అభివందనీయులు. ఉద్యోగస్థుల భయానక ఘోర కృత్యాలకు ముడిసి చాలమంది లొంగారు. నూటికి 60 పాళ్లు రెవిన్యూ వసూలు కాబడింది. తమ ఉద్యోగస్థుల విజయానికి మన మంత్రివర్గం సంతోషింపవచ్చు. కాని ఆ సంతోషం రైతు హృదయాలను చీల్చివైచింది. రైతు హృదయం చీల్చడం అంటే కాంగ్రెసు వెన్నెముకనే చీల్చడం అన్నమాట ఆక్రందనంతో, ఆకలితో, పస్తులతో కృశించి నావదలలేదు. ఒక్క కాంగ్రెసు మంత్రుల వాగ్దానాలపైన మాత్రమే గాక, తమబలం మీదనే ఆధారపడి రైతులుంటారని తలుస్తాను. ఇది బీరారు రైతులు నేర్చుకొనే పాఠం.

బెంగాల్

చిటగాంగ్ కిసాన్ మహాసభ

ఫిబ్రవరి 25-26 వ తేదీలలో చిటగాంగు జిల్లా కిసాన్ సభ బొగదండీ గ్రామంలో జరిగింది. 8000 రైతులు—అందులో 500 మంది స్త్రీలు - పాల్గొన్నారు. ప్రక్కనున్న గ్రామాలనుంచి, ఎఱ్ఱ జండాలతో ఊరేగుతూ వేలకొలది రైతులు వచ్చారు. కిసాన్ వాలంటీర్లు మీటింగును జాగ్రత్తగా చక్కగా జరిగేటట్లు చూచారు. రైతులు ధాన్యము, కట్టెలు, అణా డబ్బులు మీటింగు ఖర్చులకు విరాళంగా ఇచ్చారు.

అధ్యక్షత వహించిన కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్, కిసాన్ సభ వ్యవసాయిక విప్లవానికి రైతులను ఎలా తీసుకవచ్చినదీ, పన్నా భుక్కులగు జమీందార్లు తమఎస్టేట్లను మానేజ్ చేసుకోలేక ఎలా కోర్టు ఆఫ్ వార్డ్సుకు అప్పగించుచున్నదీ తెలియ జేశాడు. కంపెన్సేషన్ లేకుండా, జమీందారీ విధానాన్ని రద్దుచేయాలనీ, రైతులు తమదైనందిన హక్కుల కోసం పోరాడటానికి స్వాతంత్ర్యం సంపాదించడానికీ, కిసాన్ సంఘాలను సంఘటిత మొనర్పాలని తెలిపాడు.

ఫ్లౌడ్ కమీషన్ కాన్ఫరెన్సు.

బెంగాల్ రాష్ట్రకిసాన్‌సంఘం, రాష్ట్రసోషలిస్టుపార్టీ, రాష్ట్రట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు, కృషక్ ప్రజాపార్లమెంటరీ పార్టీ, కలకత్తాలో ఆల్బర్టు హాలులో మార్చి 4 వ తేదీన ఫ్లౌడ్ కమీషన్ యెడల తమ వైఖరి ఎలా ఉండాలో నిర్ణయించడానికి సమావేశమయ్యారు. రాష్ట్రకిసాన్ సంఘం 90 అచ్చు పేజీలున్నది (కావలంటే బెంగాల్ కిసాన్ సభ, 27 బి. గంగాధరబాబూలేన్, బౌబజార్, కలకత్తాకు వ్రాయండి). ప్రస్తుత రైతుల దుర్భరస్థితిని, జమీందారు విధానం వలనచెడుగులను చిత్రించే పటాలను (పోస్టర్లు) జనంజన్య నియోగిగారు బహిరంగ పరచారు.

మహాసభలో, పర్మనెంటు సెటిల్మెంటును, జమీందారీ విధానాన్ని, రైతులకు, ప్రభుత్వానికి మధ్య ఎటువంటివారూ లేకుండా ఎట్టి నష్టపరిహారం లేకుండా రద్దుచేయాలని తీర్మానించబడింది. అలాంటి మధ్యనున్నవారికి జాతీయ పరిశ్రమలు కల్పించి పని కల్పించవలెనని తీర్మానించబడింది.

రైతుల హక్కులగూర్చి ప్రచురించుటకు, ప్రచారం గావించడానికి, వివిధ సంఘాల ప్రతినిధులతో ఒక "రైతు బ్యూరో"ను స్థాపించుటకు తీర్మానించారు.

* * *

వినుకొండ

పంచాయితీ బోర్డు వ్యవహారాలు.

శ్రీ వారణాశి వెంకట మల్లయ్య

బెజవాడ సర్కిల్ లోకల్‌బోర్డు ఇన్‌స్పెక్టరుగుం. ఖాశిం అలీ అన్సారీగారు 18-3-39 తేదీన వినుకొండ పంచాయితీబోర్డు ఆఫీసును తనిఖీచేశిరి. వీరితో గుంటూరుజిల్లా పంచాయితీ ఆఫీసరుగారు శ్రీ. సి. అప్పిరెడ్డిగారు కూడా దయచేసిరి. వినుకొండ తాలూకా అసిస్టెంటు పంచాయితీ ఆఫీసరు డి. సుబ్బారెడ్డిగారును ఇన్‌స్పెక్టరుగారును వచ్చుటనిన్ని, వినుకొండ తాలూకా కాంగ్రెసు ప్రెసిడెంటుగారున్నూ మహమ్మదీయులున్నూ ఆదిఆంధ్రులున్నూ పెట్టిన పిటీషన్‌లు విచారించుదురనిన్ని పంచాయితీ బోర్డు ఆఫీసుకు 1 గంటకు హాజరు కావలెనని దనిన్ని, వినుకొండ తాలూకా కాంగ్రెసు ప్రెసిడెంటు వారణాశి వేంకటమల్లయ్యగారికిని సెక్రెటరీ చీమకుర్తి వెంకయ్యగారికిన్ని జ్యూనియర్ సోషలిష్టు లీడర్ (?) యేజంటు ఆర్. వెంకట్రామయ్య గారికిన్ని, కూకట్ల అచ్చయ్యగారికిన్ని 22 మంది మహమ్మదీయులకున్నూ ఆదిఆంధ్రసోదరులకున్నూ నోటీసులను యివ్వగా వీరలు హాజరయిరి.

ఇన్‌స్పెక్టరుగారు ప్రథమములో యిండ్లపన్నులు వసూలు కావలశిన మొత్తంను కనిపెట్టబడి 18 వందలు వసూలు నిల్పినందులకు మార్చి నెలాఖరులోపల వసూలు కానియెడల బిల్లుకలెక్టర్ల నిద్దరిని సస్పెండు చేయమనిన్ని పాతకిర్దులను నిల్వవుంచినందులకు యేప్రియల్ నెలాఖరు లోపల నఱంపుచేయనిచో గుమాస్తాగారిని సస్పెండు చేయమనిన్ని చెప్పిరి. దరిమిలా కిరసనాయల్ లెఖ్ఖ ఖర్చులను పరిశీలించి 11 గ్లాసులైట్లమీదను, లాంతర్లు 120 మీదను నెల 1 కి మూడు టిన్నులు చోరీకాబడుచున్నదనిన్ని, గ్లాసులైట్లను తీసివేసి మొత్తం లాంతర్లు వేసిన యింకా 7 టిన్నులు లాభం కలుగుననిన్ని వీటిపయిన ఆదాయంమీద గ్రామంలో మార్కెటు వగయిరా సౌకర్యములు చేయవచ్చుననిరి.

వృత్తిపన్నులు యిండ్లపన్నులు పక్షపాతముగా విధించినారనిన్నీ కట్టుబడిని బట్టిగాని వ్యాపారములను బట్టిగాని పన్నులు విధించుటలేదనిన్ని 1936-37 సంవత్సరముల వృత్తిపన్నుల అక్కౌంటు బుక్కులో కొట్టివేతలు దిద్దుట్లు గలవని తనిఖీచేయవలశినదిగా శ్రీయుత నూకల ఆంజనేయులుగారు కోరియుండిరి. పడిపోయిన యిండ్లను పరిశీలించక, రిఫండు యివ్వక అక్రమపుకేసులను బెట్టి బోర్డులోని సొమ్మును వ్యయపరచుచున్నారని చెప్పిన శ్రీయుత చీమకుర్తి వెంకయ్యగారు కోరియుండిరి. వీటిని గూర్చి ఏమీపరిశీలించలేదు.

మహమ్మదీయులు చెప్పుకొనబోవు కష్టములను వినకుండగనే శ్రీ ఇన్‌స్పెక్టరుగారు 2 మహమ్మదీయ రిజర్వుసీట్లున్నూ అది ఆంధ్రరిజర్వుసీటున్నూ బోర్డుకో ప్యాసుచేయుట అవసరమని బోర్డు ప్రెసిడెంటుగారితో చెప్పి వెళ్లు చుండిరి. అంతట తాలూకా కాంగ్రెసు ప్రెసిడెంటు వారణాశి వెంకటమల్లయ్యగారు శ్రీ ఇన్‌స్పెక్టరుగారితో యీక్రింది సంభాషణ జరిపిరి.

ప్రశ్న:— మేము పెట్టిన అర్జీలు ఏమైనవి? మా గ్రామంలోని ప్రజలకు గల ఇబ్బందులు, గ్రామ సౌకర్యములు పరిపాలనకోసములు పరిశీలించి న్యాయం కలుగజేయుదురని ప్రజలు ఆశించియున్నారు.

జవాబు:— నేనుగనుక రాజునైతే ....

ప్రశ్న:— పంచాయితీబోర్డు అంటే పురపాలక సంఘముగదా. పురజనులకు బోర్డు ప్రెసిడెంటుగారు గావించుచున్న అక్రమములు, కష్టములు ఎవరితో చెప్పుకొనవలెనండీ.

జవాబు:— మాతో చెప్పవలెను.

ప్రశ్న:— మహమ్మదీయ సోదరులకు ఈ సంవత్సరం జరిగిన అన్యాయమును తొలిగించి వారి హక్కులను వారికిచ్చుట న్యాయముగదా.

జవాబు:— అవును. ఎన్నికలు జరుగుటకు వీలులేదు. రిజర్వు సీట్లు నేనిప్పుడు చేస్తా.

ప్రశ్న:— గ్రామంలో, మైదు కాల్వలు లేవు రోడ్లు ఏనాడూ లేవు. స్త్రీలు బయలుభూమి దొడ్లు లేకపోవట బాధపడుచున్నారు. మార్కెట్టు లేకుండా రుసుము వసూలు చేయుట న్యాయమేనా ప్రెసిడెంటుగారు అని మీరే అంటిరిగదా. మా గ్రామంలో మార్కెటులేదు. బీదవారలు కష్టపడుచున్నారు. బండ్ల మెట్లులేదు. యింటి పన్నులు, వృత్తిపన్నులు పక్షకరించి తక్కువ ఇష్టముఇచ్చినవారికి తగ్గించుట, తీసివేయుట, ఇష్టములేనివారికి హెచ్చించి అవస్థలు కలిగించుట, ఇంకా అనేక అసౌకర్యాదులను కలిగించుచున్నారు. తమరు పరిశీలించకున్న మా ప్రజల కష్టములను తొలగించు అధికారు లెవరండీ.

జవాబు:— అయితే బోర్డును ఎత్తివేయవలెనా? లేక ప్రెసిడెంటును తొలగించవలెనా? లేక సూపరసీడు చేయవలెనా?

ప్రశ్న:— పంచాయితీబోర్డు ప్రెసిడెంటుగార్ని తొలగించుట అవసరం.

మీరాసాహెబు:— అలాగైతే మీరు తగిన పిటీషనులు పెట్టి తగినలోపములను, రుజువుచేసిన అట్టి పనులు జరుగునేమో.

ప్రశ్న:— యిదివరలో మేము పెట్టిన పిటీషన్లు, మహజర్లు, టెలిగ్రాంలు, తీర్మానంలు ఆంధ్ర పత్రికల ప్రచురణలు ఏమయినవి డిస్ట్రిక్టు పంచాయితీ ఆఫీసర్లు, అసిస్టెంటు పంచాయితీ ఆఫీసర్లు మదరాసు లోకల్‌బోర్డు ఇన్‌స్పెక్టరుగారు, సి. యస్. హనుమంతరావు పంతులుగారు విచారించిన విచారణలు యేమయినవండీ. గ్రామంలోని లోపములు అన్నియు చూపితిమి గదా.

జవాబు:—అవి అన్నియు బుట్ట దాఖలు అయినవి, తిరిగి పెట్టండి, ఆలోచించెదను.

ప్రశ్న:— పెట్టినవన్నియు బుట్ట దాఖలు అయితే యిక ముందు పెట్టేవికూడా అంతేగదా. తమవంటి న్యాయ ప్రభువులు యిలా శలవుయిస్తే మేము చేయు కృషి ఏది.

జవాబు:— పోవయ్యా నేను సమాధానం చెప్పను.

అంతట కాంగ్రెసు ప్రెసిడెంటుగారు యీ నిరంకుశ ప్రభుత్వమునకు తమ అధికారులకు వక నమస్కారమండీ యని నిరుత్సాహము చెందుచూ మహమ్మదీయ సోదరులతో వెడలిపోయిరి. దీని తరువాత శ్రీ ఇన్‌స్పెక్టరుగారు, గ్రామంలోనికి దయచేసి గ్రామంలోని అక్రమణలను యిండ్లకు విధించిన పక్షపాతము పన్నులుగల యిండ్లను మురుగుకాల్వలు రోడ్లను అసౌకర్యములను మొదలగునవి పరిశీలించి బంగళాకు చేరిరి. రాత్రి 11 గంటల వరకు పంచాయితీ బోర్డు ప్రెసిడెంటుగారు గోనుగుంట్ల అంకారావుగారు శ్రీ ఇన్‌స్పెక్టరుగారితో అన్ని విషయములు సమర్థించితిననిన్ని నా పరిపాలనకు అడ్డువచ్చువారున్నారా అనిన్ని నిందా వాక్యములను బల్కుటను బట్టి ప్రజలు భీతి చెందుచున్నారు.

చిట్టివలస కాల్పులు

రాష్ట్ర కాంగ్రెస్ కమిటీకి రంగశాయిగారి నివేదిక

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుకమిటీచే నియమించబడిన బి. యస్. రంగశాయిగారు చిట్టివలస జూటుమిల్సులో 14-2-39తేదీని జరిగిన తుపాకీ కాల్పులగూర్చి విచారణచేసి యీక్రింది నివేదికను సమర్పించిరి:—

15-2-39 తేదీని కరుణాకరం సుబ్బారావుగారివద్దనుండి తంతివార్త వచ్చెను. 14-2-39 తేదీని చిట్టవలసమిల్లులో తుపాకులు కాల్చబడెనని ఆతంతిలో కలదు. రాష్ట్రీయ కాంగ్రెసు కమిటీ ప్రధాన కార్యదర్శి ఉత్తరువుల ప్రకారం నేను చిట్టివలసకు అచటి నిజ సంధర్భములను గూర్చి నివేదించుటకు వెళ్లితిని.

అ కాల్పులవల్ల ఒకడు మరణించెనని సుబ్బారావుగారి తంతివార్తలో నుండెను. మరి కొందరికి తీవ్రగాయము లయ్యెనని తెలియజేయబడెను. 15-2-39 తేదీని హిందూపత్రికలో ప్రభుత్వ ప్రకటన ప్రచురింపబడెను. 18వ తేదీని ఒక విలేఖరి యీవిషయమై వ్రాసిన వివరములు ప్రకటింపబడెను. 17-2-39 తేదీ పత్రికలో కలెక్టరు వ్రాసిన విషయములు ప్రకటింపబడెను.

ఈ ప్రకటనలనుచూచి నేను చిట్టివలసకు 18 తేదీని చేరితిని. 18-2-39 తేదీని నేను విచారణ సాగించితిని.

ముందుగా, మిల్లు ఏజంటుతో మాట్లాడగోరి మిల్లు ఏజంటు అగు జేమ్సుగారికి ఉత్తరము వ్రాసితిని. జేమ్సుగారు ప్రక్కమీదనుండి లేవలేకున్నారని మేనేజరగు విల్సనుగారు జవాబు వ్రాసిరి. 14-2-39 తేదీని జేమ్సుగారికి తగిన దెబ్బలవల్ల అస్వస్థులై యుండిరట. జిల్లాకలెక్టరుతో కలసి యీ విచారణ నేను చేస్తే బాగుండునని తెలియజేసెను

అందుమీదట నేను విల్సనుగారికి తిరిగి వ్రాసితిని. జేమ్సుగారివంటి జవాబువారీ అధికారితో మాట్లాడడం అవసరమనియు, జేమ్సుగారితో మాట్లాడడానికి వీలులేకపోతే విల్సనుగారితోనైనా మాట్లాడ గోరుచున్నాననియు విల్సనుగారికి వ్రాసితిని. అందుకు విల్సనుగారిట్లు జవాబువ్రాసిరి. కలెక్టరుతో కలిసి యీ విచారణ సాగించుటయే యుక్తము. ఈ విషయంలో గవర్నమెంటు దరియాప్తు జరుగనున్నది గనుక నాతో మాట్లాడడంవల్ల మీకు ప్రయోజనంలేదు అని విల్సనుగారు నాకు వ్రాసిరి. నేను చేయదలచిన దరియాప్తుతో తమకు సంబంధం లేదన్నట్లుగా ప్రదర్శించిరి. అంతట నేను విశాఖపట్నం జిల్లా కలెక్టరుగారిని కలసికొనిమాట్లాడ గోరుచు 21-2-29 తేదిని వ్రాసితిని. విశాఖపట్నంలో ఆ రోజుననే విచారణ జరుగుచున్నది గనుక నాతో మాట్లాడుటకు వీలులేదని కలెక్టరు జవాబు వ్రాసెను.

అందువల్ల నేను కార్మికులను కలిసికొని విచారణ ప్రారంభించితిని.

కార్మికసంఘ ప్రెసిడెంటు అగు కే. సుబ్బారావుగారి(అసెంబ్లీసభ్యుడు)వద్దనుండి వాజ్మూలమును వ్రాసికొంటిని. కార్మికుల వద్దనుండికూడ వాజ్మూలములను స్వీకరించితిని. కార్మికులతో మాట్లాడితిని. డా॥ వెంకయ్య (యం. బి. బి. యస్) గారివద్దకు చికిత్సకై వచ్చినవారితో మాట్లాడితిని. సుమారు 100 మంది సాక్షులతో మాట్లాడితిని.

అల్లరులకు మూలకారణము

అప్పన్న అనే పనివానిని పనిలోనుండి తగ్గించిరి. ఆతనికి మగ్గాలవద్దపని - నెలకు ర్పూ 27 లు జీతం ఉండేది. 13-2-39 తేదీని అతడు మగ్గాలవద్ద పనిచేయరాదనియు రోజు కూలి వానివలె నెలకు రూ 7 లు జీతానికి పని చేయవలెననియు, ఏర్పాటు చేసిరి. కాని అతడు మగ్గములవద్దనుండి కదలలేదు. నవుకరీనుండి అతనిని తగ్గించి నప్పటికిని, 13-2-39 తేదీ అంతయును అతడు మిల్లులోనే కూర్చుండెను. మిల్లు అధికారుల ఉత్తరువులను అతడు ఉల్లంఘించినందుకు అతనిని సూపరింటెండెంటు బర్తరఫు చేసినను అతడు కదలలేదు. మరునాడు గూడా అతడు మిల్లులోనికి వచ్చి మగ్గం వద్ద కూర్చుండెను. అతని మగ్గం పనిచేయకుండా విడగొట్టబడెను. అప్పన్నను తిరిగి పనిలో చేర్చుకోవలసినదిగా మిగిలిన పనివాండ్లు సూపరింటెండెంటును అడిగిరి. మీకు యిష్టం లేకపోతే మీరుకూడా పని మానివేయ వచ్చునని సూపరింటెండెంటు బదులు చెప్పెను. మిల్లును అధికారులు బందుచేస్తారని కార్మికులు వెరచిరి. ఆరీతిగా మిల్లును బందుచేయకుండా నిరోధించుటకై పనివాండ్లు మిల్లులోనే స్తంభించి కూర్చుండి సమ్మె చేసిరి.

14 వ తేదీని మగ్గముల పనివాండ్లు మాత్రమే సమ్మెచేసిరి. సాయంకాలం ఇతర భాగాలలో కూడా స్తంభించిరి. సాయంత్రం 5 గంటలకు పనివాండ్లు వెళ్లిపోవుటకు మిల్లు కూతవేసెను. స్త్రీజనమాత్రం వెళ్లిరి. 200 పనివాండ్లు మిల్లులో కదలక కూర్చుండిరి

ఇంతవరకును కలెక్టరు ప్రకటించిన వివరములకు కార్మికుల కథనమునకు వ్యత్యాసంలేదు.

లాఠీ చార్జి

రాత్రికూడా పనివాండ్లు మిల్లులోనే కూర్చుండిరి. రాత్రి 7 గం॥ లకు భోజనంవేళ—మిల్లు మానేజరుతో భీమునిపట్నం తహసీల్దారు కలిసి వచ్చి కార్మికులతో మాట్లాడి ఒక సమాధానమునకు వచ్చెను. కార్మికులు భోజనానికివెళ్లి తిరిగి రావచ్చునని తెలియజేయ బడెను. కొలది జట్లుగా బయటకు వెడలిపోనిచ్చిరి. రాత్రి 10-30 గం॥ గేటువద్ద రిజర్వుపోలీసులు నిలువబడి, బయటకు వచ్చిన 50 మంది కార్మికులను అటంక పరచిరి. ఇది అక్రమమని వారు ఆక్షేపించిరి. అప్పుడు లాఠీచార్జి జరిగెను నిరోధించబడిన కార్మికులు వెంటనే మిల్లులోనికి పరుగెత్తివచ్చిరి.మరొక జట్టువారిని భోజనానికి పంపుటకై వచ్చిరి.

కార్మికులతో యజమానులకుగాని, గవర్నమెంటు ఆఫీసర్లకుగాని ఇంతకుతప్ప సమావేశావకాశము వేరేమీలేదు. కార్మికులు మిల్లులో కూర్చుండి పాటలుపాడుకుంటూ కథలు చెప్పుకొనుచుండిరి. వారు చుట్టలుకూడా కాల్చుటలేదు. మిల్లులోని యంత్రాలను పగలగొట్టవలెననే మాటలుకూడ వారు చెప్పుకొనుచుండుట లేదని కార్మికులు చెప్పిరి. అట్టిపనులకు వారు పూనుకుంటే తమ సంకల్పమును తామే భగ్నం చేసుకొనడమగునని కార్మికులు నాతో చెప్పిరి. అప్పన్న విషయం అప్పటికప్పటికే పరిష్కారం కావలెననే పట్టుదలతో వారున్నారు. మాసాలకొలది మిల్లును బందుచేయడం వారికి రుచించలేదు. మిల్లు బందుచేస్తే వారికి పని ఉండదు తిండి ఉండదు. అప్పన్నకు దండన జరగడం, ఆ సందర్భంలో సమ్మె చేయడం $1\frac{1}{2}$ మాసములు మిల్లు బందుచేయడం గత సంవత్సరం జరిగెను. ఆ సంగతి వారిని మనస్సులో బాధించెను. అందువల్ల ప్రస్తుత వ్యవహారం వెంటనే పరిష్కారం కావలెనని స్థబ్దసమ్మె సాగించిరి.

తుపాకి కాల్పులు

అర్ధరాత్రి అయింది. డిప్యూటీ కలెక్టరు మిల్లులోనికి వెళ్ళెను.కార్మికులలో ప్రముఖులైనవాడెవరికీ లాఠీదెబ్బలు తగిలెనని అడిగెను డిప్యూటీ కలెక్టరుకు, కార్మికులకు పరుషభాషలు జరుగలేదు. అంతా శాంతంగా ఉంది.

17-2-30 తేదీ హిందూపత్రికలో హిందూ పత్రికా విలేఖరివ్రాసిన వివరాలు యిట్లు ప్రకటింపబడెను.

అంతా శాంతంగా ఉన్నది. డిప్యూటీకలెక్టరు ట్రావెలర్సు బంగళాలోనికి వెళ్లెను. అటుపిమ్మట తహసీల్దారు విశాఖపట్నం వెళ్ళి కే. సుబ్బారావుగారిని,కార్మిక యూనియను ప్రెసిడెంటును తన మోటారులో తీసికొని వచ్చెను. పనివాండ్లను మిల్లువదలి పోవునట్లుగా సుబ్బారావుగారిచే చెప్పించవలెనని తీసికొని వచ్చెనట. కార్మికులుకూడా తమతగాదా పరిష్కారం సుబ్బారావుగారిద్వారా జరుగవలెనని కోరుచుండిరి. అందువల్ల సుబ్బారావుగారికి తంతి పంపిరి అది ఆయనకు రాత్రి 9 గంటలకు చేరెను. తహసీల్దారు ప్రేరేపణవల్ల సుబ్బారావుగారి కొరకై కార్మికులుకబురుచేసిరి.విజయనగరంలో కిరాయి మోటారుకారు దొరకనందున అంతకు పూర్వమే సుబ్బారావుగారు చిట్టివలసకు పోజాలరైరి.

14-2-39 తేదీ అర్ధరాత్రి కలెక్టరు మిల్లుకు వచ్చెను. జిల్లాకలెక్టరు, డిప్యూటీకలెక్టరు, కొందరు పోలీసులు కక్కసుగేటువద్ద మాట్లాడుకున్నారు. దీపాలుఆర్పివేయబడెను. తిరిగివెలిగింప బడెను. ఈవిధంగా ముమ్మారు జరిగెను తుపాకులు కాల్చుటకు ముందుగా కార్మికులకు హెచ్చరిక ఇవ్వలేదని కార్మికులు తమ వాఙ్మూలంలో చెప్పిరి. జిల్లాకలెక్టరుయొక్క కథనములో కూడ అరీతిగానే ఉన్నది. తుపాకి మ్రోత విన్పించడమే కార్మికులకు హెచ్చరిక యయ్యెను.

ఆమ్రోత విన్పించగానే అదివరకు మేల్కొనియున్నవారు పారిపోయిరి. నిద్రలో భయపడి లేచినవారు అటు ఇటు పరుగెత్తిరి. ఇంకను నిద్రపోతూ ఉన్న కార్మికులకే గుండుదెబ్బలు ముఖ్యంగా తగిలెను. కలెక్టరువగైరా లోనికి వచ్చినప్పుడు నిద్రపోతూ ఉన్నవారు నిద్రలేచినారు.

టపాకాయలు కాల్చినట్లుగా ఫ్యాక్టరీ పొగతో నిండియుండెను కార్మికులున్న వైపు దీపాలు ఆర్పివేయబడుచు తిరిగి వెల్గింప బడుచుండెను. తుపాకులు కాల్చే పోలీసులు నిలువబడియున్న చోటు చీకటిగా ఉంచబడెను.

తుపాకులు పేల్చబడెను. లాఠీలు విసరబడెను. కార్మికులు ఒక గేటుగుండా పారిపోయిరి. ఆగేటువద్ద పోలీసులు నిలువబడి బయటికి వచ్చిన వారిని లాఠీలతో కొట్టిరి. అప్పుడు కొందరు కార్మికులు రెండవగేటువైపుకు పరుగెత్తిరి.

కాని అది మూయబడియుండెను.అందువల్ల కొందరు గోడవద్దనున్న యంత్రాలపై కెక్కిగూడ దూకి పారిపోయిరి. పారిపోవుచున్న కార్మికులను పోలీసులు తుపాకులతో లాఠీలతో వెంటాడి తరిమిరి. తుపాకులను కాల్చుటకు చేతి విద్యుద్దీపాలను కూడా ఉపయోగించి గురిచూచు కొనిరి.

ఈతుపాకుల కాల్పులవల్ల ఒకనికి కాలి మడమమీద గుండుదెబ్బ తగిలెను. చాలమందికి సన్న తుపాకీ రవ్వదెబ్బలు తగిలెను. ఆరక్తము నాకు చూపబడెను.

మేనేజరు అగు జేమ్సుగారు పిస్తోలును చేతబట్టి తిరుగుచుండెడివాడు ఈగల అప్పలస్వామి గారికొరకును, జేరునాయుడుకొరకును తిరుగుచుండెడివాడని చెప్పిరి. అప్పలస్వామి వైపుకు జేమ్సు గురిపెట్టెననియు అప్పలస్వామి భయపడి పారిపోయెననియు అప్పలస్వామి చెంతనున్న యువకుడు చెప్పెను. అతడుమాత్రము ఒకయంత్రము చెంతనున తలుపుచాటున దాగుకొన్నాడట. అప్పలస్వామివైపు గురిపెట్టి జేమ్సు కాల్చినప్పుడు ఆగుండుదెబ్బ ఆతలుపుచాటున దాగుకొన్న ఇతనికి (రెండవవానికి) మోకాళ్ళమీద తగిలెనట-ఎంతసేపు ఎన్నిమార్లు తుపాకులు ప్రేల్చబడినవని నేను అడిగితిని.

17-2-39 తేదీని హిందూపత్రికలో కలెక్టరు ప్రకటించిన వివరములను బట్టి నాలుగుమార్లు తుపాకులు ప్రేల్చబడెనని తెలియుచున్నది. జిల్లాకలెక్టరు తనతో చెప్పినట్లుగా కరుణాకరం సుబ్బారావుగారు ప్రకటించిన విషయములను బట్టి మూడునిమిషములలో ఫ్యాక్టరీలోనికూలీలు వెడలగొట్టబడిరి. కాని, తుపాకులు ఎన్నిమార్లు ఎంతసేపు కాల్చబడెనను విషయమై కార్మికులు యెవరును సరిగా లెక్కించలేదు. కొందరు 30 నిమిషములలో 10 మార్లు తుపాకులు కాల్చబడెనని చెప్పిరి. సరిగా నిర్ధారణగా చెప్పవలసినదని ఆ కార్మికులను అడిగితే, వారు ఊహించుటకు పూనుకొనక మానుకొనిరి. ఇంకను ఆ విషయమై వారిని నొక్కి అడుగగా "గభీమని తుపాకులు ప్రేలినవిగాని యీలెక్కలన్నీ ఎవరు చెప్పగలరు?" అన్నారు.

తుపాకులను కాల్చుట అయిన పిమ్మట, యంత్రాలచాటున దాగుకొనియున్నవారిని దండించుటకు పోలీసులు పూనుకొనిరి.

జిల్లాకలెక్టరు, మిల్లుమేనేజరు, డిప్యూటీ కలెక్టరు, డిప్యూటీ పోలీసు సూపరింటెండెంటు కలసి మిల్లులో మాట్లాడుకొనుచుండిరి.

(మిగతా 17 వ పేజీలో)

సూరసాని యానాంలో కల్లోలం.

తూర్పు గోదావరిజిల్లాలో అమలాపురం తాలూకాలో అమలాపురంనకు 12 మైళ్ల దూరమున యానాం అనే సూరసాని యానాం యెస్టేట్ వున్నది. జనాభా 1600. వ్యవసాయ విస్తీర్ణ 3400 యకరాలు. గవర్నమెంటుకు చెల్లించే పేష్కసు 540. ఆదాయం సుమారు 6000. యెస్టేట్ చిన్నదైనా అల్లకల్లోలము మాత్రం పెద్దది. ఏ యితర జమీన్‌కు తీసిపోదు.

పన్నులు ఎక్కువ; సౌకర్యాలు తక్కువ.

యెస్టేట్‌లో రైతులు చెల్లించవలసిన పన్నులు యకరం 1కి రూపాయి మొదలు ఎనిమిది రూపాయల వరకుఉంది. పన్నులు తక్కువగా కనిపించినా ఏ విధమైన నీటి సదుపాయములు వగైరాలు లేకపోవడంవల్ల హెచ్చుగానే లెక్కించాలి. పంటలు పండించక బీడుగా విడిచిపెట్టినా పన్నులు తప్పవు. పొలాలు పూర్తిగా విడుదల చెయ్యడమునకు నీటి సౌకర్యాలు చెయ్యబడే ఆశ విడవడంలేదు: యకరానికి 5, 6, 7, 8 రూపాయలు లిచ్చేవారు కూడా పొలాలు బీడు పెట్టి పన్నులిచ్చుకొంటున్నారు. జమీందారు కేవలం 2000 రూపాయలు మాత్రం నీటి సదుపాయాలకు ఖర్చు పెట్టి వుంటే ప్రస్తుతము సాగవుతూన్న 1000 యకరాలకు తోడు యింకా 1000 యకరాలు సాగయ్యి వుండును. కాని ఆ పని జరగడంలేదు. జరుగునన్న వెర్రి భ్రమ రైతులను విడవడమూలేదు.

వృత్తి : కార్మిక విభేధాలు.

యెస్టేటు ప్రజలు మూడే జాతులు. కాపు, పల్లె, పంచమ. కాని యీ మూడు జాతులు కేవలము కూలి పనులపైన ఆధారపడడంవల్ల ఒకే ఒక కార్మిక జాతిగా పరిగణింపబడాలి. కాని వారిలో వారికి గల అవర్ణ సవర్ణ ద్వేషాలు, వృత్తి ద్వేషాలు కార్మికాభివృద్ధిని అరికట్టడమే గాకుండా కార్మిక లోకానికి ఎంతో తలవంపులు తెస్తున్నాయి. కాపు, పల్లె ఒక పక్షము. పంచమ జాతి ఒక పక్షము.

కూలి పనులు తగినంతగా లేక పోవడంవల్లనూ, ఆ గ్రామ సరిహద్దు ప్రాంతము సముద్రమునుచేరి పోటుపాటులలో నుండుటచేతను పంచములందరికీ గూలి బుట్టల పరికరాలతో చేపలుపట్టి అమ్ముకొని జీవించడమే వృత్తి. చేపలు పట్టుకునే స్థలం 1937లో జమీందారువల్ల ఒక రైతుకు పట్టాపై దఖలు పడింది. అనాది సిద్ధంగా వస్తున్న వృత్తికి అటంకము కలుగనేలేదు. ఉప్పునీటి ముంపువల్ల రైతు సాగుకు ప్రయత్నమూ చెయ్యలేదు.

మంచినీళ్ల చెరువుకూడా కట్టేశారు.

గ్రామంలో ఒకే చెరువు వున్నది. దానిని జిల్లాబోర్డువారు 1935 లో తమ అధీనములోనిదిగానే లెక్కించి ప్రజా సౌకర్యంకొరకు మరమ్మతు చేయించారు. అంతవరకూ ఆ చెరువు ఉన్నదో ఊడినదో తెలియని ప్రొప్రయిటర్ ఆ చెరువు తన హక్కులోనిదనిన్నీ, బోర్డుకు ఎంతమాత్రం సంబంధములేదనిన్నీ స్వాధీనపరచుకొన్నాడు. ఆ చెరువు మినహాయిస్తే ఆ గ్రామస్థులకు రెండుమూడు మైళ్ళలోగాని మంచినీళ్లే లేవు. 1937 లో నీటి కరువువచ్చి గ్రామస్థులందరికీ ఆ చెరువే ఆధారమయుంది. పంచములుకూడ తమకొరకు ఒక మూల నీళ్లు తీసుకునే సదుపాయం చెయ్యమని ఎంతగానో ప్రార్థించేరు. లాభము లేకపోవడమే కాకుండా వర్ణుల చెరువునుంచి నీళ్లు తీసుకొన ప్రయత్నించినందుకుగాను సవర్ణులు అవర్ణులపై కత్తి గట్టేరు. తగిన అదునుకొరకై ఎదురుచూస్తూ పంచములను పీడించే ప్రయత్నాలలోనే వున్నారు అప్పటినుంచీ.

పంచములపై దండయాత్ర.

జమీందారు ఒక రైతును భూమినుంచి వెళ్లగొట్టడానికి ప్రయత్నించినపుడు పంచములెవరూ దౌర్జన్యమని తలచి సహాయపడలేదు. కాపు పల్లెలు సహాయపడ్డారు కాని లాభంలేక పోయింది. అప్పటినుంచీ జమీందారు పంచములపై ద్వేషం వహించి వారిని హింసించడానికి పూనుకున్నాడు. పంచములు చేపలు పట్టుకొనుచున్న స్థలం (ఒక రైతుదైనప్పటికీ) తనదేననిన్నీ గత పది సంవత్సరాలలోవలెనే చేపలు పట్టుకొను హక్కు వేలం వేస్తున్నానని ప్రకటించి 1938 జూన్‌లో ఒక కాపుచే నామ మాత్రానికి పాడించేడు. పంచములు ఆ తర్వాత యదావిధిగా చేపలు పట్టుకున్నా యెవరూ ఆటంక పెట్టలేదు. పై జాతులు ఆ వృత్తి చెయ్యనూలేరు. కాని సెప్టెంబరు 1 వ వారంలో దౌర్జన్యంగా రౌడీల సహాయంతో వేట పరికరాలను తీసివెయ్యాలని ప్రయత్నించేరు, వెంటనే పోలీసులు కలుగజేసికొని సంఘర్షణ ఆపివేశారు.

పోలీసు విచారణ

సంఘర్షణ ఆపుచేసి పోలీసు యీద్వంద్వ యుద్ధానికి గల మూలకారణాలను విచారణ చెయ్యగా జమీందారీ ముఠాలోనే చేరిన కాపులు చేపలుపట్టుకునే స్థలం ఎప్పుడూ పాటలో లేదనిన్నీ, పల్లెవాళ్లుకూడా పాటలో లేరనీ, నామకారు 35-0-0 లు రికార్డు జేస్తున్నారనీ చెప్పేరు.పాటదారు మాత్రం ఆ రోజున తాను స్థలం పాడినట్లుగాని,పంచములు అటంకపెట్టినట్లుగానిచెప్పనేలేదు. కాని సెప్టెంబరు 2 వ వారములో మాత్రము ఆస్థలము పాట రీత్యా జూలై 1 వ తేదీనుంచీ తన హక్కులో వుందనిన్నీ, అప్పటినుంచీ తాను, తన స్థానీయులు చేపల ఆదాయం అనుభవిస్తున్నట్లూ, ఆగస్టులో పంచములు ఆటంకపరచినట్లున్నూ, ప్రతిఫలము ఇస్తామని కాలయాపన చేస్తూన్నట్లూ పాటదారు సివిల్ దావా చేశాడు. ఇది చాలా ఆశ్చర్యముగా వుంది.

కోర్టు తీర్పు

పాటదారు సివిల్ కోర్టులో కేవలం 15 గురు పంచములపై ఆటంకపరచకుండా టెంపరరీ ఇంజంక్షను కొరకున్నూ, రిశీవరు ఎప్పాయింటుమెంటు కొరకున్నూ, దావా చేశాడు. కోర్టు కేవలము యింజక్షను అర్డరు యిచ్చినా అమలు జరుపలేదు. పంచములు 80 కుటుంబాలకు యిదే వృత్తి అనిన్నీ, పై జాతులు ఆ వృత్తి చెయ్యలేరనిన్నీ పిటీషను పెట్టేరు. ఇంజక్షను వచ్చిన తరువాత 15 గురు వేట మానేసేరు.

జబర్దస్తీ: అక్రమ ప్రవేశము

1938 వ సంవత్సరపు క్రిస్మసు సెలవులలో జమీందారు పార్టీ పాటదారు తరఫున చేపలు పట్టు స్థలమందు తమకు యింజక్షను వచ్చిందని చెప్పి గూలి బుట్టలు వగైరా వేట పరికరాలు జబర్దస్తీగా తీసివేయాలని ప్రయత్నించేరు, ఇంజంక్షనులో లేని పంచములు ఆ స్థలము రైతుదని వాదిస్తూ జమీందారీ ముఠాను ఎదురుకున్నారు. దానితో పాటదారు తన వేట పరికరాలను పంచములు చోరీ చేశారని పిటీషను పెట్టి 1939 సంవత్సరం జనవరి 13 వ తేదీని పోలీసు ఇనస్పెక్టరు వగయిరాలను రప్పించి నాలుగు రోజులు మకాం చేయించి నాలుగోరోజున పంచములలో ఆరుగురిని చోరీ నేరము క్రింద అరెస్టు చేయించారు. జామీను విడుదల అల్లరులకు కారణమన్న పిటీషనుపై జామీను నిరాకరించేరు.15 రోజుల పిదప విడుదలచేసి ఈ"పెద్ద"చోరీ నేరముపై క్రిమినల్ కేసు పెట్టారు.

తగువుకు కారణమైన స్థలములోని చేపలు పట్టుకొనే హక్కు జమీందారు 1929 లో నుంచీ వేలం వేస్తున్నట్లుగా దావాలోని విషయము ఐనా 1933 లో రైతునుంచి పన్ను బకాయికి వేలంలో పాడుకుని వప్పగింత చేసికొన్నట్లుగా కామన్ కాగితపు రశీదులో వుంది. తగవు 1938 లో ప్రారంభము. సివిల్ కోర్టు రికార్డు యావత్తూ తెల్లకాగితపు ముక్కలతో నడుస్తుంది. ముచ్చిలకా దస్తావేజులు, రిజిస్ట్రేషన్లూ లేనే లేవు. పంచములలో ఒక చదువుకొనిన వ్యక్తిని లోబరచుకొని ఆరు సంవత్సరాలనుంచీ తాను పాడినట్లు సంతకాలు చెయ్యించేరు, కాని ఆ వ్యక్తి సివిల్ కోర్టులో ఎఫిడవిట్టు యివ్వ నిరాకరించేడు. పంచములకు సహాయము చేస్తున్న ద్వేషమున 60 యకరాల సాగుబడి రైతును చేపలు పట్టుకుని జీవిస్తున్నట్లుగా క్రిమినల్ సివిల్ దావాలలో ముద్దాయిగా చేర్చేరు. 31-3-1939 వ తేదీని ఛార్జిషీటు మార్పు చేశారు.

న్యాయాధికారుల తీర్పు కోసం అందరూ ఎదురు చూస్తున్నారు వాయిదాలు ఇకముందువేయక, త్వరలో కేసును పరిష్కరించాలని ప్రజాభిప్రాయము.

* * *

కాశీపట్నం ఖైదీల విడుదలలు

కామ్రేడ్స్ అల్లూరి అన్నపూర్ణాదేవి, ఉద్దరాజు మాణిక్యాంబగార్లు 28-3-39 వ తేదీని విడుదల చేయబడ్డారు. 144 వ సెక్షన్ ధిక్కరించినందుకు తణుకు సబ్ జైలులో ఉంచబడ్డ నలుగురు రైతులను కూడా విడుదల చేశారు. శిక్షలు విధించబడిన వారి విడుదల ఆర్డర్లుకూడా గవర్నమెంటు పంపించారని తెలుస్తోంది.

ఆంధ్రరాష్ట్ర యువజన సంఘ కార్యదర్శి అల్లూరి సత్యనారాయణ, తణికెళ్ళ వెంకటచలపతి, కృత్తివెంటి వెంకటేశ్వరరావు, మైలవరపు రామారావు, సంకు అప్పారావు, కలిదిండి బంగారం, జిల్లా రైతు సంఘాధ్యక్షులు భూపతిరాజు లక్ష్మీనృశింహరాజుగార్లమీదనున్న 107 వ సెక్షన్ ప్రభుత్వమువారు ఉపసంహరించుకొనినారు. సబ్‌జైలులోనున్న జిల్లా రైతు సంఘాధ్యక్షులు భూపతిరాజు లక్ష్మీనర్సరాజు, సంకు అప్పారావు, మైలవరపు రామారావు, కలిదిండి బంగారం గార్లు 4—4—39 వతేదీ సాయంత్రము 5 గంటలకు విడుదల చేయబడిరి.

మునగాల రాజీ : ఆ తరువాత

శ్రీ అక్కిరాజు మాధవరావు

మునగాల రాజీవ్యవహారములను గూర్చి దేశంలో అనేక వదంతులున్నట్లు నాకు తెలియవచ్చినది. పైగా అనేకమంది మిత్రులకు నిజపరిస్థితులను తెలియ జేయుటకు సంతసించుచున్నాను. ది 12-1-39 తేదిన శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి సమక్షాన రాజీషరిగి కొన్నిషరతులేర్పరచ బడినవి. కాని అవి స్పష్టముగాను, సమగ్రముగాను, లేనందునచే వ్యవహార సందర్భములలో కొన్ని చిక్కులేర్పడజొచ్చెను కాన తిర్గి పరిష్కర్తయొక్క విభాగపు, నిర్ణయము అవసరమయ్యెను. అందువల్ల శ్రీ బ్రహ్మయ్యగారు ది 24-2-39 న మరియొకపరి మునగాల కేతెంచి ఇరుపక్షములను తిర్గి విచారించిరి. ఈదపావచ్చిన తగాదా లన్నియు శిస్తులను మార్చిన వెంటనే వాటినిగూర్చిమాత్రమే నిర్ణయములు చేయబడెను. ప్రధమ రాజీషరతులలో శిస్తులు చెల్లింపవలెనని మాత్రమే యున్నది. న్యాయమైన శిస్తులనగా ఏవని రైతులు కోరుటచే రెండవ పర్యాయము వాటికి వ్యాఖ్యానము చేయుటలో సాగు అయిన విస్తీర్ణమునకు శిస్తు ఇవ్వవలెననియు, కొత్తబంజర్లకు రిమీషన్ ఇవ్వవలెననియు, పల్లపు పట్టాలు పుట్టిననూ బావులు త్రవ్వించినపుడు నీరు పదనిచో మెట్టక్రింద మార్చవలెననియు, మెరక భూములలో జమీందారి నీటిచే పల్లపు సాగైననే, నీటి తీర్వ ఇవ్వవలెననియు, నిర్ణయించబడెను. కాని ఇదివరకు మెరక హెడ్డుక్రింద త్రవ్వబడిన బంజరును నజరానా పుచ్చుకొని సాగు కిచ్చినపుడు, పల్లపుచేటువిధించి, ఇవ్వవచ్చునా అను విషయములో మాకున్ను ఎస్టేటువారికిన్ని అభిప్రాయభేదం వచ్చి సమాధానం కుదురలేదు శ్రీ బ్రహ్మయ్యగారు బావుల విస్తీర్ణమునకు పల్లపుశిస్తు విధింపరాదనియు 1346 ఫసలీ పిమ్మట శిస్తులను కట్టినచో అంతకు పూర్వము బకాయీలన్నియు రద్దుచేయవలెననియు, మరికొన్ని వాగ్రూపకమైన నిర్ణయముల నొసంగిరి. మెట్ట పైరు పూర్తిగా నష్టమయి పోవుటచే రైతులు రిమీషన్ కోరుటచే మూడు అణాలు రిమీషన్ ఇప్పించెదమని తెలిపిరి. కాని ఈరిమీషన్ మొత్తము మెట్టకంతకునా, వక కిస్తీకా, యన్నది స్పష్టపడక అసందిగ్ధముగా తెలుపబడినది. ఈనూతన నిర్ణయముల ప్రకారమైనను చిక్కులు విడిపోలేదు. క్రొత్తతగాదాలు పొడసూపినవి. పట్టాషరతుల విషయములలోను రిమీషను విషయములలోను తదాగాలుకలిగింది

దరఖాస్తులలో కేవలం పట్టాలు ఇప్పించవలెనను వాక్యము మాత్రము లుండవలెననియు పాతపట్టా షరతులలో కొన్నిమార్పులు చేయవలెననియు మొత్తము మెట్టశిస్తుకు మూడు అణాల కమీషన్ ఇవ్వవలెననియు రైతుల కోరిక. అట్లు వీలుపడదనియు,ఫిబ్రవరి కిస్తీకి మాత్రమే మూడు అణాలు రిమీషననియు, ఆ రిమీషను అయినను స్వంతకమతాలు కట్టుబడి అన్నియు చెల్లింపబడిననే ఇవ్వబడుననియు, లాక్కొనబడిన భూములు, ప్రోనోట్లు వగైరా విషయములలో ఈ వ్యవహారపరిష్కారానంతమే ఆలోచించబడుననియు బావుల విస్తీర్ణమునకు కూడా పల్లపు శిస్తులు చెల్లించవలెననియు యస్టేటువారివాదన. కాబట్టి తిర్గి బ్రహ్మయ్యగారి పరిష్కారము కావలనివచ్చినది. 28-3-39 న మమ్ములను, శ్రీ రాజాగారిని బందరు పిలపించిరి. మేము వెళ్లితిమి కాని వార్త అందక పోవుటచే కాబోలు రాజాగారు రాలేదు. తిర్గి 30-3-39 బెజవాడకు మార్చి రాజాగారికి కబురు పంపవలసినదిగా వారి వకీలుగారికి తెలియ జేయబడెను. కాని ఆనాడుకూడా వార్త పంపబడకపోవుటచే రాజాగారు రాలేదు అంత వారి వకీలుగారితో తీవ్రంగా సంభాషించి పిదప శ్రీ బ్రహ్మయ్యగారు కొన్నినిర్ణయముల నొసంగిరి. జమీందారుగారు చేయవలసిన పనియు రైతులు శిస్తులు చెల్లించుటకు ఈ నెల 20 తేదీలోగా పూర్తి కావలెననియు నిక్కచ్చిగా తెలిపినారు. యావత్తు మెట్టకు రూపాయకు రు 0-2-0 లు అనగా ఫిబ్రవరి కిస్తీ మాత్రమే నాలుగు అణాల రిమీషను పట్టాలలో పూర్తిగాస్వంత నూతినీటివల్లనే సాగగువాటికి మెట్టశిస్తు మాత్రమేవసూలు చేయుషరతుల పెట్టవలెననియు, రెండుప్రయివేటుక్రిమినల్ కేసులు ఎత్తువేయింపవలెననియు స్థిరచరాస్తులు, ప్రోనోట్లు వగైరా విషయములకూడా వెంటనే పరిష్కరించవలెననియు నిర్ణయముల నొసంగిరి. ఇవి తుది నిర్ణయములని భావిస్తున్నాను. ప్రధమములో చేయబడిన రాజీషరతులకుస్పష్టమైననిర్వచనము ఇవ్వబడినది. ఈ ప్రకారం రాజీని అమలు జరిపించవలసి యున్నది. ప్రజలపక్షాన మేము పూర్తిగా రాజీని అమలుజరిపించ ప్రయత్నించుచున్నాము ఈ ఏడాది పెన్నపయిరు పూర్తిగా పోవుటవలనను చెరువులు నిండక మాగాణి సాగులు చాలా చెడుగా వదిలివేయ బడుటచేతను, రైతులు మిక్కిలి సంకటావస్థలో యున్నారు. జనవరినాటికే చెరువు లన్నియు పూర్తిగా ఎండిపోయి పశుమనుష్యాదులకు నీరు త్రాగుటకు కూడా ఇబ్బందిగావున్నది. మునగాల నడిగూడెం మొదలగు పెద్దగ్రామాదులలో గ్రామమునకంతా వకటే మంచినీళ్లబావి. ముఖ్యపంట అయిన జొన్నపయిరు పోవుటచే మేతకూడా పశువులు ఇబ్బంది పడుచున్నవి. పరపతి సౌకర్యాలు మిక్కిలితక్కువ. వున్నకొద్ది పరపతిసంఘాలపని బహుస్వల్పము. ఇన్నికష్టాలు ఎదుర్కొంటూవున్నను రైతులు వాగ్దానప్రకారం శిస్తులు చెల్లించుటకు కృతనిశ్చయులై యున్నారు. ప్రజలపక్షమున మాత్రము రాజీ ఏమాత్రము వుల్లంఘింపబడదని నిశ్చయముగా తెలుపగలను. ఈ విషయము అన్నియు గ్రామాదులలో తెలియజేసి షరతులప్రకారం రైతులు చేయవలసినవాటిని అమలు జరిపించుటకై 5 తేది నుండి యస్టేటు ప్రచారక దళములను సాగించచున్నాము.

ఆత్మకూరు తాలూకాలో పోలీసుల పాలన

మా తాలూకాలో పోలీసు జులుంను గురించి ఇదివరకు ఒకసారి నవశక్తి పత్రికాముఖమున పాఠకులు చదివియే వున్నారు. పోలీసుల దుశ్చేష్టలు యీ క్రింది విషయమువల్ల యింకా విశదముకాగలదు. 31-3-39 వ తేదీన కొంపాపల్లె అను గ్రామములో యిద్దరు రైతులు యేదో భూమివిషయమై కలహించిరి. అంతట ఇద్దరూ పోలీసు స్టేషనుకుపోయిరి. యీ గ్రామ మునసబు దగ్గర వుండినా యీ పని జరిగింది. పోలీసువారు (సబ్-ఇనస్పెక్టరు లేరు) సార్జనురైటరు, ఇంకా ఇద్దరుపోలీసులు (చెన్నపల్లె స్టేషన్) వుండిరి. ఇంకా కొంతమంద గ్రామస్థులుకూడా వుండిరి. అయినా, యన్నపూస రామిరెడ్డి (కలహములో ఒకడు) ని తుపాకులతో కొట్టుతామనటం సంకెళ్లు తగిలిస్తామనటం యింకా మెడపై చేయివేసి త్రోయుట మొదలుగాగల చర్య అవలంభించారు. మునసబు, పోలీసులు చాటుకుపోయి యేమేమో మాట్లాడుకొని రామిరెడ్డివద్ద నయబడి రూపాయలు వసూలుచేసుకొని విచారణ లేకుండానే రామిరెడ్డిని తరిమిరట. ఇది అంతయూ 31-3-39 మధ్యాహ్నం 12 గంటలప్పుడు జరిగింది. నేను ఆత్మకూరుపోయి యుంటిని. ఈ అంపమిచ్చిన రైతు తనకు జరిగినఅన్యాయమును పైఆఫీసర్లకు తెల్పుకొనుటకు ఆత్మకూరు వచ్చియుండిరి. నాకు తటస్థపడి యీ విషయమంతా నాతో చెప్పిన పిదప నేను 2-4-39 వ తేదీ ఆత్మకూరులో సర్కిల్, సబ్-ఇనస్పెక్టర్లతో యీ విషయమంతా చెప్పితిని. వారు విచారిస్తామనిరి. ఇంతటితో పూరుకుంద లేదు. ఈ విషయము కాంగ్రెసు మంత్రులకు, కాంగ్రెసు సంఘానికి, కలెక్టరుకు, సూపరింటెండెంటుకు కూడా నా ద్వారా రైతు అర్జీలు పెట్టుకున్నాడు. ఈ లంచగొండితనము బయట వేసినందుకు రైతుపై పోలీసుల ఆగ్రహము చెంది యేమిచేస్తారోనని రైతు భయభ్రాంతుడౌతున్నాడు. కావున అధికారులు, కాంగ్రెసువారు ఈ విషయమై తగుచర్య తీసుకొనవలసినదిగా కోరుచున్నాను.

— జి సి. కొండయ్య.

* * *

కాశీపట్నం సత్యాగ్రహానికి సానుభూతి

గుంటూరుజిల్లా పల్లెకోనలో కామ్రేట్ కుడితిపూడి సత్యన్నారాయణగారి అధ్యక్షతక్రింద యువజనసంఘసభ్యులు హాజరై ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుసంఘము కాశీపట్నము సత్యాగ్రహ విషయమై ప్యాసుచేసిన తీర్మానం, కాంగ్రెసు, ఇతర సామ్రాజ్య వ్యతిరేకసంస్థలతో కలిసి పోరాటాన్ని పెంపొందించే కాలములో చాల నష్టకరమని ఖండించారు.

నెల్లూరుజిల్లా చిరువూరు గ్రామములో శ్రీ ఏలూరి బాబురెడ్డిగారి అధ్యక్షతను గ్రామకాంగ్రెసు సభ్యులు సమావేశమై, కాశీపట్టణ సత్యాగ్రహమును,గూర్చిన ఆంధ్రవర్కింగు కమిటీ తీర్మానానికి అసమ్మతిని తెలియజేశారు. ప్రజల కష్టములు దుస్సహమై తమ వర్గసంఘముల ద్వారా సత్యాగ్రహమునకు సిద్ధమైనపుడు వారికి ప్రోత్సాహమిచ్చి నడిపించుట కాంగ్రెసు వారి ధర్మమని ప్రకటిస్తూ, ఆంధ్రవర్కింగు కమిటీని తమతీర్మానమును ఉపసంహరించు కొనవలెనని కోరారు.

శ్రీ దండు నారాయణరాజు, శ్రీ గొట్టిముక్కల వెంకన్నగార్ల నివేదిక నాధారము చేసుకొని, కాశీపట్నము రైతులకు, న్యాయమైన నిర్ణయము కలుగ జేయవలసినదిగా కాంగ్రెసు మంత్రివర్గమును కోరిరి.

చిత్తూరుజిల్లా దొడ్డమిట్ట గ్రామములో రైతుమహాసభ శ్రీ వెంకటేశంగారి అధ్యక్షతన జరిగింది. కాశీపట్టణపు రైతులు తమ అనాది సిద్ధమైన హక్కులకోసం శాంతియుతంగా పోరాటము సాగించినందులకు అభినందించారు. పోలీసుల అమానుష లాఠీచార్జీని, అరెస్టులతో కూడిన క్రూరవిధానాన్ని ఖండించారు. కాశీపట్న సత్యాగ్రహం పనికిరాదని రాష్ట్రకాంగ్రెసు కమిటీ వారిదృక్పధానికి అసమ్మతిని తెలియచేశారు.ఆతీర్మానాన్ని ఉపసంహరించుకొనవలసినదిగా కోరారు.

* * *

నూతన కృష్ణాజిల్లా రైతుసంఘ సమావేశము కాజ (దివి తాలూకా)

ది 14-4-39 శుక్రవారం రాత్రి 8 గంటలకు దివితాలూకాలో కాజగ్రామములో శ్రీ పేకేటి వీరారెడ్డిగారి యింటివద్ద నూతన కృష్ణాజిల్లా రైతుసంఘ సాధారణసభ్యుల సమావేశము యీక్రింది కార్యక్రమము నిర్వర్తించుటకు జరుగును గాన నూతన జిల్లా సాధారసంఘసభ్యులందరు విచ్చేయ ప్రార్థితులు.

కార్యక్రమం

1. సంఘముయొక్క వార్షికనివేదిక
2. నూతన జిల్లా కార్యనిర్వాహక వర్గ ఎన్నికలు.
3. మహాసభలో పెట్టవలసిన తీర్మానములు.

కామినేని వెంకటప్పయ్య.
అధ్యక్షులు కృష్ణాజిల్లా రైతుసంఘం.

దివి తాలూకా రైతుసంఘం.

ది 1-4-39 తారీఖున కాకర్ల చంద్రశేఖరరావుగారి అధ్యక్షతను చల్లపల్లి రహదారి బంగాళాలో సాయంకాలం 3 గంటలకు సమావేశమై ఈ క్రిందివారిని నూతన సంవత్సరమునకు కార్యనిర్వాహక వర్గముగా ఎన్నుకొనుటయైనది.

- కాకర్ల చంద్రశేఖరరావుగారు (అధ్యక్షుడు)
- గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు (ఉపాధ్యక్షుడు)
- మాలెంపాటి శీతారామయ్యగారు (ప్రధానకార్యదర్శి)
- పేకేటి రంగారావుగారు
- సనకా బుచ్చికోటయ్యగారు (సహాయ కార్యదర్శులు)

పదిమందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకొనిరి. ఇకముందు కార్యస్థానము చల్లపల్లిలో నుంచుటకు తీర్మానించిరి.

* * *

ఇందుపూరు గ్రామరైతుల ఇబ్బందులు

నెల్లూరుజిల్లా ఇందుపూరు గ్రామస్థులు 2-4-39 తేదీన సమావేశమై, రెండుసంవత్సరాలనుండిపంచాయితీబోర్డును స్థాపించుటకుకృషిచేసననూ, ఇంతవరకు ఏర్పడనందులకు అసంతృప్తిని తెలియజేస్తూ వెంటనే ఏర్పడునట్లు చేయవలసినదిగా నెల్లూరు జిల్లాబోర్డును, స్థానికపాలనామంత్రిగారిని కోరిరి. వర్తకులు పెద్ద కుంచాలతో వడ్లను కొనుక్కోవడము మాన్పించవలసినదిగను, కూలీలకు సరియైన కొలత పాత్రలతో జీతాలిప్పించవలసినదిగను, నాములను రద్దుచేయవలసినదిగను నూటికి నెలకుఅర్ధరూపాయకన్న ఎక్కువ వడ్డీ యుండకుండునట్లు చూడవలసినదిగను ఒక కమిటీని ఏర్పరచిరి. తమ గ్రామానికి వెంటనే రోడ్డు గూడా వేయుంప వలసినదిగ కోరిరి.

రామదుర్గలో ప్రజలకు పోలీసులకు ఘర్షణ

పోలీసులు 65 రౌండ్లు కాల్చారు: 5 గురు ప్రజలు, 8 మంది పోలీసులు చనిపోయారు.

ఏప్రిల్ నెల 6 వ తేదీ మొదలు 13 వరకు జాతీయవారం జయప్రదంగా భారతదేశ మంతటా జరుగుతుంది. రామదుర్గలో కూడ జరపడానికి ప్రజా సంఘము నిశ్చయించుకుంది. పట్టణ మంతా కోలాహలముగా వుంది.

గత బుధవారంనాడు జెండా చౌకులో జెండా మార్గానికి అడ్డుగా వుందనీ, దానిని తీసివేయవలసినదని, సంస్థాన ప్రభుత్వము ఆర్డరిచ్చింది. ప్రజలా ఆర్డరును ఉల్లంఘించి, పతాకాన్ని పునఃప్రతిష్ట గావించారు. ప్రజలను చెదరగొట్టడానికి పోలీసులు లాఠీచార్జీచేశారు. ఎక్కడనుండియో "రళ్లు పడ్డాయనే" సాకుతో పోలీసులు ప్రజలపై తుపాకులు కాల్చారు. రవ్వ దెబ్బలు తగిలి చాలమంది గాయపడ్డారు.

6 వ తేదీ ఉదయాన్నే, సంస్థాన ప్రభుత్వము ప్రజాసంఘాన్ని అక్రమసంఘంగా ప్రకటించి, ప్రజా సంఘ అధ్యక్షు డగు మనోలీగారిని మరి 4 గురు ప్రజా సంఘ సేవకులను అరెస్టు చేసింది.

ప్రజా నాయకుల అరెస్టుపై ఆవేశము ఎక్కువైంది. దానిని అణచివేయడానికి, దివాన్, మేజిస్ట్రేటుగార్లు ప్రయత్నించి విఫలు లయారు. 7 వ తేదీ ఉదయాన్నే ప్రదర్శనాలను నిషేధిస్తూ సంస్థాన ప్రభుత్వము ఉత్తరువులు జారీ చేసింది.

7 వ తేదీ మధ్యాహ్నం రామదుర్గకు సమీపమందున్న రెండు మూడు గ్రామాల నుండి సుమారు 100 గురు ప్రజలు పట్టణంలో ప్రదర్శనాలు గావించి, నాయకులను విడుదల చేయవలసిందని కోరారు. కొలదిసేపటిలో ప్రదర్శనములో పాల్గొనే జనుల సంఖ్య 10, 12 వందలకు హెచ్చిపోయింది. వీరంతా జైలు గేటు వద్దకు పోయి నాయకులను విడుదల చేయవలసినదని కోరుతూ శాంతియుతంగా ప్రదర్శనము గావించారు. జైలు లోపలినుండి, పోలీసులు 65 రౌండ్లు ప్రజలపై తుపాకులు కాల్చారు. దానివల్ల 5గురు ప్రజలు మరణించారు. పోలీసుల అక్రమానికి కుపితులై ప్రజలు జైలుపై బడి గేటుకు నిప్పు ముట్టించారు. జైలు సూపరింటెండెంటు నాయకులను విడుదల చేసి వెలుపలికి తీసుకువచ్చి వదిలాడు. శాంతంగా నుండవలసిలసినదని ప్రజలను నాయకులు హెచ్చరించుచున్నారు. ఇంతలో ఇంకొకవంకనుండి పోలీసులు ప్రజలపై తుపాకులు కాల్చారు. ఇక నీ దుర్ణయానికి ప్రజలు సహించలేకపోయారు. జైలును ముట్టడించి, దానికి నిప్పంటించారు. పోలీసులను ఎదిరించి, పోరాడి, వారిలో 8 మందిని చంపివేశారు. ఇద్దరు జయిలర్లను కొట్టారు. జయిలరు ఇంటికి నిప్పు పెట్టారు. జయిలరు ప్రమాద స్థితిలో నున్నాడు.

ఈ ప్రజా విజృంభణకు వెరచి, సంస్థాన ప్రభువు మిలిటరీ సహాయము పంపవలసిందని రెసిడెంటుకు తంతివార్త పంపాడు. తన భవనము చుట్టు పోలీసు సిబ్బందని కాపలాయుంచి తాను సకుటుంబంగా బెల్గాం సురక్షితంగా చేరుకున్నాడు.

7 వ తేదీ సాయంత్రానికి 50 మంది గల మిలిటరీదళం రామదుర్గం వచ్చింది. ముందుగా జైలువద్దకు వెళ్లిచూచేసరికి మరణించిన 8 మంది శవాలు ఎదురుగా కనుపించాయి. కాని అప్పటికప్పుడే ప్రజలంతా ఎక్కడి వారక్కడికి సర్దుకున్నారు. మిలిటరీ సైనికులు పట్టణమంతటా కవాతు చేశారు. సాయంత్రము 7 గంటలయేసరికి వాతావరణం అంతా ప్రశాంతంగా మారిపోయింది.

కర్నాటక కాంగ్రెసు నాయకులు ప్రజలు గావించిన "విషాద కృత్యానికి" విచారాన్ని వెల్లడించారు. ఏ పరిస్థితులలోను ప్రజలు ఏ మాత్రము దౌర్జన్యానికి తలపడరాదని అందువల్ల మొత్తం ఉద్యమానికంతటికి హానికలుగుతుందని వారు ప్రకటించారు.

తిరువాన్కూరు

తిరువాన్కూరు వ్యవహారాలు
గాంధీగారికేమి తెలియవు!

తిరువాన్కూరు స్టేట్ కాంగ్రెసు మహాత్మాజీ సలహాపై తిరిగి సత్యాగ్రహాన్ని ఆపు చేసింది. అధ్యక్షుడైన పట్టంతాను పిళ్లేగారు, కవున్సిలు ఆఫ్ ఆక్షను సభ్యులు విడుదల చేయబడ్డారు ఇంకను వందలకొలది స్టేట్ కాంగ్రెసు సేవకులు ఖైదులలో మ్రగ్గుతూనే ఉన్నారు. ఇంతేగాదు అరెస్టులు గూడా ఇంకా సాగుతూనే ఉన్నాయి. రాజకీయ ఖైదీలకు ఏ విధమైన సౌకర్యాలను ప్రభుత్వం చూపుటలేదు. వారిని ప్రత్యేక కొట్టులలో నిర్బంధించి ఉంచుతున్నారు. శివరాజ పాండియన్ అనే కాంగ్రెసు వలంటీరు పోలీసు స్వాధీనంలో ఉండగానే మరణించాడు. డాక్టర్ యన్. యస్. పిళ్ళేగారు చాలా అనారోగ్యకరమైన స్థితిలో అరెస్టుచేయబడి మరునాడే, చాలా ప్రమాదస్థితిలో ఆస్పత్రికి చేర్చబడ్డారు. కాదకాల్‌తో ప్రభుత్వ సిబ్బందీ ప్రజల ఇండ్లు తగులబెట్టి ఆస్తులన్నీ నాశనం చేశారు. మార్చి 31 వ తేదీని వరిగీస్‌గారిపైనను మరి 11 గురు స్టేట్ కాంగ్రెసు వలంటటీర్లపై బడి క్విలన్ పోలీసులు మార్గ మధ్యంలో దారుణంగా గొట్టారు. చాలమంది మంచము పట్టారు. ఆర్. కుమారర్‌గారిని, సేలం నివాసియు సైకిల్ టూరిస్టుయునగు బాల గురునాధం అను వారిని, పి. యం. నాయర్‌గారిని, ప్రభుత్వము రాజద్రోహ నేరం క్రింద అరెస్టు చేసింది-కొచ్చిన్ నుండి వెలువడుతూన్న సురసానణ, విజయాన్ అనే పత్రికలను ప్రభుత్వం నిషేధించింది. తిరువాన్కూరు ప్రభుత్వము యొక్క వైఖరి ఇసుమంతయు మారలేదు.

ప్రభుత్వం అవలంబించుచున్న నిర్బంధ విధానం పట్ల పోలీసు దుండగాలపట్ల, అసమ్మతిని తెలుపుతూ పట్టంతాను పిళ్ళేగారు ఒక ప్రకటన చేశారు. దివాన్ దానిని ఖండించాడు. వీటి విషయమై నిష్పాక్షిక విచారణ జరుగాలని తాను పిళ్లేగారు సవాలు చేశారు.

తిరువాన్కూరు వ్యవహారాలను ఎప్పటికప్పుడు పూసగుచ్చినట్లు తెలుసు కుంటూన్న గాంధీజీకూడ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ మతిలేని "ఈ నిర్బంధ విధానము ప్రభుత్వానికి తీరనిదెబ్బ" అన్నాడు.

గాంధిజీ ప్రకటనను ఖండిస్తూ తిరువాన్కూరు ప్రభుత్వం "స్టేట్ కాంగ్రెసు నాయకు లెవరూ గాంధిజీని అనుసరించేవారు కారు. కపటముగా అలా నటిస్తున్నారు. స్టేట్ కాంగ్రెసు నాయకులగు తానుపిళ్లై, జాన్ కురువిల్లా, ఫిలిపోస్ మొదలగువారి ఉపన్యాసాలు చాలా దౌర్జన్యపూరితంగా నున్నాయి. ఇంతకంటె చిన్ననేరాలకు ఇతరచోట్ల చాలా శిక్షలు జరుగుతున్నాయి. మా ప్రభుత్వంగనుకనే వాటి నన్నిటిని సహించి ఊరుకుంది. గాంధిజీ స్టేట్ కాంగ్రెసు నాయకుల మాటలు నమ్మి పొరబడుతున్నాడు. ఆయనకు ప్రస్తుతం తిరువాన్కూరులోని వ్యవహారాలేమి తెలియనే తెలియవు" అని సమాధాన మిచ్చింది.

జయపూరు

మహమ్మదీయుల నిర్గమనం.

జనవరి 27 వ తేదీని జయపూరులో మహమ్మదీయులు చాలమంది మసీదు ఎదుట నిలబడి ఉన్నారు. మసీదు ద్వారం చిన్నది. లోనికి పోవలసిన జనం ఎక్కువ. ఈ రద్దీలో ప్రజలలో పరస్పర కలహం ప్రారంభమయింది. మార్గమంతా జన సమూహముతో నిండి ఉంది.

ఈ ప్రజలను చెదరగొట్టుటకు సంస్థాన ప్రభుత్వం ప్రజలపై తుపాకులను కాల్చినది. దీనికి ఇంకొక కారణము కూడా ఉంది. కొలదిరోజులలోనే జయపూర్‌లో సత్యాగ్రహము ప్రారంభిస్తానని బజాజ్‌గారు ప్రకటించారు. ఈలోగా హిందూ, మహమ్మదీయ కయ్యాన్ని పురిగొల్పాలని కూడ ప్రభుత్వం ఆసించింది. ఈ కాల్పుల సందర్భములో కొందరు మరణించారు. 12 మంది అరెస్టు చేయబడ్డారు.

వీరివిషయమై విచారించుటకు ముస్లిం లీగ్ ఒక కమిటీని వేసింది. ప్రభుత్వము దానిని ఆటంకపరచింది. మసీదు ద్వారం వెడల్పు గావిస్తామని, మరణించినవారి కుటుంబాలకు సదుపాయాలు చేస్తామని ప్రభుత్వము ప్రకటించింది. అందుపై ఒక విచారణ కమిటీని వేసింది. మహమ్మదీయులు ఈ కమిటీని బహిష్కరించారు. ప్రభువు ప్రకటించిన సంస్కరణలు చాలవని, అరెస్టు చేయబడిన నాయకులను కూడ విడుదల చేయవలసినదని మహమ్మదీయులు కోరారు. ప్రభువు నిరాకరించాడు.

అందుపై 300 మంది రెసిడెంటు (బ్రిటిషు ప్రభుత్వ ప్రతినిధి) వద్దకుపోయి దీని విషయమయి విన్నవించుకున్నారు. సంస్థానాల వ్యవహారాలలో తానుకలుగజేసుకొనజాలననియు, విచారణ కోరవలదనియు రెసిడెంటు సలహా నిచ్చాడు. అందుపై మహమ్మదీయులు జయపూర్ నుండి వెడలిపోతామని చెప్పారు. అట్టి హిజరత్ (నిర్గమనము) సందర్భములో ఏమి ప్రదర్శనాలు చేయకుండ ఉండవలసినదని రెసిడెంటు ప్రజలకు సలహాఇచ్చాడు.

2-4-39 తేదీని 3000 మంది ప్రజలు జయపూర్ సంస్థానమును విడచి వేరు వేరు దళాలుగాబయలుదేరి పోవుచున్నారు. వీరిలో 2000 మంది ఢిల్లీ పట్టణం చేరుకున్నారు.

మీవార్

మీవార్ ప్రజలకు మహాత్ముని లేఖ

"సంస్థానాలన్నిటిలోనూ సాగుతూన్న సత్యాగ్రహాన్ని, సత్యాగ్రహ ప్రయత్నాలను అన్నిటిని ఆపుచేయాలి. ఆ పనినే మీవార్ ప్రజా మండలికూడా చేయాలి. నిర్మాణ కార్యక్రమాన్ని సాగించాలి. నేను వ్రాసే వ్యాసాలన్నీ జీర్ణం చేసుకోవాలి." అని మహాత్మాజీ, మీవార్ ప్రజామండలికి ఈ నెల 4 వ తేదీన లేఖ పంపారు.

పరిణీత

శరచ్చంద్ర చటర్జీ

విరచితం

ఈమె మృదుస్వరం శేఖరుని చెవిని పడలేదు. అతనేమీ జవాబివ్వలేదు. లలిత అప్పుడు యింకా కొంచెం బిగ్గరగా "నాకోసం అందరూ నిలబడి వున్నారు" అన్నది.

ఈ మాట శేఖరునికి వినపడింది. పుస్తకం ఒక పక్కన పెట్టి "ఏమిటి సంగతి?" అని అడిగాడు.

"ఇప్పటికి వినపడిం దన్నమాట! మేము నాటకం చూట్టానికి పోతున్నాం!" అన్నది లలిత కొంచెం అలకతో.

"మేమంటే ఎవరు?"

"నేనూ, అన్నాకాళీ, చారుబాలా, దాని తమ్ముడూ, వాళ్ళ మామా."

"మామ ఎవరు?"

"గిరీన్‌బాబు. అయిదారు రోజులయింది ముంగేరునుంచి వచ్చాడు. ఇక్కడే బి. ఏ. చదువుతాడు. చాలా మంచి—"

"ఇంకేం! పేరూ, ఊరూ, ఉద్యోగం—సంభాషణ చాలాదూరం వచ్చినట్టుగా ఉందే? అందుకనేనా నాలుగు రోజులనుంచి కనపడటమే లేదు—చీట్లాట బాగా సాగుతున్నదా లేదా?"

"శేఖరుని ఫోరజో చూసేవరకు లలితకు భయం వేసింది. ఇలాంటి ప్రశ్న వస్తుందని ఆమె భావించనే లేదు; జవాబివ్వలేదు.

"ఇన్నాళ్ళనుంచీ చీట్లాడుతున్నావు కామా?"

"చారు చెప్పిందా?" అని లలిత నీళ్ళు నవులుతూ అడిగింది.

"చారు చెప్పిందని ఎవరు చెప్పారు?" అని శేఖరుడు ఆమెవంక చూసి "ఒక్కమాటే గుడ్డలవీ వేసుకొని ముస్తాబయి వచ్చావు—సరే, పో!" అన్నాడు.

లలిత కదలలేదు. మాట్లాడకుండా నిలబడింది.

చారుబాల పొరుగుపిల్ల. ఈమె సఖి; సమవయస్క. వారిది బ్రహ్మ సమాజం. శేఖరుడు ఈ గిరీనుని తప్ప అందరినీ ఎరుగును. గిరీన్ అయిదారు సంవత్సరాల క్రిందట మాత్రం ఒకమాటు వచ్చిపోయాడు. ఈమధ్య బాంకీపూరులో చదువుతున్నాడు. కలకత్తా రావలసిన అవసరమూ లేదు; రానూ లేదు. అందుచేతనే శేఖరుడు అతన్ని ఎరిగడు.

లలిత అక్కడనుంచి కదలకపోవటం చూచి "ఊరక ఎందుకు నిలబడతావు పోరాదూ?" అని శేఖరుడు ముఖానికి పుస్తకం అడ్డం పెట్టుకున్నాడు.

అయిదారు నిమిషాలు మొదలకుండ ఊరుకుని "వెళ్ళమంటారా?" అని లలిత మెల్లగా అడిగింది.

"పొమ్మని చెప్పానుగా లలితా!"

శేఖరుని ఈ వింత ప్రశ్న చూసేవరకు లలితకు నాటకం చూడాలనే కోరిక నశించింది. కాని పోకుండా ఉండటానికి కూడా వీల్లేకుండా ఉంది. వాళ్ళందరిని చారు ఇంటిదగ్గర నిలబెట్టి వచ్చింది. ఈమె కోసం వారు ఎదురు చూస్తున్నారు. ఆలస్యం అయినకొద్దీ వారి ఉద్విగ్నత హెచ్చిపోతూ ఉండవచ్చునని ఈమె భావించింది. కాని ఏమిచేస్తుంది? అనుమతి తీసుకోకుండా పోయేటంత సాహసం ఈమెకులేదు. ఇంకో రెండు మూడు నిమిషాలు నిశ్శబ్దంగా ఉండి "ఈ ఒక్కనాటికే! పొమ్మంటారా?" అని అడిగింది.

శేఖరుడు పుస్తకం ఒక ప్రక్కకు పారేసి, కసరినట్టుగా—"నన్ను విసిగించబోకు లలితా; పోవాలనే కోరికవుంటే పో. మంచీ చెడు తెలుసుకునే ప్రాయం నీకు వచ్చింది." అన్నాడు.

లలిత చకితురాలయింది, శేఖరుడు కసరటం కొత్తకాదు. అభ్యాసమే. కాని రెండు సంవత్సరాల ఈ మధ్య ఇలాంటి మాటలు ఈమె వినలేదు. అటు సఖులు ఎదురు చూస్తున్నారు; తాను కూడా గుడ్డలుమార్చి తయారయింది. ఈ మధ్యలో డబ్బుకోసం వచ్చి యీ చిక్కులో పడింది. అప్పుడు వాళ్ళకు ఏమి చెప్పుతుంది? ఎక్కడికయినా పోయే, విషయంలో శేఖరుడు నేటివరకూ ఈమెకు పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చాడు. ఆ నమ్మకముతోటే గుడ్డలవీ మార్చి తయారయివచ్చింది. ఆ స్వాతంత్ర్యం నేడు ఇలా పోవటమేకాకుండా, పోవటానికి చూపించిన కారణం ఎంత లజ్జాకరమైందో, యిప్పుడు—ఈ పదమూడవ ఏట తెలుసుకుని కుమిలిపోతూ వున్నది. అభిమానంతో కళ్ళ నీళ్ల నింపుకొని ఇంకో అయిదారు నిముషాలు అలాగే నిశ్శబ్దంగా నిలబడి కళ్లు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది.

ఇంటికిపోయి అన్నాకాళిని పిలిపించి దానిచేతిలో పది రూపాయలు పెట్టి "ఇవ్వాళకు మీరు పోండి కాళీ, నాకు చాలా జబ్బు చేసింది. నేను రాలేనని చారుతో చెప్పు." అన్నది.

"ఏం జబ్బు వదినా?" అని అడిగింది కాళీ.

"తలనొప్పి— ఒళ్ళంతా విరగగొట్టుకు పోతున్నది—అబ్బ!" అని మంచంమీద పండుకుంది. తర్వాత చారువచ్చి బ్రతిమాలింది; బలవంత పెట్టింది; అత్తచేత సిఫార్సుచేయించింది. కాని లలిత ఏమాత్రం ఒప్పుకోలేదు. చేతిలో పదిరూపాయలు పడగానే అన్నాకాళి ఎప్పుడు పోదామా అని ఉవ్విళ్లూగుతూ ఉంది. ఈ గోలలో ఒక వేళ ప్రయాణమే ఆగిపోతుందేమోననే భయంతో చారును చాటుకుపిలిచి డబ్బు చూపించి "వదినెకు జబ్బు చేసింది; అదిరాకపోతే ఏం చారూ! నాకు డబ్బిచ్చింది. ఇదిగో మనం వెళ్దాంపద!" అన్నది.

అన్నాకాళి వయస్సుకు చిన్నదయినా బుద్ధికి పెద్దలకు తీసిపోదని చారు గ్రహించి కాళిని వెంటబెట్టుకొని వెళ్ళిపోయినది.

3

చారుబాల తల్లి, మనోరమకు ఈ ప్రపంచంలో చీట్లపేకకంటే ప్రియమైన వస్తువ మరొకటి లేదు. ఆమెకు ఆడవలెననే ఆసక్తి ఎక్కువ; కాని దక్షత తరుగు. ఆమెలోని ఈలోటు సవరించటానికి లలిత దొరికింది. లలిత బాగా ఆడగలదు. మనోరమ పినతల్లి కొడుకు గిరీంద్రుడు వచ్చినప్పటినుంచీ మధ్యాహ్నం వారింట్లో చీట్లాట సాగుతూనే ఉండేది. గిరీంద్రుడు పురుషుడు, బాగా ఆడగలడు. అందుచేత అతనికి ప్రతిపక్షంలో లలిత ఉండకపోతే ఆట రక్తికట్టేది కాదు.

నాటకానికి వెళ్ళిన మర్నాడు మామూలు వేళకు లలిత రాకపోవడం చూసి మనోరమ ఆమెకోసం దాసీని పంపింది. అప్పుడు లలిత ఒక ఇంగ్లీషు నవలకు బెంగాలీ తర్జుమా చదువుతూ ఉన్నది-వెళ్ళలేదు. తర్వాత చారు వచ్చి కూడా ఆమెను తీసుకువెళ్ళలేకపోయింది. అప్పుడు మనోరమే స్వయంగా వచ్చి—"లే, నువ్వు పెద్దగా చదివి జడ్జీపని చేయబోవటం లేదు. రా, నీవు చీట్లాడక తప్పదు" అన్నది.

లలిత చాలా చిక్కులో పడింది. ఏడ్పుమొహం పెట్టి—"ఇవ్వాళ చాలా పని వుంది. రాలేను. రేపు తప్పక వస్తాను" అన్నది.

మనోరమ ఏమాత్రమూ వినలేదు. వాళ్ళ అత్తయ్యచేత చెప్పించి తీసుకు వెళ్లింది. ఇవ్వాళ కూడా ఆమె గిరీన్‌కు ప్రతికక్షిగానే ఆడింది. కాని ఆట రక్తికట్టలేదు. మనస్సంతా ఆటలో లగ్నం చేయలేకపోయింది. ఆడుతున్నంతసేపూ ముళ్ళ మీద కూర్చున్నట్టుగా గడిపి వేళ కాగానే బయలుదేరింది.

"రాత్రి మీరు డబ్బు పంపారుగాని రాలేదు. రేపు రండి, మళ్ళీ వెళదాము" అని గిరీంద్రుడు అడిగాడు.

"నాకు నిన్న చాలా జబ్బు చేసింది." అన్నది లలిత మెల్లగా.

"ఇప్పుడు జబ్బు నయమయిందిగా! రేపు రావచ్చును." అన్నాడు గిరీన్ నవ్వుతూ.

"కాదండి, రేపు నాకు చాలా తొందర పనులున్నాయి" అని లలిత వేగంగా వెళ్ళిపోయింది. ఇవ్వాళ ఈమె శేఖరుని భయం మూలానే మనస్సును ఆటలో లగ్నం చేయలేక పోయింది—అని అనడానికి వీల్లేదు. ఈమె స్వతహాగా సిగ్గుపడింది.

శేఖరుని యింటికి వస్తూపోతూ ఉన్నట్టు ఈ యింటికికూడా లలిత చిన్నప్పటినుంచి వస్తూ పోతూ వుండేది, వాళ్ళ యింట్లో తిరిగినట్టుగానే వీళ్ళ యింట్లోనూ అందరి యెదుటా తిరుగుతూ ఉండేది. గిరీన్ యెదుట తిరగటానికిగాని మాట్లాడడానికిగాని మొదట ఈమెకు ఏమీ సంకోచం కలగలేదు. కాని ఇవ్వాళ గిరీన్ దగ్గర కూర్చుని ఆడుతున్నంతసేపూ ఈమె మనస్సు యెలానో ఉన్నది. ఈ కొద్ది రోజుల పరిచయానికే గిరీంద్రుడు తన్ను ప్రేమ దృక్కులతో చూస్తున్నాడని ఈమె గ్రహించింది. పురుషుల ప్రేమ దృష్టి ఇంత లజ్జాకరమయినదని ఈమెకు ఇదివరకు తెలియదు.

లలిత యింటికిపోయి ఒక మాటు కనపడి తొందరగా శేఖరుని గదిలో ప్రవేశించి పనిలో నిమగ్నమైంది. చిన్నప్పటినుంచీ చిన్నా పెద్దా అనే తేడా లేకుండా—ఈ గదిలో పనులన్నీ ఈమె చేస్తూ ఉండేది. పుస్తకాలు సర్దడం, టేబిలు దులపడం, కలం—సిరాబుడ్డి వగయిరాలు తుడిచి శుభ్రం చేయటం—అన్నీ ఈమె వంతు. ఇంకెవ్వరూ ముట్టుకునే వారు కారు. ఈ అయిదారు రోజుల నిర్లక్ష్యంమూలాన చాలా పనులు పేరు కొన్నవి. ఈ లోట్లన్నీ శేఖరుడు రాక పూర్వమే సవరించాలని ఈమె నడుము కట్టుకొన్నది.

లలిత భువనేశ్వరిని 'అమ్మా' అని పిలుస్తుంది. తీరుబడి ఉన్నప్పుడెల్లా ఆమె దగ్గరనే ఉంటుంది. లలిత ఈ యింట్లోవారి నెవ్వరిని పరాయివారని అనుకునేదికాదు. అందుచేత ఈ—ఇంట్లో వారెవ్వరూ కూడా ఈమె పరాయిదని భావించేవారుకారు. ఎనిమిదో యేట తల్లిదండ్రులు చనిపోయి మామగారింటికి వచ్చింది. అప్పటినుంచీ శేఖరుని వెంట చెల్లెలు మాదిరిగా తిరుగుతూ, చదువూ అదీ నేర్చుకున్నది.

ఈమె శేఖరునికి ప్రేమ పాత్ర అని అందరకూ తెలుసును. కాని ఆ ప్రేమ ఇప్పుడు ఏ రూపం ధరించినదో ఎవ్వరికీ తెలియదు — లలితకూ తెలియదు. శేఖరుడు ఈమెను చిన్నప్పటినుంచీ ఒకే భావంతో మహా ఆదరం చూపిస్తూ వస్తున్నాడు. ఈ ఆదరం ఇప్పటివరకు ఎవ్వరికీ విసదృశంగా కనుపించలేదు. లేక ఈ ఆదరం ఎవ్వరి దృష్టినీ ఆకర్షించలేదని కూడా చెప్పవచ్చును. ఒకప్పుడు ఈమె వధువుగా ఈ గృహంలో ప్రవేశిస్తుందని ఎవ్వరూ భావించలేదు. ఎవరివాకా ఎందుకు?—లలిత అత్తమామలే అనుకోలేదు; ఆఖరికి భువనేశ్వరికూడా తలచలేదు.

"చక్రపాణి"

అనువాదం

పని తొందరగా పూర్తిచేసి శేఖరుడు రాక పూర్వమే వెళ్లాలని లలిత అనుకొన్నది. కాని అన్యమనస్కంగా ఉండటంచేత గడియారం వంక చూడనేలేదు. హఠాత్తుగా గదిబయట బూట్ల చప్పుడు విని తల ఎత్తి చూచి ఒక ప్రక్కకుపోయి నిలబడింది. శేఖరుడు గదిలోనికి రాగానే—"నీవా! నిన్న యింటికి చేరుకునేసరికి ఎన్ని గంటలయింది?" అని అడిగాడు.

లలిత జవాబివ్వలేదు.

శేఖరుడు సోఫాలో పండుకొని "ఎప్పుడు తిరిగివచ్చావు? రెండింటికా, మూడింటికా? నోట మాటలేదో?" అన్నాడు.

లలిత అలానే మాట్లాడకుండా నిలబడింది.

"క్రిందకు పో, అమ్మ పిలుస్తున్నది." అన్నాడు శేఖరుడు విసుకుపుట్టి.

భువనేశ్వరి భండార గృహంలో కూర్చుని పళ్లెంలో ఫలహారాలు పెట్టుతూ ఉండగా లలిత దగ్గరకువచ్చి "అమ్మా నన్ను పిల్చావా?" అని అడిగింది.

"ఎక్కడా? పిలువలేదే!" అని ఆమె తలఎత్తి లలిత ముఖంవంక చూసి "ముఖం అలా వాడిపోయిందేం లలితా! ఇంకా భోంచేయలేదా" అని అడిగింది.

లలిత లేదన్నట్టు తల తిప్పింది.

"సరే పో, మీ అన్నకు ఈ ఫలహారాలు ఛబ్బున ఇచ్చిరా," అని అన్నది భువనేశ్వరి.

లలిత ఫలహారాల పళ్లెం చేత పట్టుకొని పైకి వచ్చింది. శేఖరుడు ఇంకా సోఫాలో కళ్లు మూసుకొని పండుకునే వున్నాడు; ఆఫీసు దుస్తులు విడువలేదు. చేతులూ ముఖమూ కడుక్కోలేదు. లలిత దగ్గరకు వచ్చి "ఫలహారం తెచ్చాను" అన్నది మెల్లిగా.

"అక్కడ పెట్టి పో!" అన్నాడు శేఖరుడు కళ్లు తెరవకుండానే.

లలిత క్రింద పెట్టలేదు. చేత పట్టుకొని అలానే నిలబడింది.

శేఖరుడు కళ్లు తెరవకపోయినా లలిత అక్కడనుండి పోలేదని గ్రహించాడు. రెండు నిముషాలయిన తర్వాత "ఇంకా ఎంతసేపు నిలబడతావు లలితా! నాకు ఇంకా ఆలశ్యం ఉంది; బల్ల మీద పెట్టి క్రిందకు పో" అన్నాడు.

లలితకూ విసుగ్గానే ఉంది. "ఆలశ్యం అయితేమానె. నాకు క్రింద పనేమీ లేదు" అన్నది మెల్లగా.

శేఖరుడు కళ్లు తెరచి నవ్వుతూ "అదిగో మాట వచ్చిందే! క్రింద పనిలేకపోయినా ఆ యింట్లో పని వున్నదిగా? అక్కడా లేకపోతే అవతల యింట్లోనైనా వుంటుంది! నీకు ఒక యిల్లు కాదుగా లలితా?" అన్నాడు.

"లేక" అని కోపంతో లలిత ఫలహారాల పళ్లెం టప్పున బల్లమీద ఉంచి చక చకా వెళ్ళిపోయింది.

"సాయంకాలం ఒకమాటు రా!" అని శేఖరుడు కేక వేశాడు.

"ఒక వందసార్లు నేను పైకీ కిందకీ తిరగలేను!" అని లలిత క్రిందకు వెళ్ళింది.

"అన్నాయికి ఫలహారం యిచ్చి వచ్చావు కాని తాంబూలం యిచ్చి రాలేదేమే?" అన్నది తల్లి, లలిత క్రిందకు రాగానే.

"నాకు ఆకలి అవుతున్నదమ్మా! నేనిక పోలేను. ఇంకెవరినైనా పంపు" అని టప్పున కూలబడింది.

ధుమధుమలాడే లలిత ముఖంవంక భువనేశ్వరి మందహాసంచేస్తూ—"సరే! నువ్వు తిందువుగాని కూర్చో. నేను దాసీచేత పంపుతాను" అన్నది.

లలిత జవాబివ్వకుండా తిన నారంభించినది.

తాను థియేటరుకు పోలేదు—పోకపోయినా శేఖరుడు తన్నెందుకు మందలించాలి!—ఈ కోపంతో లలిత నాలుగైదు రోజులు శేఖరునికి కనిపించలేదు. కాని అతను ఆఫీసుకు వెళ్లగానే గదిలో పనంతా చేస్తూ వుండేది. శేఖరుడు తన పొరపాటును గుర్తించి రెండు మూడు సార్లు పిలిచాడు. కాని లలిత రాలేదు.

౪

ఈ పేటకు ఒక వృద్ధుడు అప్పుడప్పుడు బిచ్చానికి వస్తూ ఉండేవాడు. అతని మీద లలితకు చాలా దయ. వచ్చినప్పుడెల్లా ఒక్కొక్క రూపాయి ఇస్తూఉండేది. రూపాయి చేతిలో పడగానే వాడు అసంభవమూ అపూర్వమూ అయిన ఆశీర్వాదాలన్నీ యిస్తూ వుండేవాడు: లలిత పూర్వ జన్మలో వాడి తల్లి అట; ఈ సంగతి వాడు లలితను చూడగానే గుర్తించాడట!—ఇలాంటివి వినటం లలితకు చాలాఇష్టం. ఇవ్వాళ, లలిత వృద్ధ సంతానం ఉదయాన్నే వచ్చి "మా తల్లి ఏదీ!" అని పిలిచాడు.

సంతానం పిలుపు విని లలిత కొంచెం వ్యాకులపాటు చెందినది. శేఖరుడు ఇంకా ఆఫీసుకు వెళ్ళలేదు. డబ్బు ఎలా తీసుకువస్తుంది? కొంచెం సేపాలోచించి అత్త దగ్గరకు పోయింది. అత్త అప్పుడే పనిచేసేదానితో పోట్లాడి ముఖం మాడ్చుకొని పొయ్యిదగ్గర కూర్చుని ఉన్నది. ఆమెను అడగటానికి ధైర్యం చాలక తిరిగి వాకిట్లో కొచ్చింది. బిచ్చగాడు కర్ర గోడకు ఆనించి గడప దగ్గర కూర్చున్నాడు. లలిత అతని కెప్పుడూ నిరాశ కలిగించలేదు. ఇవ్వాళ ఉత్త చేతులతో ఎలా పొమ్మంటుంది?

బిచ్చగాడు మరల పిలిచాడు.

"ఒదినే! మీ అబ్బాయి వచ్చాడు' అన్నది అన్నాకాళి పరుగెత్తుకుంటూ వచ్చి.

"కాళీ! ఒక పని చేసిపెట్టమ్మా, నీకు నమస్కారం చేస్తాను. శేఖరబాబు దగ్గరకు పోయి త్వరగా ఒక రూపాయి తెచ్చిపెట్టు.'

కాళి పరుగెత్తుకుంటూ పోయింది. కొంచెంసేపట్లోనే రొప్పుకుంటూ వచ్చి రూపాయి చేతిలో పెట్టి "ఇదిగో తీసుకో! అన్నది.

"శేఖరదా ఏమన్నాడే?'

"ఏమీ అనలేదు. చొక్కా జేబులో వుంది. తీసుకు పొమ్మన్నాడు, నేనే తీసుకు వచ్చాను.'

"ఇంకేమీ అనలేదా?"

"ఉహూ! ఇంకేమీ అనలేదు." అని, కాళి ఆడుకోడానికి తుర్రున పారిపోయింది.

లలిత బిచ్చగాణ్ణి పంపించింది. కాని ఇతర దినాలు మాదిరిగా అతని పొగడ్త వినలేక పోయింది. అసలు బాగా కూడా వుండలేదు.

కొన్నాళ్ళనుంచి మధ్యాహ్నం చీట్లపేక బాగా సాగుతూ ఉన్నది. ఇవ్వాళ మధ్యాహ్నం లలిత వెళ్ళలేదు. తలనొప్పిగా ఉన్నదని పండుకున్నది. ఇవ్వాళ నిజంగా ఆమె మనస్సేమీ బాగులేదు. సాయంకాలం కాళిని దగ్గరకు పిలిచి 'కాళీ నువ్వు శేఖరదా దగ్గరకు పోవటంలేదా పాఠం వప్పగించటానికి?' అని అడిగింది.

'ఆఁ పోతున్నానుగా' అన్నది కాళి.

'శేఖరదా నా సంగతి ఏమీ అడగటంలేదా?'

'ఉహుఁ! ఆఁ! ఆఁ! మొన్న అడిగాడు. నువ్వు మధ్యాహ్నం పూట చీట్లాడుతున్నావా లేదా? అని."

'నువ్వేమన్నావు?' అని లలిత అదుర్దాతో అడిగింది.

'నువ్వు మధ్యాహ్నంపూట చారుదీదీ యింటికి చీట్లాడటానికి పోతున్నావుగా! అదే చెప్పాను. 'ఎవరెవరు ఆడతారని' శేఖరదా అడిగాడు. నువ్వూ, చారు తల్లీ, చారూ, చారు మామా ఆడతారని చెప్పాను. సరేగాని వదినా! నువ్వు బాగా ఆడతావా, చారు మామయ్య బాగా ఆడతాడా? నువ్వే బాగా ఆడతావంటుందే—చారు తల్లీ?'

లలిత ఈ మాటకు జవాబివ్వకుండా విరక్తితో— 'నువ్వు యీ మాటలన్నీ ఎందుకు చెప్పబోయావు? అన్నిటికీ నేనేనని బయలుదేరుతావు—పో, ఇక నీకు ఏమీ ఇవ్వను!' అని కోపంతో వెళ్ళిపోయింది.

కాళి కొయ్యబారింది. లలిత ఆకస్మికంగా యిలా మారిపోవడానికి కారణం యేమిటో ఆ పిల్లకు అర్థం కాలేదు.

రెండు రోజులనుంచి మనోరమ ఇంటివద్ద చీట్లాట ఆగిపోయింది. లలిత రావటంలేదు. లలితను చూచినప్పటినుంచి గిరీంద్రుడు ఆమె యెడ ఆకర్షితుడయాడని మనోరమ మొదటనే సందేహించింది. ఆ సందేహం ఇవ్వాళ రూఢి అయింది.

ఈ రెండు రోజులనుంచి గిరీంద్రుడు ఏదో ఒక రకం ఉత్సుకతతోనూ అన్యమనస్కంగానూ ఉండ నారంభించాడు. సాయంత్రం షికారు పోవటంలేదు వేళా పాళా లేకుండా లోపలికివచ్చి గదులన్నీ వెతుకుతూ ఉండేవాడు. ఇవ్వాళ మధ్యాహ్నం మనోరమ దగ్గరకువచ్చి 'అక్కయ్యా ఇవ్వాళకూడా ఆట ఉండదా' అని అడిగాడు,

'ఎట్లా ఉంటుంది గిరీన్! చేతులేవీ?—లేకపోతే మనం ముగ్గురం ఆడుకుందామురా!'

గిరీన్ నిరుత్సాహంతో—'ముగ్గురం యెలా ఆడుతాం అక్కయ్యా! లలితను ఒకమాటు పిలిపించ కూడదూ?' అని అడిగాడు.

'ఆమె రాదు.'

'ఎందుకురాదు? వాళ్ళ వాళ్ళు వద్దన్నారా?'

'లేదు. వాళ్ళత్తమామలు అలాంటి మనుష్యులు కారు— ఆ పిల్లే రావటంలేదు.'

గిరీన్ సంతోషంతో—'వాళ్లు వద్దనలేదుగా! అయితే నువ్వొకమాటు పోయిరా! వచ్చేస్తుంది!' అని తానన్నమాటకు మనసులో చాలా సిగ్గు పడ్డాడు.

'సరే! వెళ్ళి వస్తాను!' అని మనోరమ వెళ్లింది. కొంచెం సేపట్లోనే లలితను లాక్కువచ్చి చీట్లపేక దగ్గర కూర్చోబెట్టింది.

రెండు రోజులనుంచీ ఆట లేదు. ఇవ్వాళ కాసేపట్లోనే ఆట రక్తి కట్టింది. లలిత పక్షం గెలుస్తూ వున్నది. ఒక గంటా రెండు గంటలు గడిచినాక కాళి పరుగెత్తుకుంటూ వచ్చి 'ఒదినా! శేఖరదా పిలుస్తున్నాడు. ఊఁ జల్దీ!' అన్నది.

లలిత ముఖం వెలవెలపోయింది; తెరచిన పేకముక్కలు చేతిలో బిగించి 'శేఖరదా ఆఫీసుకు వెళ్ళలేదా?' అని అడిగింది.

'నాకేం తెల్సు, ఎందుకో వచ్చేశాడు!' అని తల తిప్పుతూ కాళి వెళ్లిపోయింది.

ఆంధ్రరాష్ట్రంలో వేసంగి విద్యాలయాలు

ఆంధ్ర రైతాంగ విద్యాలయం

నిడుబ్రోలులో - ఏప్రెల్ 26 తారీఖున ప్రారంభము.

ఆచార్య రంగాగారి విజ్ఞప్తి

ఆంధ్ర రైతాంగ విద్యాలయపు ఆరవ సాంవత్సరిక సమావేశము యీ నెల 26 వ తేదీన, నిడుబ్రోలులో, రామా-నీడు విద్యాలయ భవనమందు ప్రారంభమగును. యీ సంవత్సరం 3 వారాల వరకు (మే 17 వరకు) యీ సమావేశము జరుగును. కనుక జిల్లా, తాలూకా రైతు సంఘాలచే సిఫారసుచేయబడిన రైతు సేవకులు, సోషలిస్టు పార్టీ విద్యార్థి సంఘాలచే పంపబడు కొంత మంది రైతుసేవ జేయదలంచువారినే చేర్చుకొందుము.

యింతవరకు వలెగాక, యీ సంవత్సరం, వున్నత రైతాంగ విద్య, సంఘ నిర్మాణ తరిబీయతు, ప్రచారక పంథాల పై తరగతులు నడుపబడును. సాధ్యమైనంత వరకు, వాలంటీరు శిక్షణగూడ యేర్పరచ ప్రయత్నింతుము. కనుక ప్రతి జిల్లా, తాలూకా రైతు సంఘాలు ఒక్కొక్కటికి కనీసము ఐదుగురునైన, యిదివరకే రైతాంగ సేవయందు పాల్గొనుచున్న యువకుల, నంపించ ప్రార్థితులు.

ఒక్కొక్క విద్యార్థి తన పోషణకై రు. 6-0-0 చెల్లించుకోవలెను. పక్కలు, చెంబులు వగైరాలను ప్రతివారు తెచ్చుకొనవలెను.

వివిధ ఆంధ్ర రాజకీయ, రైతాంగ నాయకులను, వుపన్యాసముల నిచ్చుటకై ఆహ్వానించుచున్నాము.

అన్ని తత్వాల జాతీయవాదులు త్రిపురీ కాంగ్రెసు యొక్క "నేషనల్ డిమాండు" తీర్మానాన్ని అమలు జరుపగోరుచున్న యీ సమయాన, అంతర్జాతీయ పరిస్థితులు, దేశీయుల స్వాతంత్ర్య సమరోత్సాహము, స్వరాజ్య సంపాదనకై సుముఖమైయున్న యీ యదనున, రైతాంగ యువకులు యీ విద్యాలయమందు తగిన విద్యా, తరిబీయతు బొంద విరివిగా వత్తురని విశ్వసించుచున్నాను.

ప్రొ॥ యన్. జి. రంగా

మైపాడు ఆర్థిక-రాజకీయ పాఠశాల.

మే 15 నుండి జూన్ 15 వరకు జరుపబడును.

ఆర్గనైజరు:- కామ్రేడ్ దువ్వూరు బలరామరెడ్డి.

ప్రిన్సిపాల్:- కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య.

వాలంటీరు ట్రైనర్:- డాక్టరు పాలవశ్శి రమణయ్య.

ఉద్దేశాలు:- భారతదేశము తనకు సంపూర్ణస్వాతంత్ర్యాన్ని ఏవిధంగా సంపాదించు కోవలసింది, దానికి ఏ విధంగా సన్నాహాలు చేయవలసినదనియు, క్రమశిక్షణ పొందిన వాలంటీయరు దళమునేర్పాటు చేయుటయు, యీ పాఠశాల ముఖ్యోద్దేశ్యములు.

1. ఇందు భారతజాతీ యోద్యమచరిత్ర, భారత కాంగ్రెసు సోషలిస్టుపార్టీ చరిత్ర, సోషలిజం అంటే ఏమిటి-దాని మూల సిద్ధాంతములు, భారతీయ కార్మిక-కర్షకోద్యమముల చరిత్ర, భారతదేశములో కార్మిక-కర్షక పట్టాలు, వీటినిగురించి వివరముగా తెలియజేయబడును.

2. రాబోవు స్వాతంత్ర్య పోరాటములో కాంగ్రెసు కార్యప్రణాళికను ప్రతిగ్రామములోను ఆ గ్రామ పరిస్థితుల ననుసరించి, వివిధ సంఘటనల ననుసరించి ఏవిధముగా ఆచరణలోపెట్టవలసినది తెలియజేయబడును.

3. వాలంటీరు దళానికి కావలసిన కనీసు డ్రిల్లు, హిందూస్థానీ సేవాదళములో తరిఫీదు పొందినవారిచే నేర్పించబడును.

4. ప్రతిరోజూసాయంకాలము బలిగుడు, ఉప్పాటు లాంగ్-జంపు, హై-జంపు, రన్నింగ్-రేస్, మొదలగు ఆటలయందు ప్రతివ్యక్తీ పాల్గొనవలెను.

5. యితర రాష్ట్రాల నుండికూడా నాయకులను ఆహ్వానించి యున్నాము. ఎవరు వచ్చునది ముందు తెలియజేయబడును.

నిబంధనలు:- (a) రాబోవు స్వాతంత్ర్యపోరాటములో పాల్గొనగోరు వ్యక్తులు, కడప, చిత్తూరు, నెల్లూరుజిల్లా వాసులనుమాత్రము యిందు చేర్చుకొనబడుదురు.

(b) వీరు తమ దరఖాస్తులను తమ స్థానిక సోషలిస్టుపార్టీగాని, జిల్లా విద్యార్థిసంఘముగాని, జిల్లా కాంగ్రెసు సంఘముయొక్కగాని ధృవపత్రాలతో సహా ఆర్గనైజరు, ఆర్థిక రాజకీయ పాఠశాల, మైపాడు, నెల్లూరు జిల్లాకు ఈ నెలాఖరులోపల పంపవలెను.

(c) విద్యార్థులకు భోజన, నివాస వసతులు పాఠశాలాధికారులే ఏర్పాటుచేయుదురు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం టీ, రెండుపూటలు భోజనము మాత్రము సప్లయి చేయబడును. మిగిలిన ఖర్చులన్నియును విద్యార్థులే భరించుకోవాలి.

(d) వార్తాపత్రికలు, కావలసిన పుస్తకాలు పాఠశాల తెప్పించును.

(e) విద్యార్థులు ఒక్కొక్కరు రు 10 లు చెల్లించుకొనవలెను. అందు రు 5 లు దరఖాస్తు ఫారముతోను మిగతా రు 5 లు పాఠశాలలో చేరినపుడును చెల్లించవలెను.

(f) విద్యార్థులందరూ 14వ తేదీ రాత్రికే మైపాడు చేరవలయును. ఆ పిమ్మట వచ్చినవారిని చేర్చుకొనరు.

(g) మైపాడు, నెల్లూరునకు 13 మైళ్ళ దూరంన సముద్రమునకు అరమైలు దూరములో యున్నది. నెల్లూరునుండి మైపాడునకు బస్సు చార్జి 0-4-0 లు మాత్రమే.

(h) విద్యార్థులందరు క్రిమ శిక్షణకు విద్యాలయం యొక్క నిబంధనలకు లోబడి నడుచుకొనవలయును. అటు నడచుకోని వారిని ఆర్గనైజరు విద్యాలయంనుండి పంపించివేయును.

(i) పాఠములన్నీ తెలుగులోనే బోధించబడును.

నెల్లూరి జిల్లా కాంగ్రెసు సోషలిపార్టి.

నెల్లూరి జిల్లా విద్యార్థి సంఘం.

★

జిల్లా కాంగ్రెస్ విజ్ఞప్తి.

కడప చిత్తూరు, నెల్లూరు జిల్లాలలోని కాంగ్రెసు వర్కర్లకు తగిన శిక్షణ ఇచ్చుటకు, మైపాడులో ఆర్థిక రాజకీయ పాఠశాలను ఏర్పాటు చేయుచున్నారు. జిల్లా కాంగ్రెసు సంయుక్త కార్యదర్శి దువ్వూరి బలరామిరెడ్డి ఆర్గనైజరుగను, భారత కాంగ్రెసు సభ్యుడు పుచ్చలపల్లి శ్రీ సుందరయ్య ప్రిన్సిపాల్‌గను ఉందురు. జిల్లాలో, కాంగ్రెసు వర్కర్లందరూ, ఆర్థికంగా, ధనరూపంగా, ధాన్యరూపంగా విద్యాలయము జయప్రదముగా సాగడానికి పూర్తిగా సహాయం చేయవలసినదిగ విజ్ఞప్తి చేయుచున్నాము.

బద్దెపూడి వెంకటనారాయణరెడ్డి,
జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు.
కనుపర్తి నారాయణరావు,
ప్రధాన కార్యదర్శి.

పామర్రు ఫిర్కా వాలంటీరు శిబిరము

9-4-39 తారీఖున పామర్రు ఫిర్కా పార్టీ సభ్యుల సమావేశములో ఈ క్రింది తీర్మానం యేకగ్రీవముగా ఆమోదింపబడినది.

"నేషనల్ డిమాండు తీర్మానమును ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీవారు సూచించిన నీతిని అమలు జరపడానికి నిశ్చయించడమైనది. ఏప్రియల్ 20 వ తారీకు వరకు వలంటీర్లను చేర్పించుటకు ప్రతి సభ్యుడు ప్రయత్నించవలయును. మే 1 వ తారీఖు నుంచి పామర్రులో రాజకీయ పాఠశాల నొక దానిని స్థాపించాలి. ఆ పాఠశాలలో ఏప్రిల్‌లో చేర్పించిన వలంటీర్లను రాజకీయాలను గురించి నేర్చుకొనుటకు అభిలాష కనుబరుచు వారిని చేర్చుకోవాలి. ఆ పాఠశాలలో వలంటీర్లకు తరిఫీదు నిచ్చుట, రాజకీయాలను గురించి యెక్కువగా బోధించాలి."

2. పై స్కూలు జయప్రదముగా సాగించుటకు అవుసరమైన ధనమును స్వీకరించుటకు ఈ క్రింది వారిని యేర్పాటు గావించడమైనది. 1. చలసాని వెంకట బాపయ్య 2. గుళ్లపల్లి రామబ్రహ్మం 3. పొట్లూరి శీతారామయ్య 4. ఎ. వెంకటరెడ్డి 5. కె. హనుమంతరావు 6. యూడ్పుగంటి కూర్మారావుగార్లను.

3. ఈ స్కూలుకు ఆర్గనైజర్లు.

(1) యార్లగడ్డ బసవయ్యగారు,
(2) ముక్తేవి కేశవాచార్యులుగారు,
(3) కంచర్ల వెంకట్రామయ్యగారు.

4. ఈ స్కూలులో చేరువారు ఇంక యితర వివరములకుగాను ఈక్రింది చిరునామాకు వ్రాయవలయును.

అడ్రసు: యార్లగడ్డ బసవయ్య,
పెదమద్దాలి,
(వైయా) పామర్రు,
కృష్ణాజిల్లా.

రైతాంగ విద్యాలయం తునికిపాడు

6-4-39 తిరువూరుతాలూకాకు చెందిన యీగ్రామము నైజాం సరిహద్దులోనున్నది. మే మూడవ వారములో విద్యాలయము ప్రారంభింపబడును. ఇరువది రోజులు మాత్రమే జరుగును.

శ్రీయుత ఆచార్య రంగాగారు ప్రధానోపాధ్యాయులుగా నుందురు. నిపుణులైన పలువురు దేశీయనాయకులు విచ్చేయుదురు. రాగోరు విద్యార్థులు భోజన సౌకర్యములకుగాను రు. 5. లు రుసుము చెల్లించవలెను. అర్జీలను 1 వ తేదీలోగా చేరునటుల పూర్తి వివరములతో పంపవలెను. రుసుము అర్జీతోనే పంపవలెను.

సుంకర వీరభద్రరావు,
ఆర్గనైజరు,
తునికిపాడు.

★ ☆

[ఇచ్ఛాపురం స్కూలును గురించిన వివరాలు గత వారం ప్రకటించాం.—సం.]

తెనాలి లక్ష్మీప్రెస్ యజమానుల వింతరూల్సు

సోదర కార్మికులు, తదితర ప్రజాసామాన్యం ప్రెస్ వర్కర్సు యూనియన్ సభ్యులయిన లక్ష్మీప్రెస్ పనివారలమీద యజమానులచే పెట్టబడిన షర్తులు, వాటివల్ల పనివారికి సంభవించు నష్టములు విపులంగా తెలుసుకొనుట చాలఅవుసరం, వాటిని క్రింద వివరించుచున్నాము.

ఈప్రెస్సు ఫ్యాక్టరీ చట్టము క్రింద రిజిస్టరు కాబడినది, యజమానులచే పెట్టబడిన షర్తులలో కొన్ని ఫ్యాక్టరీ చట్టానికి విరుద్ధంగా కూడ వున్నాయి. ఏ యే షరతులు ఏ యే విధంగా ఉన్నాయో చూద్దాం.

1. (బి) "అధికపు పని చేసినవారికి 7 గంటలు ఒకరోజు చొ॥ లెక్కించబడును." ఇతర చోట్ల ప్రెస్‌లలో చాలమట్టుకు అధికపు పని 4 గంటలు గాని, 5 గంటలు గాని 1 రోజు చొ॥ లెక్కించబడుతున్నది. ఆఖరికి ఫ్యాక్టరీ చట్టంప్రకారమైనా 6 గంటలు 1 రోజు క్రింద లెక్కించబడుతున్నది. ఈ 7 గంటలు షరతు అన్నిటిని మించియున్నది. పగలు పనిగంటలు 8 గంటలు కాబట్టి, అధికపు పనికి దానిలో సగము గంటలు రోజు క్రింద లెక్కించబడుట న్యాయమైనది.

(సి) ఉదయము 9 గం॥ నుంచి, 5 ని॥లున్ను సాయంత్రము 3 గం॥నుంచి 5 ని॥లున్ను విశ్రాంతి ఇవ్వబడును.

ఈషరతులు తీసుకురాక ముందు యజమానులు మామూలుగా ప్రొద్దున 15 ని॥లు సాయంత్రం 15 ని॥లు విశ్రాంతి ఇస్తూవున్నారు యజమానులు. ఇపుడు దానిని ఎందుకు తగ్గిస్తున్నారో తెలియుటలేదు. మామూలుగానే సాగనివ్వమని మా కోరిక.

3. ఆలస్యముగా వచ్చినవారు వ్రాతపూర్వకముగా కారణము వ్రాసి యివ్వవలెను.

పనివారిని యజమానులు ఇంత నిక్కచ్చిగా అడుగుతూ వున్నప్పుడు పనివారిని యజమానులు ఉదయం టైము కాకముందు సాయంత్రం టైము అయినతర్వాత కొంచెంసేపైనా పని చేయించుకోరని గ్యారంటీ యివ్వటము బాగుంటుంది. ప్రెస్సులలో మామూలుగా జరిగే విషయము ఏమిటంటే, టైము అయిన తర్వాత కూడ కాస్త పనివున్నది, చేసి పొమ్మనమని ½ గంట 1 గంట వరకు ఒట్టొడియంగా చేయించుకుంటూ వుంటారు. మేమారీతిగా టైము అయినా కూడా పని చేయించుకుంటాం, మీరు మట్టుకు ఏమాత్రం ఆలస్యంగావచ్చినా కారణాలు వ్రాసి ఇవ్వవలయుననటములో ఏమీ సబబు లేదు. పనివారు ఆలస్యముగా వస్తున్నారంటే దానికి కారణము పనివారలచేత టైము అయినా కూడా పైపెచ్చులు కాస్త కూస్త పూరికే చేయించుకుంటూ ఉండడమే.

4. "పనివారు ముందు వ్రాత పూర్వకముగా ఫోర్‌మన్ సంతకముతో సెలవు చీటి వ్రాసి మావద్ద సెలవు పొందవలెను, పై విధముగా సెలవు పొందనివారలకు హాజరు కాని రోజులకు రెట్టింపు చేయబడెను."

ఈ విధంగా సెలవు యజమానివద్దనుంచే పుచ్చుకోవచ్చును, ఫోర్‌మన్ సంతకము తీసుకు రమ్మనటంలో అతనిచేత సిఫార్సు చేయించుకొని రమ్మని అర్థం, ఫోర్‌మన్ రికమండేషన్ పద్ధతి పెడుతున్నారంటే పనివారిలో వారికి ద్వేషాలు చీలికలు కలుగచేయటానికే. ఫోర్‌మన్ కొందరికి సిఫార్సు చేయవచ్చు, కొందరికి చేయకపోవచ్చు. దానివల్ల వారిలో వారికి కలతలు సంభవిస్తాయి. అవకాశమున్నచో ముందుగానే శెలవు తీసుకొందురు, అత్యవసరంగా పోవలసి వచ్చినప్పుడు, తరువాత శెలవు తీర్చెదరు. రోజు నాగాకు రోజే కట్టుకొనవలెను. ప్రెస్సుల్లో పనివారలకు పూర్తి జీతంమీదకాని అర్ధ జీతంమీదకాని శలవులు లేవు. అటువంటి పరిస్థితుల్లో, రోజు నాగాకు 2 రోజులు కట్టుకోటం చాల అన్యాయం. పైగా ఈ డబుల్ నాగా ఫ్యాక్టరీ ఆక్టుకు విరుద్ధం.

5. "ప్రతివారును ఫోర్‌మన్‌కు విధేయులై యుండవలెను. అటుల విధేయతగా ప్రవర్తించని యెడల అతని సిఫార్సుమీద జరిమానా వేయబడును. 3 పర్యాయములు జరిమానాపడినవారికి నోటీసుతో నిమిత్తము లేకుండా పనినుండి తొలగించబడును."

పనివారిలో పనివారికి చీలికలుకల్గించి వారి ఐకమత్యమును నాశనముచేయుటకు ఇది మరియొక సాధనము. ఫోర్‌మెన్ చీటికి మాటికి తనకిష్టములేని పనివారలమీద కంప్లెయింటులు యజమానులతో చెప్పుతూ వుండటానికి పూర్తి అవకాశము కల్గిస్తున్నది, తమకల్లా కావలసింది పని. ఆ పనిని పనివారలు విధేయతగా చేస్తూవుంటారు. 3 పర్యాయములు జరిమానా పడినవారిని నోటీసుతో నిమిత్తము లేకుండా పనినుండి తీసివేస్తామనడం అతిక్రూరం. దీనివల్ల పనివారికి చాలానష్టం.

6. "ఆఫీసులో అనవసర ప్రసంగముచేసినను, పరికరములు పాడుచేసినను జరిమానా వేయబడును." 5, 6 షరతుల మూలముగా అనేక సాకులు చూపి జరిమానాలు వేస్తూ పనివారలకిచ్చే స్వల్ప జీతాలను యజమానులే దిగమ్రింగుటకు వీలయిన అవకాశాలు కలుగుచున్నవి. పనిచేస్తుండగా పాతవి యగుటవలన, వాడకం ఎక్కువగుటవలన పనిముట్లు చెడిపోయినయెడల దానికి పనివారిని బాధ్యులను చేయటము న్యాయముగా లేదు. పనికి సంబంధించిన సంప్రతింపులు చేసుకుంటారు. వాటినికూడా అనవసరప్రసంగములనటంలో అర్థంలేదు.

9. "వారములో 3 రోజులు నాగా పడ్డవారికి, ఆవారములో చివరవచ్చు ఆదివారముకూడ తగ్గించబడును."

ఏరోజు నాగాకు ఆరోజే నాగాకట్టుకొను మామూలు పని పద్ధతికి యిది పూర్తిగా విరుద్ధము. యజమానులతో ముందుగాని, తరువాత గాని చెప్పి సెలవు తీసుకొనేటప్పుడు నాగా సమస్య రానేరాదు. సెలవు తీసుకొనేటప్పుడు 3 రోజులు గాని, అంతకంటె ఎక్కువకాని తీసుకోవచ్చు. ఎన్నెన్ని రోజులు తీసుకొనేది పనివారియొక్క అవసరముమీద ఆధారపడి ఉంటుంది. సిక్కు, క్యాజుయల్ మొదలగు సెలవలేమీ లేకుండా, యీవిధముగా ఆదివారాలు మినహాయించుకోవటము చాలా దారుణం.

ఈషర్తులు పనివారికి అపరిమితముగా హానికరమైనవి. ఇవి పనివారిచేత అంతు పొంతులేని వెట్టిచాకిరిని ఒక చెంప చేయించుకుంటూ రెండో చెంప వారి పొట్టలను కొట్టటానికి సాధనాలుగా ఉపయోగపడతయి. ఒకచేత్తో యిస్తున్న జీతాలను రెండోచేత్తో లాక్కుంటున్నారు. వారి స్వలాభాలే వారికి కావి పనివారి దురవస్థలు వారి కళ్ళకు కనబడవు. ఇతర ప్రెస్సులతో పోటీ మూలముగా తమ వ్యాపారానికి తగిలే ఉసురంతా ఏదో విధముగా పనివాళ్ళకు తగిలేటట్టు చెయ్యాలని ఆలోచిస్తుంటారు. ఆఆలోచనలతోనే యీ షరతులను తీసుకొచ్చి పెట్టారు. పనివారలు వీటిని అంగీకరించలేదు. ఈ అన్యాయాన్ని తీవ్రముగా ప్రతిఘటిస్తున్నారు. పనివారు కోరేది పైన పేర్కొనబడిన రీతిగా షరతుల సవరణలున్నూ, 40 మంది పనివారిని పనిలోకి తీసుకొనవలెనని, లాకౌట్ జరుగుతున్న దినాల కన్నిటికిని జీతములను యివ్వవలెనని, విక్టిమైజేషన్ (అక్రమంగా తీసివేయడం, జరిమానాలు వేయడము మొదలగు బెదుర్లు) ఉండకూడదని, పనివారితోపాటుగా యజమానులు కూడా సంతకాలు పెట్టవలెనని. వీరి పోరాటానికి ప్రజాసంఘాలన్నీ అన్నివిధాల సాయపడవలెనని కోరుచున్నాము. ముఖ్యంగా ఆర్థిక సహాయము గావించవలసినదిగా ప్రార్థించుచున్నాము.

సానుభూతి సమ్మె

28 రోజులనుంచి లాకౌటువల్ల కష్టాలు పడుచున్న లక్ష్మీప్రెస్ పనివారికి సానుభూతి వెల్లడించుటకు నిన్న ఒక రోజు తెనాలిలో ఉన్న ఇతర ప్రెస్సులలోని పనివారందరు సమ్మె చేసిరి. భారతీ ప్రెస్ పనివారు మాత్రం మధ్యాహ్నంనుంచి సానుభూతి సమ్మెలో చేరిరి.

జిల్లాకాంగ్రెస్‌సంఘంవద్దకు డెప్యుటేషన్

లక్ష్మీప్రెస్ లాకౌట్ యొక్క వివరాలను నివేదించుకొనుటకు ప్రెస్‌వర్కర్సు యూనియన్ తరపున 6 గురు ప్రతినిధులు వెంకటేశ్వర టాకీస్ హాలులో సమావేశమైన గుంటూరు జిల్లా కాంగ్రెస్ సంఘమువారి వద్దకు మధ్యాహ్నము 1 గంటకు వెళ్ళిరి. ఆ కమిటీ సభ్యులలో నొకరగు కొడాలి ఆంజనేయులుగారి సభాప్రారంభమున లక్ష్మీప్రెస్ యజమానులు తయారుచేసిన కొత్త నిబంధనలవల్ల పనివారికి కలిగే నష్టములను, కార్మిక పోరాటములను కాంగ్రెసు బలపరచవలసిన అవుసరములను వివరిస్తూ పనివారికి అన్నివిధాలా సహాయమును చేయవలసినదిగా సభికులను కోరిరి. దీనిని గురించి విచారించుటకు జిల్లా కాంగ్రెసు సంఘాధ్యక్షులు రేపు ప్రెస్సు యజమానులవద్దకు వెళ్తారని తెలుస్తోంది.

బహిరంగ సభ

సాయంత్రము 5 గంటలకు అన్ని ప్రెస్సులలోవి పనివారూ కలసి పెద్దఊరేగింపుతో ముఖ్యవీధులగుండా తిరిగి 6 గంటలకు మ్యునిసిపల్ లైబ్రరీ వద్దకు చేరిరి. అచ్చట పి. వి. సివయ్యగారి అధ్యక్షతను బహిరంగ జరిగెను. సభలో ము. మాధవాచార్య, కా. సుబ్బారావు, కా. వెంకయ్య, పి. నరసింహమూర్తి, పి. లోకనాథం గార్లు మాట్లాడినపిదప లక్ష్మీప్రెస్ పనివారిని, కాకినాడ పీముపనివారినీ బలపరుస్తు కాకినాడ అరెస్టులు, లాఠీ చార్జీలు జరిపిన పోలీసు అధికారుల చర్యలను ఖండిస్తు, లక్ష్మీప్రెస్ పనివారికి ఆర్థిక సహాయం చేయవలసినదిగా ప్రజలను, ప్రజాసంఘాలనూ కోరుచూ తీర్మానములు చేయబడెను.

ప్రెస్సులో పనిచేస్తున్న పనివారు

ప్రస్తుతము లక్ష్మీప్రెస్సులో పనిచేస్తున్న పనివారు యిద్దరు. 6-4-39 ఆంధ్రప్రభలో 8 మంది క్రొత్త పనివారు పనిచేస్తున్నట్లు ప్రకటించబడింది. అది అబద్ధము. అప్పటికి ప్రెస్సులో పనిచేస్తున్న కార్మికుల్లు ముగ్గురుమాత్రమే. ఆ ముగ్గురిలోనుంచి ఒకరు మానుకున్నారు.

ప్రథమ పశ్చిమ గోదావరి జిల్లా విద్యార్థి మహాసభ.

ఏప్రియల్ 1,2, వ తేదీలలో పాలకొల్లులో ప్రథమ పశ్చిమగోదావరిజిల్లా విద్యార్థి మహాసభ అతివైభవంగా జరిగింది. జిల్లాలోని వివిధ హైస్కూళ్లనుండి సుమారు 60 మంది ప్రతినిధులు వచ్చిరి. 1 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బ్యాండువాయిద్యములతోను "డిటెన్షన్ పద్ధతిపోవాలి. హెచ్చుజీతాలు తగ్గాలి, విద్యార్థి సంఘాలను గుర్తించాలి, మొదలైన నినాదములతోను గొప్ప ఊరేగింపు జరిగింది. ఊరేగింపు అనంతరము జండా చౌకులో కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణగారు జాతీయ పతాకోత్సవము, విద్యార్థిపతాకోత్సవము జరుపుతూ యీ క్రింది విధముగా ఉపన్యసించిరి.

పతా కోత్సవం

"జాతీయజండా ఇంతవరకు జరిగిన ప్రత్యక్షపోరాటంలో నాయకత్వం వహించినది. కాంగ్రెసుమహాసభ యీ జండాను తమజండాగా ఎంచి ఇప్పటికి మూడుప్రత్యక్ష పోరాటములు బ్రిటిషు ప్రభుత్వముతో జరిపియుండిరి. దేశములో అనేకమందివిద్యార్థులు యీజండాయొక్క నాయకత్వాన కాలేజీలు, స్కూళ్లు విడిచి పోరాటములో దుమికి అనేక కష్టములకు లోనయిరి. ఈజండా చౌకులో అనేకమంది లాఠీఛార్జీలకు గురి అయిరి. యూనియన్‌జాక్ మనదేశము నుండి పోనంతవరకు మనకు స్వాతంత్ర్యంలేదు. దేశములోని విద్యార్థులంతా వచ్చే పోరాటానికి సిద్ధముకావాలి నేను విద్యార్థులు తమజండాను ఎగురవేయుచున్నారు. ఈజండా కోరేటువంటి (Freedom! Peace! Progress!) స్వాతంత్ర్యం, శాంతి, అభివృద్ధినే యీ జాతీయజండా కోరుచున్నది. కాబట్టి యీజండానుకూడా మీరు ఎగురవేయుచున్నందులకు సంతోషము."

ఆహ్వాన సంఘాధ్యక్షోపన్యాసం

ఆహ్వాన సంఘాధ్యక్షుడు ఏ. మాణిక్యమ్యగారీక్రిందివిధముగ ఉపన్యసించిరి.

"ఇతర జిల్లాలలో విద్యార్థులు తమ తమ విద్యార్థిసంఘాలు స్థాపించుకొని అత్యుత్సాహముతోనూ, కార్యదీక్షతోను, పట్టుదలతోను ఈ జానిన విద్యావిధానములో మార్పు తీసుకొని వచ్చుటకు విద్యార్థుల విజ్ఞాన వికాసమునకు సంపాదించే టందుకు అనేకవిధముల పాటుపడుతూన్నారు.

నేటి స్కూళ్ళలోని విద్యార్థులకు కష్టాలు అనేకములున్నాయి. గేమ్సు ఫీ అంటూ తీసుకుంటారు. గేమ్సు ఆర్టికల్సు అంటూ సరిగా సప్లయి చేయరు. లైబ్రరీ ఫీ తీసుకుంటారు, విజ్ఞానాభివృద్ధి పొందే పుస్తకములు, పత్రికలు తెప్పించరు. ఒకవేళ ఉన్నా, మనలను చదువుకోనీయరు. చాలా హైస్కూళ్ళలో సైకిళ్లు పెట్టుకొనేందుకు షెడ్లు వుండవు. కనుక అవి వానకు తడిసి, ఎండకు ఎండి యుండుటవలన సైకిళ్ళు చెడిపోవుచున్నవి. పొరుగూళ్ళనుంచి వచ్చే విద్యార్థులు మధ్యాహ్న భోజనములు తెచ్చుకుంటే వారు భోజనము చేయుటకు చాలా పోట్లు టిఫిన్ షెడ్లులేవు. ఏ ఎండలోనో ఏ కాలువగట్టునో హడావుడి భోజనము చేయవలసి వస్తున్నది.

ఇక పరీక్షలకు చాల కష్టపడి చదివినా నూటికి 40 మందికన్నా ఎక్కువ ప్యాసుచేయరు. వీరికి బి ఏ., యం. ఏ., లు ప్యాసు అయినా పనిదొరకదు.

అందుచే మనం చదువుకొనేవాళ్లం అంతా సంఘముగా తయారయి ఏ విధముగా అయితే మన విజ్ఞానము అభివృద్ధి చెందుతో, ఏ విధంగా అయితే మన కష్టాలు ఈడేరుతవో ఆ విధంగా విద్యా విధానమును మార్పు చేసేందుకు ప్రయత్నం చెయ్యాలి.

ప్రస్తుతం మన కాంగ్రెసువారు అధికారంలో వున్నారు. కాబట్టి ఈ తరుణాన్ని ఉపయోగించుకొని చక్కని విద్యావిధానము ఏర్పడేటట్లు ప్రయత్నించాలి. కాబట్టి మహాసభ సందర్భములో జిల్లా విద్యార్థి సంఘాన్ని ఏర్పాటుచేసి మన జిల్లా విద్యార్థులందర్నీ విద్యార్థి వుద్యమం వైపు మళ్ళించవలయును."

ప్రారంభోపన్యాసం

కామ్రేడ్ కాట్రగడ్డ రాజగోపాలరావు తన ప్రారంభోపన్యాసములో ప్రస్తుత విద్యావిధానము మనలనుదాసులనుగా తయారుచేయడానికేవిదేశ ప్రభుత్వ మేర్పరచినదనీ, దీనినిమార్చి వార్ధా విద్యావిధానమును అవలంబించాలనీ చెప్పారు. ప్రస్తుతపరీక్షలలో జరిగే అవకతవకలు, ఈఅవకతవకలను దాటి పరీక్షలలో సుత్తీర్ణులయినా నిరుద్యోగ బాధనుకూర్చి వర్ణించారు. పరీక్షలు పోయినా, విద్యార్థులు హాజరైనరోజులను బట్టి చదువుచున్న చదువును బట్టి, విద్యార్థులలో కలుగుచున్న అభివృద్ధినిబట్టి మనతో నిత్యమూ సంబంధము కల్గియుంటున్న ఉపాధ్యాయులే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తే చాలన్నారు. వానినే డిగ్రీలుగా పరిగణించాలన్నారు. ఈపరీక్షలు ఉన్నంతకాలమైనా విద్యార్థులందరినీ పరీక్షలకు పంపించాలనీ, డిటెన్షను పద్ధతిని మానివేయాలని కోరారు.

అధ్యక్షోపన్యాసం

మహాసభకు అధ్యక్షత వహించిన కామ్రేడ్ రామకోటేశ్వరరావుగారు ఇలా ఉపన్యసించారు.

"మనం మన విద్యావిధానములో ఉండే లోటుపాట్లను సరిచేయించడానికి మనం రోజురోజుకు ఎదుర్కొంటున్న కష్టాలను నివారించుకొనేందుకు విద్యార్థిసంఘాలను స్థాపించుకొనుచున్నాము. మనం యీసంఘాలద్వారా పైహక్కుల్ని, సౌకర్యాలను పొందాలంటే మంచి శిక్షణతోను జాగ్రత్తతోను కార్యక్రమాన్ని నడిపించాలి, మనమవలంబించే కార్యవిధానము పైననే మన ఉద్యమం యొక్క జయాపజయాలు, ప్రతిష్ఠాప్రతిష్ఠలు ఆధారపడి ఉంటాయి. మనమూ ఉపాధ్యాయులు సన్నిహిత సంబంధము, పరస్పర స్నేహభావములు కల్గియుండాలి. మనము ఉపాధ్యాయుల్ని గౌరవభావంతో చూస్తుండాలి. ఉపాధ్యాయులుకూడా విద్యార్థులంటే మంచినమ్రతతోను లాలనతోను వాత్సల్యంతోను విద్యగరపుతూ యుండాలి, మనం గురువులము, వాళ్ల శిష్యులు అనే తలంపు పెట్టుకొని ఇష్టంవచ్చినట్టు బాదుతూ విద్యార్థుల శారీరక, మానసిక శక్తుల్ని అరికట్టడానికి తోడ్పడకూడదు. కొంతమంది ఉపాధ్యాయులు, మన ఉద్యమాన్ని వారికి వ్యతిరేకంగా భావిస్తూయుండటం ఆచారమయింది. ఉపాధ్యాయులంటే మన కెన్నాడూ ద్వేషంలేదు. మనం పోరాడేది విధానంతో, సిస్టంలో మార్పులు తీసుకొని వచ్చి మన విజ్ఞానాన్ని వృద్ధిపొందించు కొనుటకే. కాబట్టి ఉపాధ్యాయులుకూడా మన ఉద్యమానికి తోడ్పడేటట్లు మనం ప్రయత్నించాలి.

ఇంకా చాలామంది మన కార్యక్రమం అంతా సమ్మెలే అని పొరపాటు అభిప్రాయపడి మన ఉద్యమాన్ని నిందిస్తూ యుంటారు. వారు సరిగా విచారించి తెలుసుకొంటే మన కార్యక్రమం అసలు సమ్మెలు కానేకాదని, మన సంఘాలు విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి తోడ్పడేందుకు కావాల్సినంత కార్యక్రమం కల్గి ఉన్నాయని తెలుస్తుంది. కాని వారు విచారించరు. మనల్ని తిడుతూంటారు. కాబట్టి మనం ప్రజల్లోయున్న దురభిప్రాయాల్ని పోగొట్టేందుకు బహిరంగసభలు, కరపత్రాలు మొదలైన వాటిద్వారా ప్రచారం కావించాలి. సమ్మెలు గతిలేక చేస్తూయున్నమేగాని మా హుషారు వల్లకాదని తెలియజెయ్యాలి. విద్యార్థుల నందరిని విద్యార్థిసంఘాలలోనికి ఆకర్షించి విద్యార్థి ఉద్యమానికి మంచిబలం కల్గిస్తూ యుండాలంటే యీక్రింది కార్యక్రమాన్ని స్థానిక విద్యార్థి సంఘాలు కొనసాగిస్తూ యుండాలి.

వక్తృత్వ, వ్యాసరచనా పోటీ పరీక్షలు ఏర్పరచుట, స్పోర్ట్సు ఏర్పరచుట, సంగీతం, రాత్రి పాఠశాలలు, స్టడీ సర్క్యూలర్లు ఏర్పరచి ఇంకా ఇలాంటి కార్యక్రమం ఆచరణలో పెట్టాలి. మనం మనదేశానికి స్వాతంత్ర్యం సంపాదించుకొంటే మన విజ్ఞాం కాని, దేశంలో ఆర్థిక సౌష్ఠవంగాని అభివృద్ధిపొందడానికి అవకాశము లున్నవి. స్వాతంత్ర్యం రావాలంటే మనం లిటరసీకాంపైనుల ద్వారా ప్రజల్లో విజ్ఞానాన్ని వ్యాపింపచెయ్యాలి. మీరు సెలవురోజుల్లోనూ పర్వంగురోజుల్లోనూ రాత్రి పాఠశాలలు మొదలైన వాటిద్వారా వయోజనవిద్య వ్యాపింపచేయాలి. దానికొరకు మీరందరు ప్రయత్నించండి. ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘంవారు వచ్చే సంవత్సరం డిటెన్షన్ పద్ధతిపోవాలి, రోజుకొక పరీక్షాపత్రమే యుండాలి. విద్యార్థి సంఘాలను గుర్తించాలి, అనే ప్రధానకోర్కెలపై జనరల్ స్ట్రయిక్ సాగించడానికి ఏర్పాట్లు చేయదోతున్నారు. పై అత్యవసర కోర్కెలు నెరవేర్పవలసిందని ప్రభుత్వానికి అనేకసార్లు విజ్ఞప్తులు పంపుకున్నాం. కాని నిర్లక్ష్యం చేశారు. పైగా విద్యాశాఖా మంత్రి వార్కీగారు వాగ్దానం చేసికూడా నెరవేర్చలేకపోయారు. ఇప్పుడైనా ప్రభుత్వము మన కోర్కెలను నెరవేరిస్తే ఏ గల్లంతు లేకుండా పోతుంది. లేకపోతే మాకీ స్కూళ్ళు అక్కరలేదని మానుదాము. మీరు మీ జిల్లా సమ్మె జయప్రదమయ్యేలాగు ప్రయత్నం చెయ్యండి. మీరు మీ జిల్లా విద్యార్థి సంఘాన్ని ఏర్పాటు చేసుకొని చక్కని కార్యక్రమాన్ని సాగిస్తూంటారని ఆశిస్తాను.

బెజవాడ విద్యార్థుల చర్య గర్హనీయము

ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘ ప్రధాన కార్యదర్శి జి. రామకోటేశ్వరరావుగారు యీ క్రింది ప్రకటన కావించుచున్నారు.

యస్ యస్. యల్. సి. పరీక్షల సందర్భములో బెజవాడ విద్యార్థుల చర్యలను గూర్చి అనేక పత్రికల్లోనూ వార్తలు ప్రచురించబడ్డాయి. పత్రికావిలేఖరుల వార్తలనుబట్టి చూస్తేమాత్రం బెజవాడ విద్యార్థుల చర్యలు చాల అమానుషంగాను, అసహ్యంగానుకూడా ఉన్నాయి. ఈ చర్యలతో ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘానికిగాని, కృష్ణాజిల్లా విద్యార్థిసంఘానికిగాని ఎట్టి సంబంధమూ లేదు. ఈ చర్యలు ఎందువల్ల జరిగినాయో కారణాలను విచారించవలసినదిగా రాష్ట్ర సంఘ సహాయ కార్యదర్శి నూతక్కి రంగారావుగార్ని ఏర్పాటుచేశాము. వారు విచారణచేసి పూర్తియైన రిపోర్టును రాష్ట్ర సంఘానికి పంపిన తర్వాత విద్యార్థులు నిష్కారణంగా అట్టి చర్యలకు పాల్పడినట్లు ఋజువైనచో అట్టివారిపై విద్యార్థిసంఘం తగు చర్య తీసుకొంటుంది. కాబట్టి యీ బెజవాడ అల్లరులతోను, దుండగములలోను రాష్ట్ర విద్యార్థిసంఘానికి గాని, దాని అనుబంధ సంబంధములకు గాని ఎట్టి సంబంధం లేదని యీ ప్రకటనమూలంగా తెలియజేచున్నాను.

ప్రెస్సురిపోర్టులను బట్టి చూడగా బెజవాడ మ్యునిసిపల్ హైస్కూలు విద్యార్థులు పరీక్షల సమయమందు గావించిన చర్యలు చాల అక్రమముగను హేయముగను గాన్పించుచున్నవి. విద్యార్థులు క్రమశిక్షణకు భంగముగా నడచుట విద్యార్థి వుద్యమమునకు తీరనినష్టము. విద్యార్థి సంఘములు యీచర్యలను సహింపజాలవు. ఆంధ్రరాష్ట్రవిద్యార్థి ఫెడరేషను జాయింటు సెక్రటరీగార్ని బెజవాడలో జరిగిన అల్లరులను గురించి విచారించి రిపోర్టుచేయుటకు నియమించిరి. వుద్యమములో బాధ్యతగల వ్యక్తులుగాని లేక ప్రాథమిక సభ్యులుగాని యీ అల్లరులలో పాల్గొన్నయడల తప్పక చర్య తీసుకొనబడును.

విద్యార్థులలో క్రమ శిక్షణ నభివృద్ధిచేసి బాధ్యతగల భావిభారత పౌరులుగాను, స్వతంత్ర యోధులుగను తయారు జేయుట ముఖ్యోద్దేశముగా గల విద్యార్థిసంఘములు క్రమశిక్షణా భంగకరములగు కార్యములను సహింపజాలవు. తోటి విద్యార్థుల యవినీతికి విచారములను తెలుపుచు వారిని తమ నడవడిని సంస్కరించుకొన వేడుచున్నాను.

పి. సత్యనారాయణ,
కృష్ణాజిల్లా విద్యార్థి సంఘ కార్యదర్శి.

నిర్మాణ సమస్యలు

ఫెడరేషన్‌కు వ్యతిరేకంగా పోరాటము సాగించడానికి దేశములో సన్నాహాలు జరుగుచున్న సమయములో నిర్మాణావశ్యకతనుగూర్చి ప్రత్యేకముగా తెలుపనవసరములేదు. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారిచే ప్రకటించబడిన ఈ పుస్తకము, స్వాతంత్ర్యయోధులకు ఈ నిర్మాణ సమస్యను పరిష్కరించడానికి అనేక సూచనల నిస్తుంది. వెల అణా. వెంటనే నవశక్తి ఆఫీసుకు వ్రాయండి.

చిట్టివలస కాల్పులు

(8 వ పేజీ తరువాయి)

వారు ఆ రీతిగా మాట్లాడు కొనుచుండగా, సుబ్బారావుగారివద్దకు తహశీల్దారు వెళ్లి ఆయనను అచోటునుండి మరొకచోటుకు తీసికొనిపోయెను. గేటువద్ద నలుగురు పోలీసులపై రాళ్లు రువ్వబడెనని సుబ్బారావుగారితో జిల్లాకలెక్టరు చెప్పెను. ఆరాత్రికి వారందరును ఎక్కడివారక్కడకు వెళ్లిరి. అంతవరకు వారిలో వారికి జరిగిన సంభాషణ అంతే. మరునాడు (15-2-39 తేదీ) ఉదయం 9 గంటలకు తనతో వచ్చి మాట్లాడవలెనని జిల్లాకలెక్టరు ఏర్పాటు చేసెను. కాల్పులను గూర్చియు, లాఠీచార్జిలనుగూర్చియు మాట్లాడుకొనుటకు రమ్మని ఏర్పాటు చేసెను.

కరుణాకరం సుబ్బారావుగారి సాక్ష్యం.

సుబ్బారావుగారికి తిరిగి కబురువచ్చినపిమ్మట జిల్లాకలెక్టరువద్దకు (15 తేదీని) సుబ్బారావుగారువెళ్లిరి. మిల్లు ఏజంటున్ను, మిల్లు మేనేజరున్ను, డిప్యూటీ పోలీసు సూపరింటెండెంటున్ను, డిప్యూటీకలెక్టరున్ను అచట నుండిరి. వారితోకూడ కలిసి మిల్లులోనికి రావలసినదిగా సుబ్బారావుగారిని కోరిరని సుబ్బారావుగారు చెప్పిరి. 14-2-39 తేదీనాటి రాత్రి జరిగిన వైపరీత్యములకు పిమ్మట మిల్లు ఎట్లున్నదో చూడడానికి రమ్మన్నారు. గతరాత్రియే మిల్లులోనికి వెళ్లి తన్ను చూడనిచ్చి యుండిన యెడల, ప్రయోజనం ఉండగలదని సుబ్బారావుగారు అన్నారట. కాని యిప్పుడు (15-2-29 తేదీని) వెళ్లిన ప్రయోజనం లేదన్నారట. కాని, ఆయనను వారు ఒత్తిడి చేసినపిమ్మట, ఆయన వారితో కలిసి వెళ్లెను. మిల్లులో కదుళ్లున్ను కట్టునాళ్లన్ను చెల్లాచెదరుగా పడియుండెను. వాని నన్నింటిని చూపించి కలెక్టరు యీక్రిందిరీతిగా పల్కెనని సుబ్బారావుగారు చెప్పిరి.

"మిల్లు అంతయును ఏలాగున పాడుచేయబడెనో చూడండి" ఇంతకుమించి మరేమియును సుబ్బారావుగారికి చూపబడలేదు. యంత్రాలు ధ్వంసమగుటగాని, ఎవరైనా మనుష్యులకు దెబ్బలు తగులుటగాని సుబ్బారావుగారికి చూపబడలేదు. కాని కలెక్టరు ప్రచురించిన ప్రకటనలో చాలమందికి దెబ్బలు తగిలెనని వ్రాయబడియుండెను.

ఆ సంభాషణ సందర్భములో సుబ్బారావుగారు చెప్పినదేమనగా, "జేమ్సుగారే స్వయంగా తుపాకితోకాల్చిరని కార్మికులు చెప్పుచున్నారు. కాని జేమ్సుగారు ఆ మాట అబద్ధమని చెప్పుచున్నారు."

జేమ్సుగారితో మాట్లాడ గోరుచున్నానని నేను 18-2-39 తేదీని ఆయనకు ఉత్తరము వ్రాసితిని. కాని, 14-2-39 తేదీ మంగళవారం సాయంకాలమునాడు జేమ్సుగారికి తగిలినదెబ్బలవల్ల ఆయన ప్రక్కనుండి లేవలేకుండా జ్వరముతో బాధితులయి యున్నారని విల్సనుగారు నాకు తెలియజేసిరి. కలెక్టరుగారు పత్రికలలో చేసిన ప్రకటన యందుగాని, ప్రధానమంత్రిగారికి సుబ్బారావుగారు వ్రాసిపంపిన ప్రకటనలోగాని జేమ్సుగారికి దెబ్బతగిలినట్లుగా ఉదాహరింపబడలేదు నావిచారణలో సుబ్బారావుగారు చెప్పిన దేమనగా "జేమ్సుగారు తాను తుపాకి కాల్చిన మాట అబద్ధమని జేమ్సుగారు వాదించిరి. తుపాకులు కాల్చబడిన సందర్భములో తనకు దెబ్బ తగిలినట్లుగా జేమ్సుగారు నాతో కూడా చెప్పియుండలేదు" కాబట్టి జేమ్సుగారికి దెబ్బ తగిలినట్లుగా విల్సనుగారు నాకు తెలియజేసిన యీవిషయము క్రొత్త అంశముగా నున్నది. నేను నావిచారణ ముగించుటకుముందు నాకు తెలియవచ్చిన సంజాయిషీలను సరిగా అవగాహన చేసికొనుటకై మిల్లులోనికివెళ్ళి చూచుటకు అనుమతి నొసంగజాలనని విల్సనుగారు జవాబు యిచ్చిరి.

చికిత్సకూడా లేదు.

తుపాకీ కాల్పులు అయిన పిమ్మట గాయపడిన కార్మికులకు ప్రథమ చికిత్సకూడా జరుగలేదని చెప్పిరి. చికిత్సఏదైనను చేయవలసినదిగా మిల్లు తాలూకు డాక్టరును తాను అడుగగా,అట్టిచికిత్స లేవియును చేయవద్దని తనపై అధికారి తన్ను ఆజ్ఞాపించినట్లుగా, మరణించిన కార్మికుని సోదరుడు తనవాఙ్మూలములో నావిచారణ సందర్భమున తెలియజేసెను.

ఆతడు తన సోదరుని కోరికపై అన్నమును తీసికొనిరాగా, రిజర్వుపోలీసులు అతనిని వెడలగొట్టిరని ఆతడు చెప్పెను. ఈకార్మికుని విశాఖపట్నంలోని కింగుజార్జి ఆస్పత్రికి తీసికొనిపోయినప్పుడు అతని దేహముమీది గాయముపై ఒక మురికి ఉత్తరీయము చుట్టబడెను.

15-2--39 ఉదయం 8-30 గంటలకు గాయపడిన మిగతా కార్మికులు భీమునిపట్నం ఆస్పత్రికి 11 గం॥లైన పిమ్మటనే వారి కచట చికిత్సలు జరిగెను. కాని బుద్ధిపూర్వకంగా అచటి డాక్టరును రెవిన్యూడివిజనల్ ఆఫీసరు తీసికొని పోయెనని చెప్పుచున్నారు. అసెంబ్లీసభ్యులగు కే. సుబ్బారావుగారును, విశాఖపట్నం జిల్లా కాంగ్రెస్ ప్రెసిడెంటగు దేవకీనందనుగారును బలవంతము చేసిన మీదట, గాయబడినకార్మికులిద్దరును ఆస్పత్రియందు చేర్చుకోబడిరి. కాని వారిని 21 తేదిని చికిత్స పూర్తియైనట్లుగా పంపివేసిరి. వా రిద్దరిలో ఒకనికి రెండు కాళ్లను స్వాధీనంలో లేకుండా ఉన్న స్థితిలోనే, నేను చేసిన విచారణకు హాజరై సాక్ష్యమిచ్చెను. అతని రెండు కాళ్లకు కట్లు కట్టబడి యుండెను అతడు కర్రనుచేతబట్టియైనను నిలుబడలేకుండెను.నా విచారణకై అతనిని డోలీలో ఎక్కించి తీసికుని వచ్చిరి.

గత సంవత్సరం, 103 దినములు కార్మికులు సమ్మెచేసియుండిరి. ఒకటిన్నర మాసములు మిల్లు బందుచేయబడెను. అందువల్ల అప్పటి తగాదా పరిష్కారార్థమై ఒక పంచాయితి విచారణకై గవర్నమెంటు వారిచే నిర్మించబడెను. కాని, ఆ పంచాయితీ విచారణ కర్తల నిర్ణయములను అమలు జరుపుటకు మిల్లు అధికారులు ఎంత మాత్రమును శ్రద్ధ వహించలేదనియు చిట్టివలస కార్మిక సంఘము ప్రెసిడెంటున్ను గవర్నమెంటున్ను ఎన్నిమార్లు హెచ్చరించినను శ్రద్ధవహింపలేదనియు సుబ్బారావుగారు సాక్ష్యవిచారణలో నాయెదుట చెప్పిరి.

ఆ పంచాయతీ నిర్ణయముల ప్రకారంగా, అప్పన్నవిషయములో లిఖితపూర్వకమైన సమాధానమును అతడు వ్రాసియివ్వ వలసినదిగా కోరవలసియుండెను. కాని, మిల్లుఅధికారులు తమంతతామే అతనిని బర్తరఫుచేసి అప్పన్న పనిచేయుచున్న మగ్గమును లాగివేసిరి.

ఈవిధంగా బర్తరఫుచేయడం, కార్మికులను బెదరించడం, చూడగా, పంచాయితీ విచారణకు పూర్వమందు అమలులోనుండిన నిరంకుశాధికారమును మిల్లు అధికారులు ఏరీతిగా చలాయింప దలంచిరో కార్మికులకు తెలియపరచడమైనదని భావించుచున్నారు.

జననష్టము

తుపాకీ గుండుదెబ్బచే మరణించినవారు	1
గుండుదెబ్బలవల్ల గాయపడినవారు	15
లాఠీదెబ్బలవల్ల గాయపడినవారు	86
వెరశి	102

వీరిలో 64 మందిని డా॥ వెంకయ్య యం.బి. బి. యస్. గారు పరీక్షించిరి. కొందరికి తుపాకి గుండ్లవల్లనే గాయము లయ్యెనని చెప్పిరి. కాని ఆవిషయమైన వివరములుమాత్రమియ్యలేదు.

పైచెప్పిన 102 మందిగాక, చుట్టు ప్రక్క గ్రామాలలోని కార్మికులకు చాలమందికి కూడ గాయములు తగిలెనని చెప్పిరి. ఒకతుపాకిరవ్వ దెబ్బ తగిలిన వాని నొకనిని నేనే చూచితిని. అతడు దానికి ఏదో పచ్చిఆకువైద్యము చేయుచుండెను. నీవు ఆస్పత్రిలో ఎందుచేత చికిత్స చేయించుకో లేదని నేను అడుగగా బండీకిరాయి వగైరా ఖర్చులను భరించి అనుదినము అంత దూరము పోజాలనని అతడు బదులు చెప్పెను.

(సం) బి. ఎస్. రంగశాయి



జమీందారీలలో యావెట్టి చేయించుకోడం ఆగేదెప్పుడు? —

ఫాకీ పనివారల కష్టాలను తొలిగించాలి.

తెనాలి

పాకీ పనివారి సమ్మె.

లోగడ తెనాలి మునిసిపాలిటీవారు పెంటకుప్పల బళ్లుతోలెడు పాకీ వారికి నెలకు 10 రూపాయల చొ॥ జీతమును యిచ్చుచుండిరి. మునిసిపాలిటీయే స్వయంగా వీరికి జీతములనిచ్చు పద్ధతిపోయి వీరికి ఖరీదు ఎద్దు లను సప్లయిచేయు కంట్రాక్టర్లే జీతముల నిచ్చు పద్ధతి అమల్లోకి వచ్చేటప్పటికి, వీరి జీతములు 10 నుండి 9 రూపాయలు చేయబడెను. ఈ నెల 3 తేదీ మధ్యాహ్నం పనిలోకి రాగానే బళ్లను తోలు పాకీవారు అందరు ఇదివరకు ఇచ్చుచున్నట్లుగా రు. 10 లు జీతమును ఇవ్వమని కోరిరి. కంట్రాక్టర్లు, అసిస్టెంటు శానిటరీ యిన్స్పెక్టరు కలిసి ఆ విధముగా ఇచ్చుటకు నిరాకరించినారు. దానిమీదట బళ్ళ పనివారందరు పనిచేయ నిరాకరించి మునిసిపాలిటీ ఆవరణనుంచి బయటికి వచ్చి వేసినారు. అసిస్టెంటు శానిటరీ యిన్స్పెక్టరువచ్చి 9½ రూపాయలు ఇప్పిస్తాను రమ్మని పనివారు బ్రతిమాలుకున్నప్పటికీ వారు ఒప్పుకొనలేదు. 10 రూపాయలు ఇస్తామని కంట్రాక్టర్లు ఒప్పుకునేవరకు రామని చెప్పినారు. కొంతసేపయిన తరువాత కంట్రాక్టర్లు 10 రూపాయలు ఇస్తామని రూఢిగా చెప్పినమీదట పనిలో ప్రవేశించినారు.

గుడివాడ

పాకీపనివారల సమ్మె

ఈ దిగువ నుదహరించిన ప్రాథమికి కోరికలు అనేక పర్యాయములు మ్యునిసిపాలిటీ వారికి సంఘము ద్వారా తెలియచేసుకొన్నను ఫలితము లేకపోయినది.

పైగా నిన్నటి రోజున గొడ్లు లాగుచున్న బళ్ళను లాగవలయుననియు, అట్లు కానిచో పనులు మానుకొనవలసినదనియు కమీషనరుగారు పాకీవారికి తెలియజేసిరి.

యీ కష్టములన్నియు వారు భరించలేక ఈ దిగువ ప్రాథమిక కోరికలు నెరవేరువరకు 1-4-38 వ తేదీ నుంచి సమ్మె చేసిరి.

ప్రాథమిక కోరికలు :

1. గొడ్లు లాగే పెంటబళ్ళు మనుష్యులను లాగమనకూడదు.

2. స్త్రీలకు ప్రసవించుటకు ముందు ఒక మాసము ప్రసవించిన పిమ్మట ఒక మాసపు జీతముతో సెలవు యివ్వాలి.

3. సంవత్సరమునకు 15 రోజులు క్యాజువలు సెలవు యివ్వాలి.

4. పాకీపనివారికి యిళ్ళపన్ను, పెంట బళ్ళ పన్ను తీసివేయాలి.

5. దొడ్ల పని చేసేవారికి ఇతరపనులు చెప్పరాదు.

6. తగిన కారణము గలదని నిరూపింపబడేవరకు ఫైనులు వేయరాదు.

7. స్త్రీ పురుషులను మ్యునిసిపలు ఉద్యోగులు తిట్టుట, కొట్టుట మానాలి.

8. అమమాసాల కొకసారి ఒకరి పనులు ఒకరికి మార్చాలి.

9. యీ గ్రామములో మాలో నిరుద్యోగులుండగా యితర గ్రామములనుండి పనివారిని తేరాదు. ఉద్యోగములు స్త్రీ పురుషులకు సమానముగా ఇవ్వాలి.

10. ఇతర మునిసిపాలిటీలలో ఇచ్చే జీతములు మాకు కూడా ఇవ్వాలి.

11. మా యిళ్ళముందు నుండి సినీమా మురుగును తొలగించాలి.

12. మా నూతిని ఆనుకొనియున్న మురికి కాలువను తొలగించి ఆ నూతికి పళ్లెము కట్టించి యివ్వాలి.

13. మా యిండ్లవద్ద దీపమును వేయించాలి.

14. మా సంఘమును గుర్తించాలి.

సమ్మెచేసిన రోజున ఒక్కరునూ పనిలోకి పోకుండా జయప్రదముగ సమ్మె సాగినది. మ్యునిసిపాలిటీవారు ఆ రోజునే యీ కోరికలన్నిటిని ఆలోచించి పాకీవారికి సదుపాయము చేసెదమని చెప్పిరి. కాపున ఆ సాయంకాలము కౌన్సిలువారు సమావేశమై వారి కోరికలను నెరవేర్చుటకు వాగ్దానము చేసిరి. మనుష్యులు బండ్లు లాగుట తొలగించారు

2, 3, 4 కోరికల విషయములో గవర్నమెంటు ఆర్డరు ప్రకారము 1 నెల యిచ్చెదమనియు, మిగతా నెలకును, 3, 4 హక్కుల విషయములలోను గవర్నమెంటు వారినీ సంప్రతించి చేయవలెననియు చెప్పిరి. మిగతా షరతులకు పూర్తిగా అంగీకరించిరి. అందుపై 2-4-39 తేదీని పాకీవారు తిరిగి పని ప్రారంభించిరి. యీ విషయములో టవున్ కాంగ్రెసు కమిటీవారు ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్‌వారు పాకీ పనివారల సంఘపు కోరికపై కలుగచేసుకొని తోడ్పడిరి.

నిప్పుగొట్టాలు అను సిగర్‌లైట్లు చేయువారికి హెచ్చరిక.

యిప్పటికి సం॥ నుండి కడు బీదలగు కార్మికులు ఆర్థిక పరిస్థితులవల్ల కులవృత్తులులేక అన్నాతురులై

కార్మిక సమస్యలు

కనీస జీవనముకొరకు నిప్పుగొట్టాలు చేసుకుని రోజు 1కి నాలుగు అణాలు సంపాదించుకొని అధమ జీవనం చేయుచున్నారు. మనచే ఎన్నుకొనబడిన కాంగ్రెసు ప్రభుత్వం నిప్పుగొట్టాలు ఎవ్వరూ చేయకూడదనిన్నీ, ఎవ్వరూ అమ్మకూడదనిన్నీ నిర్బంధపరచుచూ, కార్మికులు చేయుచిన్న నిప్పుగొట్టాలు అవి చేయు పరికరములు స్వాధీనం చేసుకొంటూ ఉన్నారు. గాన కార్మికు లెల్లరు ముందు జరుగబోయే కర్తవ్యమును గూర్చి ఆలోచించుకొనుట ముఖ్య విషయము కాబట్టి మన మెల్లరము ఒకచోట సమావేశమై ఒక సంఘమును స్థాపించి సంఘం ద్వారా ప్రభుత్వమునకు మన కష్టములను తెలియపరచుకొని ప్రభుత్వం వలన యే విధముచేతనైనా గొట్టాలు చేయునట్లు ఆర్డరును పొందినగాని బీద కార్మికలు జీవించుట కడు దుర్లభం. యీ తరుణమున మనము తీవ్రం అందోళన చేయకుండిన చాలా అనర్ధకము. యిదియునుగాక మనము చేయు గొట్టాలు రాజద్రోహకరమగు పని కాదు. కాంగ్రెసు నిబంధనలలో దేశీయ పరిశ్రమలు చేయకూడదను నిబంధనలేదు. కాబట్టి మీమీ అభిప్రాయములు వెంటనే యీ చిరునామాకు వ్రాసిన తగు యేర్పాట్లు చేయుదుము.

సింహాద్రి సూర్యనారాణ

సత్యనారాయణపురం, గుడివా॥

మధుర

మీనాక్షి టెక్స్టయిల్సు మిల్లు కార్మికుల వివాదము

ఈ మిల్లులో షుమారు 2300 మంది పనిచే యుచున్నారు. మార్చి 10 వతేదీనుంచి షుమారు 1500 మంది పాల్గొనుచున్న సమ్మెలో కొద్దిమంది మాత్రమె పాల్గొన్నారని యజమానుయ ప్రకటించిరి. సమ్మె తీవ్రముగా సాగుటవల్లనే ప్రభుత్వము ఈ వివాదమును పరిష్కారము చేయుటకు డి యల్. స్థాతిగారిని మార్చి 29 వ తేదీన నియమించింది. పికెటింగు కూడ ఆపుచేయబడినది. ఈ క్రింది విషయములపై తీర్పు చెప్పాలని ప్రభుత్వము తెలియజేసింది.

1. యూనియన్ సక్రమముగా నిర్మించబడి వ్యవహరింపబడినదా: 2. మీనాక్షి మిల్లు వర్కర్సు తరపున వ్యవహరించగలదా: 3. సెక్రటరీ సూచనపై జరిగిన సమ్మె చట్టబద్ధమైనదా: 4. సమ్మె సమర్ధింప దగినదా. వివాదమును పరిష్కరించుటకు ఇతర మార్గాలు ప్రయత్నించబడినవా: 5. పికెటింగు దౌర్జన్యమును గూర్చి ప్రచారము జరిగిందా: 6. పనిలోనుండి తొలగింపబడిన ఐదు గురిని తిరిగిపనిలో ప్రవేశపెట్టుకొనవలెనా: 7. ఈ ఐదు గురిని పనిలో పెట్టుకొనటము న్యాయమేనా, పెట్టుకొననియెడల శిక్షణకు భంగము కల్గుతుందా: 8. మిల్లులో పనిచేయువారిలో అధికసంఖ్యాకులు యూనియన్‌లో ఉన్నారా, లేకపోతే వారితో సంప్రతించి వివాదమును పరిష్కరించాలసిన అవసరముందా: 9. మార్చి తొమ్మిద వ తేదీన హటాత్తుగా జరిగిన సమ్మె చట్టబద్ధమేనా: 10.10.11 తేదీలందు జరిగిన సమ్మె సక్రమము, చట్టబద్ధమైనదేనా 11. సమ్మెచేసినవారిని తిరిగి పనిలో ప్రవేశపెట్టుకొనవలెనా, పెట్టుకొనేటట్లయితే ఎట్టి షరతులమీద పెట్టుకోవాలి.

విచారణకై సూచించిన పై విషయాలన్నీ యజమానులకు అనుకూల వాతావరణము కలుగజేసి కార్మికులను, యూనియన్‌ను నిందితులనుగా చేయుచున్నవి. కార్మికులు కోరిన బోనసు రికగ్నిషను, ట్రేడు యూనియనులలో పనిచేసినందులకు శిక్షించటమును గూర్చి విచారణాంశములలో లేనే లేదు. పై విషయములపై తీర్పును యూనియన్ కూడ అంగీకరించుతామని తెలియజేయటము పొరపాటు.

బెజవాడ

ఎడ్ల బండ్ల సంఘము

పై సంఘమువారు 2 వ తేదీన సమావేశమై యీ దిగువవారిని 1939 వ సం॥కు సంఘముయొక్క అధికారవర్గము ఎన్నుకొనబడిరి.

శ్రీ బొయ్ని పాపయ్యగారు	అధ్యక్షులు
శ్రీ పోత్ని గణపతిరావుపాత్రుడుగారు	ఉపాధ్యక్షులు
శ్రీ దొంకాడ లక్ష్మీనారాయణగారు	ప్రధాన కార్యదర్శి
శ్రీయుతులు చింతరాయలకొసత్యం, డత్తు కనకయ్యగార్లు	సహాయ కార్యదర్శులు

మరి 25 మంది కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకొనిరి.

ముఠా పనివారల సంఘం.

2 వ తేదీ సమావేశమై ఈ దిగువ వారిని 1939 సంవత్సరంకు సంఘముయొక్క అధికార వర్గముగా యెన్నుకొనిరి.

శ్రీ పోతిన గణపతిరావు పాత్రుడు, అధ్యక్షులు.
శ్రీ పరిపిళ్ళ సోములుగారు ఉపాధ్యక్షులు.
శ్రీ వడిపిన కనకయ్యగారు ప్రధాన కార్యదర్శి.
శ్రీయుతులు సూరబత్తుల రామమూర్తి, కేసిరెడ్డి అప్పలస్వామిగార్లు సహాయ కార్యదర్శులు.

మరి 31 మంది కార్యనిర్వాహక సభ్యులుగా యెన్నుకొనబడిరి,

సంఘంవారికిని బెజవాడలో కొంతమంది షాహుకారులకును నెలకువచ్చు శెలవు దినము ఆదివారమా లేక అమావాశ్యయా యన్న వివాద సమస్యలో గవర్నమెంటువారు జోక్యం కలిగించుకొనుటచే వారిచ్చే నిర్ణయమునకు బద్ధులమయ్యెదమని తీర్మానించిరి.

కాకినాడ కార్మిక పోరాటములో స్త్రీలు ముందంజవేశారు.

కామ్రేడ్ పి. జగదాంబ

మొన్నమొన్నటి వరకు తూర్పుగోదావరి జిల్లాలోని మహిళాఉద్యమ చరిత్ర, దాని వైఖరిని గమనిస్తే ఆ ఉద్యమం కేవలం మధ్య తరగతివారి ఆందోళనకుమాత్రమే సహాయపడుతుంది. ప్రజాఉద్యమానికి, ప్రజావిప్లవానికి అదిచాల కొద్దిగానే సహాయపడగలదనే భావానికి తావిస్తూవచ్చింది. కాని యీమధ్య కాకినాడలో కార్మికోద్యమాభివృద్ధికి ఫలితంగా జరిగిన సమ్మెల సందర్భంలో ముఖ్యంగా స్టీవిడోర్, పీచుపనివారల సమ్మెలలో చేసిన ఊరేగింపులు, సభలు మూలంగా కార్మికస్త్రీలలో ఒకవిధమగు సంచలనం తద్వారా విప్లవశక్తి విజృంభించింది. తాటిపీచుపనిలో నూటికి 75 మంది స్త్రీ కూలీలు. ఈ సమ్మెలో యీ స్త్రీ కార్మికులు చూపిన త్యాగం, పట్టుదల, సాహసం గమనించినప్పుడు స్త్రీలు ముఖ్యంగా కార్మికవర్గపుస్త్రీలు తమ హక్కులకై ఎంతటి త్యాగానికి సిద్ధపడునదీ తమ విప్లవశక్తిని ప్రదర్శించగలగునదీ స్పష్టమగుతుంది.

పీడితప్రజాసామాన్యపు హక్కులకై పోరాడతాము అని కంకణం కట్టుకొన్న కాంగ్రెసువాదులు బ్రిటిషు రాజ్యాంగయంత్రములో బాధ్యతను తీసుకొని వుండడం, సహజంగా పీడిత ప్రజలలో తమ హక్కులు సంరక్షించబడుతాయనే ఆశను కలుగజేసింది. ముఖ్యంగా కాకినాడలో యీమధ్య స్టీవిడోర్, సమ్మె విజయవంతమై వారికి కొన్ని హక్కులు రావడం, కాకినాడలోని కార్మికులలో ఆశాజ్యోతిని కలుగజేసినది, మన యీదారిద్ర్యానికి కారణం మన కర్మఫలితంకాదు. మనకో ఐక్యతలేకపోవడం. మనలో పోరాడే స్వభావం లేకపోవడం అనే విషయాన్ని వారు గుర్తించారు దీని ఫలితంగా యితరకూలీలవలెనే పీచుపనివారలుకూడ సంఘంగా ఏర్పడ్డారు. ఇందుకు స్త్రీలే ముఖ్యకారకులవడం గమనించదగిన విషయం. ఆర్ధికంగాను రాజకీయంగాను; సాంఘికంగాను, అన్నివిధములా అణగద్రొక్కబడిన స్త్రీలు యీవిధంగా పురుషులకంటె ముందడుగువేసి సంఘంగా ఏర్పడి తమహక్కులకై పోరాడ నిశ్చయించుకోవడం వారిలోగల విప్లవశక్తిని రుజువుచేసింది.

ఈ విధంగా సంఘంగా ఏర్పడిన తరువాత వారు తమ న్యాయసమ్మతమగు హక్కులకై తమ యజమానులగు వర్తకులతో రాయబారం జరిపారు. కాని వర్తకులీ రాయబారాలను నిరాకరించారు. అన్నివిధముల వారి ప్రయత్నములు విఫలమైనప్పుడు కార్మికుల ఆఖరు సాధనమైన సమ్మెను ప్రయోగించడానికి నిశ్చయం చేసుకున్నారు. ప్రత్యేకంగా కార్మిక, కర్షక హక్కులకై పోరాడే కాంగ్రెసు సోషలిస్టుపార్టీ నాయకత్వం క్రింద తమ జన్మహక్కగు సమ్మెను ప్రకటించారు. ఇప్పటికి షుమారు 35 దినాలనుండి శాంతియుతంగా, జయప్రదంగా తిండిలేక మలమల మాడుతున్నప్పటికి సమ్మె సాగిస్తునే ఉన్నారు. కాని వారి "ఆకలిమంటలు నశించాలి." అనే కేకలు తిండిలేక శల్యావశిష్టములైన వారిదేహాలు లోతుకుపోయిన కండ్లతో దైన్యమును ప్రదర్శిస్తూ వున్న వారి ముఖాలు, స్త్రీ జాతికన్నిటికన్న ప్రధానమగు మానాన్ని కాపాడుకోడానికి చాలీచాలని జీర్ణ వస్త్రములు, స్వార్ధపరులగు వర్తకుల కెంతమాత్రము 'హృదయపరివర్తనం' కలుగజేయలేక పోయినవి. తమకు వందలు, వేలు నష్టం వచ్చినా ఒప్పుకున్నారు గాని యీ శ్రమజీవులకు రోజుకు ఒక్క కానీ అయినా ఎక్కువ యివ్వడానికి వారి శిలాసదృశ హృదయములు అంగీకరించలేదు. స్వార్థపరుని 'హృదయపరివర్తన' మింతటిదే కాబోలు.

ఈ సమ్మె పోరాటంలో స్త్రీలు, సమాజం తమకేర్పరచిన అక్రమ నిర్బంధాల కన్నిటికీ స్వస్తి చెప్పారు. అర్ధంలేని సాంప్రదాయాలనన్నిటిని మూలకునెట్టారు. ఉత్సాహం, పట్టుదలకలిగిన సుమారు 30 మంది కార్మిక స్త్రీలు వాలంటీరు దళముగ ఏర్పడ్డారు. అధ్యయన తరగతు లేర్పరచి, 'అమ్మ' మొదలగు పుస్తకములు చదివిచెప్పుటవల్ల వారిలో మంచి వర్గచైతన్యం, పట్టుదల హెచ్చినవి. ఊరేగింపుల్లో కూలీపాటలు పాడుకుంటూ తిరుగుతుంటే వర్తకులు వారిని నిరుత్సాహ పరచుటకు మీకీ విధంగా వీధులలో కేకలువేసుకుంటూ తిరగడానికి సిగ్గులేదూ. అని హేళనభావంగా అడిగినప్పుడు దానికి చెప్పుదెబ్బగా "ఆకలి ఆకలి మండే ఆకలి .... అభిమానాన్నీ, ఆశయాలనీ సహనశక్తినీ చంపే అకలి" అని వారికి బుద్ధి వచ్చేటట్లు పాడేవారు.

వర్తకులు అతి రహస్యంగా దొంగ కూలీలను తీసుకువచ్చి పనిచేయించుకోకుండా ఎక్కడెక్కడ ఏ పనిజరుగుతోందో ఆచోకీ తీయడంలో స్త్రీ వాలంటీర్లు అతినేర్పుతో రాత్రింబగళ్ళు నిర్భయంగా పనిచేశారు. కొందరు రౌడీలచేత త్రాగించి కార్మికులలో పనిచేస్తున్న సోషలిస్టులను కొట్టించడానికి వర్తకులు చేసిన ప్రయత్నాలను గ్రహించి ఆవేశంతో వారిని ఎల్లప్పుడును చుట్టుముట్టి ఉండి వారి ప్రయత్నాలను సాగనివ్వకుండ చేయుటలో స్త్రీ వాలంటీర్లు చాల చాకచక్యాన్ని ప్రదర్శించారు.

ఈ విధంగా సమ్మె దీర్ఘంగా సాగుచున్న సమయంలో కూలీల కష్టాలు బాగా తెలిసిన చిన్న వర్తకులచే కొట్లు కట్టించి తమ పక్షమునకు త్రిప్పుకొనుటకు 3 వ తేదీ ఉదయం ఆ కొట్లవద్ద శాంతియుతంగా పికెటింగు ప్రారంభించారు. వేసవి ఎండలో 150 మంది స్త్రీలు, 100 మంది పురుషులు, చంటిపిల్లలు, వృద్ధులు గర్భిణీ స్త్రీలతో సహా నిద్రాహారములు లేకుండ సత్యాగ్రహము సాగించి అన్ని కొట్లు మూసిన పిమ్మట రాత్రి 12 గంటలకు రాజాల అచ్చన్నగారి కొట్టు వద్దకువచ్చిరి. వీరి కేకలను వినియు కూడ ఆయన తలుపు వేయలేదు. ఆరాత్రంతయు ఆ దుమ్ములోనే, మంచుకు తడుస్తూ వారందరూ చంటిపిల్లలు నిద్రలేకుండ గడపిరి.

4 తేదీ ఉదయం గ 9-0 లకు డిప్యూటీ కలెక్టరు, పోలీసు ఉద్యోగులు, 50 మంది సాయుధ రిజర్వు పోలీసులు, మరికొంతమంది సాధారణ పోలీసులు రంగంలో ప్రత్యక్షమయ్యారు. తక్షణం అందరిని తొలగి పోవలసినదిగా ఆజ్ఞాపించారు. కాని కార్మిక స్త్రీలు మా ఆకలి తీరనిదే, మా హక్కులు రానిదే క్షేమెచ్చటికిని పోజాలమని ధైర్యంగా జవాబు చెప్పారు. వెంటనే ప్రభుత్వోద్యోగులు తమ ప్రతిష్టకు భంగం కలిగిందనే ఆవేశంతో కార్మిక నాయకులగు సోషలిస్టుల నరెస్టుచేసి కూలీ స్త్రీలను, వృద్ధులను, పిల్లలను క్రూరంగా లాఠీలతో కొట్టడం ప్రారంభించారు. పురుషులైనా పరుగు పెట్టారు గాని స్త్రీ వాలంటీర్లు మాత్రం తమ స్థానాన్నుండి కదల లేదు ఆకలి మంటలు నశించాలి. కూలీలంతా ఏకం కావాలి, మొదలగు కార్మిక నినాదాలతో లాఠీ దెబ్బలకు సమాధానం చెప్పారు. కార్మిక స్త్రీల పోరాట స్వభావానికి, వారి విప్లవశక్తికి యిది ప్రత్యక్ష నిదర్శనము.

అరెస్టు చేసిన వారిని పోలీసు స్టేషనుకు తీసుకుపోతున్నప్పుడు, అనేక రోజులనుండి ఆహారము లేక ఆ అస్థి పంజరాలను తమ నాయకులను చూచుటకై లారీతో సమానముగ పరుగెత్తించినది వారిలోని ఆవేశము, విప్లవశక్తి గాక మరేమిగలదు. మా ఆకలి మంటలు తీరాలి, మా కొరకు పోరాడేవారిని విడవండి అని కేకలు వేస్తూ, జుట్లు విడిపోయి, పడుతూ లేస్తూ లారీ వెంట లేచిన దుమ్ములో పరుగులిడుచున్న ఆ జాలిగొలుపు దృశ్యము జాలిగల హృదయాన్ని ఏడ్పించక మానదు.

స్టేషనులో బంధించబడిన తమనాయకుల నొకసారి చూచుటకై వచ్చిన యీ దీనులను పోలీసులు తిరిగి అతిక్రూరంగా లాఠీదెబ్బలకు గురిచేశారు. అనేకమంది స్త్రీ పురుషులకు, వృద్ధులకు, పిల్లలకు తీవ్రమగు దెబ్బలు తగిలినవి. అయినను స్త్రీలు పట్టుదల విడువలేదు. ఈపోలీసు జులుమును కార్మిక నినాదాలలో ఎదిరించి తనుధైర్యసాహసాలను ప్రదర్శించారు. 10 దినముల క్రిందటనే భర్త చనిపోయినప్పుడు సమ్మె ఫలితమునైనా చూడకుండ పోయాడే అని విలపించుచున్న వీరమ్మ అను కార్మిక స్త్రీ తన పట్టుదలకు, సాహసానికి ఫలితంగా పోలీసు లాఠీలకు గురియై యిప్పుడు లేవలేని స్థితిలోనున్నది. ఇట్టి దుఃఖసమయంలో ఈమె సాహసం ఆశ్చర్యాన్ని కలుగజెయ్యకమానదు.

ఈ పోలీసు అక్రమాన్ని ప్రజాహితసంస్థయగు కాంగ్రెసుసంస్థ ఖండించి తమకు న్యాయం కలుగజేస్తుందనే విశ్వాసంతో 6 తేదీని జరిగిన జిల్లాకాంగ్రెసు సంఘసమావేశములో సోషలిస్టు సభ్యునిచే ప్రతిపాదించబడిన తీర్మానాన్ని చెవులార విందామనే ఆశతో సుమారు 500 మంది కార్మిక స్త్రీ పురుషులు సమావేశమునకు హాజరయ్యారు "కార్మికులంతా తమకు జరిగిన అన్యాయాన్ని తీరుస్తారనే ఆశతో వచ్చారు. ఎన్నికలగు సరికి చాలరాత్రి అవుతుంది. అంతవరకు వీరంతా ఉండడం కష్టం గనుక ఎన్నికలకుముందే తీర్మానం ప్రవేశపెట్టుట కనుమతినిమ్మని" చేసిన కోరికను కమీటీతోసి పుచ్చినను, పట్టుదల వీడక, భోజనం లేకుండ రాత్రి 12 గంటలవరకు అచ్చటనే వేచియుండిరి. కార్మికుల యీ దీక్షకు ఫలితంగా వారిచర్య సక్రమం, శాంతియుతం అని ఒప్పుకోక పోయినప్పటికి లాఠీఛార్జీని మాత్రము ఖండిస్తూ తీర్మానం ప్యాసు అయినది. దీనికి ముఖ్యంగా రాత్రి 12 గంటలవరకు కదలకుండ కూర్చుండిన స్త్రీ కార్మికుల దీక్షయే కారణమని ఒప్పుకొనక తప్పదు.

ఇటలీ అల్బేనియాను మ్రింగివేసింది.

జర్మనీ వచ్చే వారము డాన్జిగ్‌ను....

మేము గత వారము సూచించినట్లు, ఛాంబర్లేను ప్రకటన బూటకమనడానికి ఈ వారం ఘటనలు మరి కొన్ని జరిగాయి. మాస్కోనుండి రష్యను కమ్యూనిస్టు పార్టీ పత్రిక ప్రవద, పోలిషు కారిడరును జర్మనీకి ఇచ్చి వేయమని పోలండుపై బ్రిటను ఒత్తిడి తేవచ్చునని సూచిస్తూ ఉంది.

స్పెయినులో ఫ్రాంకో.

స్పెయినులో జనరలు ఫ్రాంకో, ఒక్క మాడ్రిడులో ఒక్క రోజున 2000 మందిని అరెస్టు చేశాడు. ప్రజా తంత్రవాదులను చెండాడుచున్నాడు. ఫ్రాంసునుండి కాటలోనియాకు తిరిగి వచ్చిన 12000 మంది ప్రవాసితులను కాల్చిచంపించాడని నెగ్రిన్ ప్రకటించాడు. ఈ విధముగా భయంకర ప్రతి హింసను కొనసాగిస్తూ, ఫ్రాంకో, కమ్యూనిస్టు వ్యతిరేక ఒడంబడికలో చేరాడు. అంటే, బ్రిటను ఫ్రాంసులతో కలియక, జర్మనీ ఇటలీలతో కలసి తన విదేశాంగ రాజనీతిని నడపదలచు కొన్నాడు. అయినా ఇట్టి ఫ్రాంకో ప్రభుత్వానికి, ప్రజా సామాన్యమంతు పంచిపెట్టడానికని, బ్రిటను, పోర్చుగల్ దేశాలు, విరివిగా, ఉచితముగా ఆహార పదార్థాలను పంపుతున్నాయి. ఈ దయ నెగ్రిన్ ప్రభుత్వమున్నప్పు డెక్కడికి పోయిందో? దీనిని బట్టి చూచినా, ఛాంబర్లేను ఇప్పటికీ తన ప్రకటన ప్రకారము నడుచుకొనడానికి పూనుకోవడములేదని స్పష్టమగుతూ ఉంది.

పోలెండుకు వాగ్దానము

పోలెండుకు ఎట్టి వాగ్దానమిచ్చాడో, అట్టివాగ్దానమే రుమేనియాకు కూడ ఛాంబర్లేన్ ఇచ్చాడు. రుమేనియాకు కావలసిన ఆయుధ సామగ్రిని సరఫరా చేయుటకు తామెప్పుడూ తయారేనని పార్లమెంటులో బట్లరు సహాయ విదేశాంగమంత్రి ప్రకటించాడు.

డాన్జిగువిషయమై పోలెండు జర్మనీలు సంప్రదించుకోడానికి ఛాంబర్లేన్ ప్రకటన ఏవిధముగాను అడ్డము రాదనికూడా ప్రకటించాడు. ఇది కూడ ప్రవద పత్రిక యొక్క భవిష్యద్వాణిని బలపరుస్తూ ఉంది.

కామన్సు సభలో చర్చ

4 వ తేదీ కామన్సు సభలో విదేశాంగ వ్యవహారాలపై చర్చ జరిగింది. ఛాంబర్లేను మరియొకపర్యాయం తన ప్రకటన నూతన యుగాన్ని ఆరంభించకపోయినా, నూతనమార్గాన్ని సూచిస్తూఉందన్నాడు: పూర్వమునుండి అనుసరిస్తూ ఉన్న భావాలకు అది భిన్నమట: పోలెండుపై జర్మనీ దాడివెడలితే పోలెండు తప్పక ఎదుర్కొంటుందట: అప్పుడు తాము, ఫ్రాంసు, దాని సహాయానికి ఈ ప్రకటన మూలముగా పోవాలసి ఉంటుందీ: ఇంత శ్రమపడడమూ, పశుబలము చూపి దేశాలాక్రమించే పద్ధతి పోగొట్టి, శాంతముగా చక్కని వాదనలు గావించి తమ హక్కులను రుజువుపర్చుకొనే పద్ధతిని అవలంబింప జేయడానికే నట.


రష్యాతో ఆదర్శాలలోను, భావాలలోను భిన్నాభిప్రాయాలున్నాయి. అయినా ఇవేమీ అడ్డురావు. ప్రతిదేశం యొక్క స్వాతంత్ర్యమును సంపాదించడానికే తాము రష్యాతోకూడ సహకారము చేయడానికి పూనుకొని ఉన్నామని ముగించాడు.

లిబరలు పార్టీవారు, లేబరుపార్టీవారు హృదయపూర్వకముగా ఛాంబర్లేనును బలపర్చారు. ఛాంబర్లేను బ్రిటిషు విదేశాంగ నీతిలో నూతన మార్గము త్రొక్కాడని ప్రశంసించారు. చర్చిల్, ప్రపంచశాంతి నెలకొల్పడానికి కావలసినశక్తి రష్యాలో ఉంది. జర్మనీకోర్కెలు దానికి వినాశకరము. అందుచే రష్యా సహకారము పొందుట సులభము. దానికోసము ప్రయత్నిస్తే, జర్మనీ మధ్య చిక్కుకుంటుందన్నాడు. లాయడ్ జార్జి, రష్యాప్రపంచములో అన్నిదేశాలకన్న ఎక్కువ బలిష్టమైన సైన్యము కలిగిన దేశము. దాని సహకారము చాల అవసరము. పోలెండుకు జర్మనీకి పోరాటము సంభవిస్తే, మనము పోలెండుకు సహాయము చేయలేము. ఒక్క రష్యామాత్రమే సహాయము జేయగలదు, అని తెలియజెప్పాడు.

ఈచర్చసందర్భమున ముఖ్యముగా గమనించాలసినది లేబరుపార్టీకూడ ఛాంబర్లేనుయొక్క బూటక ప్రకటనను నమ్మి బలపర్చడానికి తయారుకావడము. యీ లేబరుపార్టీయే ఛాంబర్లేను ప్రభుత్వము పోనిదే, పాపులరుఫ్రంటు ప్రభుత్వము రానిదే, బ్రిటిషు కార్మికులు, వారి పార్టీయైన లేబరుపార్టీ కోరే విదేశాంగ నీతిని అమలులోకి తేజాలమని, అందుచే మిగిలిన ప్రజాశక్తులతో కలసి ఛాంబర్లేనును పడగొట్టాలని ప్రచారము చేస్తున్నందులకు స్టాఫర్డు క్రిప్సును పార్టీనుండి తరిమివేసినది. ఇదే అన్నిటికన్న విషాదకరమైన విషయము. ఎచ్చట, ఎప్పుడు ఐక్యత కావాలనో, అప్పుడు దానిని భగ్నము గావిస్తూ ఇట్టి పనులు:

బెక్ ప్రయాణము: జర్మనీ ఎత్తులు.

జర్మనీ ఈ బెదరింపులను లక్ష్యపెట్టలేము. హిట్లరు తన ఉపన్యాసములో, బ్రిటనుతో ఎప్పుడూ యుద్ధము సంభవించదనియే నావికా ఒడంబడిక చేసుకున్నాము.



ఈ దృక్పథము బ్రిటిషువారికి నచ్చకపోతే మాకేమి భయములేదు. మమ్ములను చుట్టూ ముట్టడివేయడానికి గాని, మమ్ములను బెదరించడానికిగాని పూనుకుంటే మేము ఊరుకోము. అని ప్రకటించాడు.

బ్రిటనుతో సంప్రదింపులుచేసి, అన్యోన్యపు టొడంబడికను చేసుకోడానికి పోలండు విదేశాంగ మంత్రి, బెక్ బయలుదేరాడు. బ్రిటను మాటలను నమ్మితే నీకును, షూష్నిగ్, (ఆస్ట్రియా ప్రధాని), బెనీస్ (జెకోస్లోవేకియా అధ్యక్షుడు.) నెగ్రిన్, అబిసీనియా చక్రవర్తుల గతే పట్టుతుందనీ, జర్మనీ పత్రికలు బెదరించాయి.

బెక్ లండను చేరాడు. సంప్రదింపులారంభించాడు. ఇంగ్లండు తన ఎత్తులను పూర్తిగా కొనసాగించ నివ్వకుండా చేయాలంటే ఆలసించరాము ప్రమాదమనుకున్నారు హిట్లరు ముస్సోలినీలు. వారి సేనాధీశులు కలుసుకున్నారు. ప్లానులన్నీ ఆలోచించుకొన్నారు. ఇటలీ, అల్బేనియాపై దాడి వెడలింది.

ఆల్బేనియా దాడికి కారణాలు.

ఆల్బేనియా జనసంఖ్య కేవలము 10 లక్షల మంది. ఇందు నూటికి 70 మంది మహమ్మదీయులు. అల్బేనియా దేశము అడ్రియాటిక్ సముద్ర ద్వారమున ఉన్నది. దానికి ఉత్తరమున తూర్పున యుగోస్లేవియా దేశమున్నూ, దక్షిణమున తూర్పున గ్రీసు దేశమున్నూ ఉన్నాయి. ఆల్బేనియాను ఆక్రమించినట్లయితే అడ్రియాటిక్ సముద్రముపై పూర్ణాధికారము ఇటలీ చేతులలో ఉంటుంది. ఉత్తరమున జర్మనీ ఒత్తిడి. దక్షిణాన తన సముద్ర మార్గము ఇటలీ చేతులలో ఉన్నప్పుడు యుగోస్లేవియా ఏ మాత్రము, జర్మనీ ఇటలీలకు వ్యతిరేకంగా మిగిలిన బాల్కను రాజ్యాలతో అంటే, రుమేనియా, బల్గేరియా, గ్రీసులతో కలసి పనిచేయడానికి వీలుండదు. అంతేకాదు, గ్రీసుపై ఆల్బేనియానుండి దాడివెడలము సులభము.

బల్గేరియానుండి, కొంత భాగము రుమేనియా కొంత భాగము గ్రీసు, ప్రపంచ యుద్ధానంతరము తీసుకొని ఉండినాయి. అందుచే నేటికీ బల్గేరియా ఆ కక్షను సాధించాలనే ఉంది. రేపు ఏప్రిల్ 20 వ తేదీ హిట్లరు జన్మ దినోత్సవమున పాల్గొనడానికి బల్గేరియా అధికారులు, మంత్రులుకూడ వెళ్లతున్నారు, నేటి వార్తలు బాల్కను రాజ్యాలన్నీ కలసి ఒక ఆర్థిక ఫెడరేషనును ఏర్పాటు చేయవలసినదిగా హిట్లరు సూచిస్తూ ఉన్నాడని తెలియజేస్తున్నాయి.

అంతేగాక, యుగోస్లేవియానుండి, గ్రీస్‌నుండి బల్గేరియానుండి మాసిడోనియను జాతివారినందరిని ఇటలీ ఒక స్వతంత్ర దేశముగా స్థాపించడానికి ఆలోచిస్తు ఉన్నట్లుకూడ తెలుస్తూ ఉంది.

ఇవి అన్నీ అల్బేనియాను ఆక్రమించడము వలన సాధ్యమయ్యే పనులు. బాల్కను రాజ్యాలు, తమ ఏలుబడిలోకి వస్తే ఇక జర్మనీ ఇటలీలను ముట్టడి వేసే ప్రయత్నాలు విఫలమయినట్లే. అంతే గాక, ఒకవైపు ఛాంబర్లేను అన్నిదేశాల స్వాతంత్ర్యముకోసమే తాము ప్రయత్నిస్తున్నామని చెప్పిన రెండురోజులలోనే ఆల్బేనియా స్వాతంత్ర్యము హరించిపోతే, ఆ ప్రకటనలో ఎట్టి విలువ ఉంటుందో చూచుకోమని బెక్‌కు బెదరింపుకూడ. ఈ బెదరింపుకూడ ఫలించింది.

ఆల్బేనియా ఆక్రమణ

ఆల్బేనియా రాజు జాగ్, ఇటలీతో సఖ్యతతో ఉండినాడు. ఇటలీ యాజమాన్యాన్ని కూడ అంగీకరించాడు. అయినా పైన చెప్పిన ఇన్ని పనులు, ఆల్బేనియాను తన చేతిలో ఉంచుకొన్నప్పుడు, సాధ్యమగుతూ ఉంటే ముస్సోలినీ హిట్లరులు ఊరుకుంటారా? యుగోస్లేవియాపై దండెత్తడానికి ప్రయత్నించాడట: అందుచే ఆల్బేనియాలో అల్లరులు ప్రారంభ మయ్యాయట: ఆ కారణముచే తాము ఆల్బేనియాపై దాడివెడలవలసి వచ్చినదట: అయితే యుగోస్లేవియాపై దండెత్తడానికి జాగ్ ప్రయత్నిస్తే కోపగించాలసిందీ, ప్రతీకారము చేయవలసినదీ యుగోస్లేవియా కాని ఇటలీకి ఏమి పట్టినది: దేశాలను ఆక్రమించుకొనేవారికి తాము చెప్పిన కారణాలు సహేతుకములుగా ఉండాలసిన అవసరము కూడా లేదు.

దాదాపు లక్ష సైన్యము, నావలమీదను, విమానాల మీదను ఈ చిన్న దేశముపై దాడివెడలితే, చేసేదేముంది? ఒకటి రెండు రోజులు పోరాడాయి ఆల్బేనియా సేనలు. చుట్టుప్రక్కల దేశాలకూ, బ్రిటనుకు ఫ్రాంసుకు సహాయానికి కబురంపాయి. ఏ దేశమూ నోరెత్తి జవాబు చెప్పలేదు. అందుచే అప్పటికి మూడు రోజుల క్రితమే బిడ్డనుకనిన ఆల్బేనియా రాణి ముందుగాను, ఒకరోజు తరువాత జాగ్‌రాజును ఆల్బేనియా వదలి గ్రీసుకు తప్పించుక పోవలసివచ్చింది. ఆల్బేనియా అంతా ఇపుడు ఇటలీ చేతులలో ఉన్నది.

ఇతర దేశాలలో యుద్ధజ్వరం.

దీనితో గ్రీసుదేశము తన సైన్యాన్ని తయారు చేసుకోడానికి అరంభించింది. అయితే దేశములోని కమ్యూనిస్టుల నందరిని అరెస్టుచేసి జైలులో పెట్టింది. దీనినిబట్టి చూస్తే గ్రీసు నిజంగా డిక్టేటరులను ఎదుర్కొను సూచనలేమీ కనబడుటలేదు. బ్రిటిషు ఫ్రెంచి పత్రికలు ఈ అక్రమణను ఖండించాయి.

అమెరికా మంత్రి కార్డెల్‌హల్ ఖండించాడు. అధ్యక్షుడు రూజ్‌వెల్టుకు ఆయుధాలను సరఫరాచేయడములో ఏ దేశానికి చేయాలని ఉంటుందో నిర్ణయించే హక్కుకూడా ఇవ్వాలని, యుద్ధము చేస్తూన్న దేశాలకు ఆయుధాలు సరఫరా చేయకూడదనే చట్టాన్ని మార్చాలని ప్రయత్నాలు సాగుతున్నాయి అమెరికా పారిశ్రామిక యంత్రమంతా యుద్ధానికి కావలసిన పరికరాలన్నింటిని సరఫరా చేయునట్లు సంసిద్ధము చేయబడినది.

బ్రిటనులోకూడ 1000 వర్తకపు టోడలకు మర ఫిరంగులు బిగించబడి, అవి చిన్న యుద్ధనౌకలుగా మార్చబడ్డాయి. కాని ఫ్రాంసు, ఇంగ్లండులో నిర్బంధ సైనికశిక్షణను ప్రారంభించాలని గట్టిగా కోరుతూ ఉంది.

స్విట్జర్లండు ఆత్మరక్షణకోసం, సైన్యములో పాల్గొనవలసినదిగా 60 సంవత్సరంలోపు ఉన్నవారినందరికి ఆజ్ఞలిచ్చింది. ఈ వరకు 48 సంవత్సరాలలోపు ఉన్నవారే సైన్యములో పని చేయవలసి ఉండేది.

హాలండు, బెల్జియము దేశములుకూడ తమ సైన్యాలను ప్రోగు చేసుకుంటున్నాయి. యుగోస్లోవియాలోని సెర్బులు, క్రోటులు అను రెండు ముఖ్య జాతుల మధ్య మొదటినుండి బద్దవిరోధ ముండేది. వారుకూడ కలసి పనిచేయడానికి ఏమైనా సాధ్యమవుతుందేమో అని ప్రయత్నిస్తున్నారు, క్రోటుల నాయకుడు మాచెక్, యుగోస్లోవియా ప్రధాని స్టైకోవిచ్‌తో సంప్రదిస్తూ ఉన్నాడు.

ఫ్రెంచి సైనిక కమిటీ సమావేశమయి ప్లానుల గీస్తూఉంది. ఇంగ్లండులోకూడ మంత్రివర్గము తరుచు కలసికుంటూఉంది. ఈ ప్రయత్నాలన్నీ యుద్ధం త్వరలోనే వస్తుందని సూచిస్తున్నాయా?

బ్రిటను - పోలండు ఒడంబడిక.

ఇది ఇంకా తయారుకాలేదు. కాని బ్రిటిషుప్రధాని, పోలిషు ప్రభుత్వము సంభాషణలు జయప్రదముగా జరిగినవని ప్రకటిస్తూ ఉన్నారు: "పోలండు స్వాతంత్ర్యానికి భంగము కలిగే పరిస్థితులు" ఈవాక్యములో ఆ పరిస్థితులేమిటో తేల్చుకున్నారా అనిఒక సభ్యుడు కామన్సుసభలో ప్రశ్నించాడు. అది ఇంకా చర్చలోనే ఉన్నదట. పోలండు సైనిక నాయకులు బ్రిటిషు సేనాధ్యక్షులు సమావేశమై ప్లానులను తయారు చేయడానికి త్వరలో సమావేశము కావలని మరియొక సభ్యుడు సూచించాడు. ఖచ్చితముగా అట్టి వాగ్దాన మేమీ ఇవ్వజాలకపోయినా, ఇంగ్లండు, పోలండుల మధ్యకుదిరిన పరస్పర సహాయపు టొడంబడికను అమలు జరుపడానికి తగిన ఏర్పాటులన్నీ చేస్తామని బ్రిటిషు ప్రధాని చెప్పాడు.

పోలండు, ఈపరస్పరసహాయపు టొడంబడికలలో హంగరేని కలుపాలనీ, రష్యాను దూరంగా పెట్టాలని ఇంకనూ, నేటికి కోరుతూ ఉందని తెలుస్తూ ఉంది. దీనిని బట్టియే ఈ కపటనాటకముయొక్క గుట్టు అంతా బయటపడుతూ ఉంది. జెకోస్లోవేకియాను ఛిన్నాభిన్నము గావించడములో పాల్గొన్న హంగరీతోనే ఒడంబడిక, జర్మనీ చెప్పినట్లు చేయు హంగరీతో ఎలా ఒడంబడిక కుదురుతుంది? జర్మనీతో కుదిరితేనే కుదురుతుంది. జర్మనీతో అట్టిఒడంబడికను కుదుర్చుకోడానికి పోలండు ఆతురత చూపుతూ ఉంది. అందుచేతనే, తన స్వాతంత్ర్యాన్ని రక్షించుకోడానికి ఒకే మార్గమైన, రష్యాసహాయాన్ని తృణీకరిస్తూ ఉంది. జర్మనీ ఇటలీలు, పోలండు తీసుకొన్న వైఖరికి సంతృప్తిని తెలియజేస్తున్నాయి.

పోలండుకు : జర్మను సూచనలు

జర్మనీ పోలండుకు ఈసూచనలను చేసింది.

1. పూర్తిగా జర్మనులే నివసిస్తూ ఉన్న కొద్దిప్రదేశాన్ని తిరిగి జర్మనీకి ఇచ్చివేయాలి ఇది బహుశ డాన్జిగ్ అయి యుండవచ్చు. దానితో పాటు అప్పరు సైలేషియాకూడ అయి ఉంటుంది.

2. జర్మనీకి తూర్పు ప్రష్యాకు మధ్యనున్న పోలిషు కారిడరులో జర్మనీరాక పోక మార్గాలకు ఎట్టి అభ్యంతరము ఉండకూడదు.

3. పోలండులోని జర్మనుల హక్కులను కాపాడాలి. వీనికి అంగీకరిస్తే పోలండు స్వాతంత్ర్యానికి అర్ధపురుషాంతరము వరకు గ్యారంటీ ఇస్తుందట: అంటే ఈలోపల తానాక్రమించుకోదట.

మార్చి మూడవవారము జెకోస్లోవేకియా, నాల్గవ వారము మెమిలు, ఏప్రిల్ మొదటి వారము ఆల్బేనియాల వంతు అయింది. ఈనెల రెండవ వారము వంతు డాన్జిగ్‌ది అయితే ఆశ్చర్యముండదు:

చైనా యుద్ధరంగము.

జపాను ఎక్కువ ఖరీదు పెట్టి చేపలను పట్టుకొనేహక్కును సోవియటు యూనియను నుండి తిరిగి కొనుక్కుంది. అయినా చైనాలో మాత్రము దానిస్థితి ఏమీ బాగుండలేదు. షాన్సి రాష్ట్రములో 10 లక్షలమంది ప్రజలను చైనావారు సైన్యంగా తయారు చేస్తున్నారు. ఈ సైన్యమంతా నాలుగు సూత్రాల ననుసరించి పనిచేస్తూఉంది.

1. ప్రజాసామాన్యము మధ్య, సైన్యము మధ్య ఐక్యత సహకారము ఉంది.

2. సైనికోద్యోగులమధ్య, సైనికుల మధ్య ఐక్యత ఉంది.

3. శత్రువుపై పడడానికి తగిన అవకాశము కొరకు వేచి యుండి, అట్టి అవకాశము చేతికి చిక్కినతోడనే పైనపడటము.

4. సైన్యానికంతకూ గొరిల్లా యుద్ధనీతిని నేర్పుతున్నారు.

గత రెండు వారాలలోనే జపాను సైన్యములో 240 పర్యాయాలు తలపడ్డారు. 10 వేలమంది జపాను సైనికులను చంపివేశారు. హాంగ్చో పట్టణముపై ఒక లక్ష చీనాసేన దాడి వెడలుతూ ఉంది. ఇన్నరు మంగోలియానుండి జపాను సేనలను తరిమివేయడానికి 2 లక్షల ఔటరు మంగోలియనులు ముందుకు సాగుతున్నారు. కాంగ్‌మూన్, పక్కియూస్ అను రెండు రేవులను చైనా తిరిగి జపాను చేతులనుండి లాక్కొంది. కాంటను నగరానికి 11 మైళ్ల దూరమువరకు చైనా సేనలు వచ్చాయి. ఈలోపల జపానులోకూడ యుద్ధము అంటే ప్రజలలో విసుగుఎత్తుతూ ఉంది. ఈ పరిస్థితులలో భవిష్యత్తున జయము చైనావారిదే కదూ?

కృష్ణాజిల్లా కాం॥ సో॥ పార్టీ కార్యవర్గ సమావేశం ఏప్రిల్ 14 వ తేదీ ఉదయం 11 గంటలకు కాజ గ్రామంలో జరుగును.

కార్యక్రమము

1. రాష్ట్రీయ కాంగ్రెసుకా మహాసభయొక్క జాతీయ వాంఛ తీర్మానము అమలు జరుపుట.
2. శిక్షణ శిబిరాలు
3. పార్టీనిర్మాణాన్ని గూర్చిన రాష్ట్రజిల్లా తీర్మానాలు.
4. ఇతర విషయాలు

సి. రాజేశ్వరరావు,
ప్రధాన కార్యదర్శి,
కృ॥ జి॥ కా॥ సో॥ పార్టీ.

కాజ, బందరు - బెజవాడ రోడ్డుమీద నిడుమోలు దగ్గర దిగి 4 మైళ్ల నడువ వలయును.

మన రాజకీయాలు

(5 వ పేజీ తరువాయి)

పత్రికా శాసనము: సరిహద్దు మంత్రివర్గము

కాంగ్రెసు మంత్రివర్గాలు అప్పుడప్పుడు కొన్ని ప్రమాదకరములగు పనులుగూడ చేస్తూఉంటాయి: ఈ వారము సరిహద్దు రాష్ట్ర శాసనసభలో ప్రెస్ ఎమర్జన్సీ పవర్సు అక్టును రద్దుచేయమని ఒక సభ్యుడుపపాదిస్తే, పత్రికా స్వాతంత్ర్యాన్ని మతకలహాలను రెచ్చగొట్టడానికి ఉపయోగించుకుంటున్నారు కాబట్టి అక్టును రద్దు చేయడానికి సాధ్యము కాదన్నాడు.

పోలీసుల నిఘా

మద్రాసులో కాంగ్రెసువారిలో చాలమందిని ఇంకాపోలీసులు వెంటాడుతూనే ఉన్నారు: సంయుక్తరాష్ట్ర శాసనసభలో పంతు ఒక ప్రశ్నకు జవాబు చెప్పుతూ, కాంగ్రెసు పనిచేసేవారి వెంట సి.ఐ.డి. లు పోవడము లేదని చెప్పాడు: మన రాజాజీ, సి.ఐ.డిలు వెంటాడము అవసరమని సమర్థిస్తాడు.

కాశీపట్టణము: పట్టాభిగారు

పట్టాభిగారు మొన్న ఏలూరులో ఉపన్యసిస్తూ, కాశీపట్నము విషయమై గాంధీజీ ఇచ్చిన స్టేటుమెంటుకు ఆధారము కామ్రేడ్ ఉద్దరాజు రామంయొక్క వ్రాతమూలకమైన వాగ్మూలమన్నాడు, ఇలా పీడ వర్గాల పర్యాయాలు చెప్పియున్నారు: ఒక్కవ్యాయము ఆ వాగ్మూలాన్ని ప్రకటిస్తే ప్రజలంతా దానిలోని నిజానిజాలు గ్రహిస్తారు: కాని పట్టాభిగారు అంతటితో అగలేదు, కొంతమంది యువకులు కాశీపట్టణపు రైతులకు గొంతెమ్మకోర్కెలు కల్గిస్తున్నారట: వారికి కావలసింది అల్లకల్లోలమట. ఎట్టి శిక్షణలేకుండ పోవడమట. పేరు ప్రఖ్యాతులు వీని కోసం వారు వెర్రి మనుష్యుల్లాగ ప్రవర్తిస్తున్నరట: వారికి వర్గకలహములోని అపాయము తెలియదు. వారు కావాలనే ఘర్షణను, వర్గపోరాటాలను రెచ్చగొట్టుతున్నారని నిందించాడు: ఇది చాలపొరపాటు, ఇట్టి నిందావాక్యాలను ఉపసంహరించుకోమని అచ్చటనున్న సోషలిస్టులు కోరితే మీరంతా కమ్యూనిస్టులు, కమ్యూనిస్టులు తప్పక హింసాప్రియులని చెప్పి సంతృప్తి పొందాడు. ఇట్టిపట్టాభిగారితో వాదించినా లాభములేదు అయినా కామ్రేడ్ తాడి అప్పలస్వామి చెప్పినట్లు కమ్యూనిస్టులు హింసాప్రియులుగారు. అల్లకల్లోలాన్ని అపేక్షించరు. ప్రపంచమందంతా నిజంగా శాంతిని, అహింసను నెలకొల్పడానికి వారి సూచించునదొక్కటే మార్గము.

పంజాబు, బెంగాలు రాజకీయ ఖైదీలు

కాంగ్రెసు నాయకులలో డాక్టరు పట్టాభి, రాజాజీ వంటివారి చెయిదములు, పంజాబు, బెంగాలు దియాక్షనరీ మంత్రివర్గాలకు సమర్థించుకోడానికి సాయపడుతున్నాయి, అందుచేతనే, ఇంతవరకూ రాజకీయ ఖైదీలను విడుదలచేయలేము. అయినా దేశములో జరుగుతూ ఉన్న ప్రజాందోళననుండి తప్పించుకోలేక పోయారు. దీని ఫలితము బెంగాలులో ఫజ్లుల్ హక్కుకూడ 124 మందిని ఎట్టి సలహా కమిటీ లేకనే విడుదలచేశాడు. సలహాకమిటీని ఒక దానిని వేసి, దాని పరిశీలనపిదప మరి 98 మందిని విడుదలచేశాడు. అది విడుదల చేయమనిన మరియొక 15 మంది విషయము ఇంకా ఆలోచిస్తున్నాడట: ఇంకను 131 మంది విషయము సలహాకమిటీ ఆలోచించాలి. దేశములో ప్రజాందోళన రేకెత్తనిదే ఇది అసాధ్యము.

సుభాసు బాబు: ప్రకటనలు

కాంగ్రెసులో పొడచూపుతూఉన్న ఈ ప్రమాదాలను అరికట్టి, స్వాతంత్ర్య పోరాటానికి తగిన సన్నాహము చేయించడానికి వర్కింగు కమిటీని సుభాషుబాబు ఇంతవరకు ఏర్పరచజాలక పోయాడు అనేకమందికి అనేక సందేహాలు కలిగాయి. పంతు తీర్మానాన్ని కాంగ్రెసు నియమాలకు వ్యతిరేకమన్నప్పుడు గాంధీజీ సలహా తీసుకోడేమోనని చాల మందికి భయము కలిగినది. కాని అట్టి భయాన్ని తొలగించాడు, పంతు తీర్మానము తనకెంత అయిష్టమయినా కాంగ్రెసు తీర్మానము ననుసరించి నడుచుకుంటానన్నాడు: పంతు తీర్మానముపై చాల కోపపడి రాష్ట్రీయ సమస్యగా చేస్తూఉన్న అనేకమంది బెంగాలీ కాంగ్రెసు వాదులను మందలించాడు: ఇది అఖిలభారత సమస్య. దీనిని మీరిలా చేయడము పోరాటానికి తీరని దెబ్బ అన్నాడు: ఏప్రిల్ 2 వ తేదీ పంతు తీర్మానముపై ఖండన సభలు బెంగాలంతా జరుపడానికి తయారైతే అపాడు. అయినా గాంధిజీ అనుచరులు సుభాసుబోసు తన అధ్యక్ష పదవిని విరమించుకొనేటట్లు విసిగించవచ్చు. సోషలిస్టులు, అతివాదులు, వర్కింగు కమిటీలో ఉండడానికి తయారైతే, ఈ విసుగింపులకు లోనుగాక, రాబోవు క్లిష్ట సమయములో బ్రిటిషు ప్రభుత్వముతో రాజీ పడకుండా పోరాటము సాగేటట్లు సుభాసు చూస్తాడని ఆశిస్తాము.

ఫెడరేషన్ ప్రతికూలాందోళన

ఖైటగుంటలో 1 వ తేదీన రైల్వేకార్మికులు కామ్రేడ్ ఉ. వెంకయ్యగారి అధ్యక్షతను సమావేశమయిరి. కామ్రేడ్ పి. వి. కృష్ణయ్య ఫెడరేషను మూలమున వచ్చు ముప్పునుగూర్చి వివరించిన పిదప ఫెడరేషను రానివ్వకుండ పని చేయటానికి తీర్మానించడమైనది.

★ ★ ★

పామర్రు కాంగ్రెసుసోషలిస్టుపార్టీ 1 వ తేదీ ఊరేగింపు జరుపుతూ, "ఫెడరేషను ఎందుకు ప్రతిఘటించాలి" అనే కరపత్రాన్ని ప్రజలలో విరివిగా పంచిపెట్టించిరి సాయంకాలము బహిరంగ సమావేశము కామ్రేడ్ కంచర్ల వెంకట్రామయ్య అధ్యక్షతను సమావేశ మయింది. కామ్రేడ్సు. బసవయ్య. దుర్గాప్రసాద్ ఫెడరేషనును ఎదుర్కోడానికి ఏమి చేయవలసినదీ వివరించిన పిదప సభముగిసింది.

★ ★ ★

నెల్లూరుజిల్లా కాంగ్రెసు కమిటీ ఏప్రిల్ 7 వ తేదీ సమావేశమై ఈ క్రింది తీర్మానముచేసింది.

అఖిలభారత జాతీయ కాంగ్రెసు రాబోవు స్వాతంత్ర్యపోరాటానికి దేశమునంతయు సన్నిద్ధముగా ఉంచాలని, నేషనల్ డిమాండు తీర్మానమున నిర్ణయించినది. యీ నేషనల్ డిమాండు తీర్మానాన్ని గ్రామాములలో తెలియచెప్పడానికి ఏప్రెయల్ 10 తేది నుండి.

1. ఉదయగిరి. ఆత్మకూరు తాలూకాలలో ఒకదళం 3. పొదిలి. దర్శితాలూకాలలో ఒకదళం 4. సూళ్లూరుపేట వెంకటగిరి తాలూకాలలో మరియొకదళం. బయలుదేరు చున్నవి. వీటికి ఆయాతాలూకా సంఘము పూర్తిగా సహాయము చేయవలసినదిగా యీ కమిటీ కోరుచున్నది.

నెల్లూరు. కోవూరు. గూడూరు. కనిగిరి. తాలూకాలలో సహా ఇట్టిదళముల హెచ్చరించడమైనది.

యీదళములన్నియు వారిప్రచారక అనుభవములను గూర్చి ప్రతివారము, జిల్లాకాంగ్రెసు కార్యాలయమునకు రిపోర్టు పంపించాలి.

★ ★ ★

నెల్లూరుజిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్యనిర్వాహక వర్గము సమావేశమై ఈ క్రింది వారిని ఆయా తాలూకాలలో "నేషనల్ డిమాండ్ తీర్మానమును" ప్రచారము చేయుటకు నిర్ణయించినది. ఏప్రిల్ నెల 10 వ తేదీ నుండి ప్రచారము సాగించవలెను.

కామ్రేడ్సు పి. రామచంద్రయ్య. బి. శేషయ్య. యమ్. శంకరయ్య—కావలి. కందుకూరు తాలూకాలు.

కామ్రేడ్సు పి. సుందరరాజన్. డి. శేషగిరిరావు, జి. పి. కొండయ్య—ఉదయగిరి ఆత్మకూరు తాలూకాలు.

కామ్రేడ్సు బి. రామనాథం. పీక్ల గురునాథం. పి. సుబ్బరామయ్య—సూళ్ళూరుపేట వెంకటగిరి తాలూకాలు.

★ ★ ★

జిల్లా సోషలిస్టు పార్టీలకు హెచ్చరిక.

మిగిలిన జిల్లా పార్టీలు ఏవిధంగా, ఎన్ని దళాలు ఏయే తాలూకాలలో ఎప్పటినుండి ప్రచారముసాగించడానికి పూనుకొన్నది రిపోర్టులు పంపించలేదు. వెంటనే 15 వ తారీఖు లోపల పార్టీఆఫీసుకు ఆవిషయం తెలియజేయాలి.

పు. సుందరయ్య,
కార్యదర్శి
రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ.

గమనించండి

కాంగ్రెసు వార్తలు

ఆలిండియా కాంగ్రెసు

సుభాసుబోసు త్వరలోనే వర్కింగు కమిటీ సభ్యులపేర్లను ప్రకటించునని తెలియుచున్నది. ఈ నెల 27 వతేదీ వర్కింగు కమిటీ కలకత్తాలో సమావేశ మవుతుంది. 28 వ తేదీ నుండి ఆలిండియా కాంగ్రెసుకమిటీ కొన్నిరోజులు సమావేశ మవుతుందని తాత్కాలిక కార్యదర్శి (డి నర్సింహ గారు) ప్రకటించారు.

★ ★ ★

ఆంధ్రరాష్ట్రములో నూతన జిల్లా కాంగ్రెసు కార్యనిర్వాహక కమిటీలు.

ఉత్తర విశాఖ :

అధ్యక్షుడు : గేదెల చంద్రయ్యానాయుడు
కార్యదర్శి : శ్రీ గౌతు లచ్చన్న
సంయుక్త కార్యదర్శులు :
శ్రీ డా॥ సభా వెంకట్రావు:
శ్రీ గరిమెళ్ళ వెంకట రమణమూర్తి

కార్యనిర్వాహకవర్గము : శ్రీయుతులు గరిమెళ్ళ కుమారస్వామి, పార్వంది ఈశ్వరప్ప' పల్లె సుందర నారాయణ, బెందాళం గవరయ్య, బెందాళం లక్ష్మీనారాయణ, అబ్దుల్ రహిమాన్ ఖాన్. మల్లిపెద్ది కృష్ణమూర్తి. సాకేటి గురుపులు, దుళ్ళ చమ్మనాయుడు, గుర్తావెళ్ళి నారాయణ, బెండ అప్పలసూరి.

★ ★ ★

తూ॥ గోదావరి

అధ్యక్షుడు : శ్రీ యస్. సుబ్బరాజు,
కార్యదర్శి : శ్రీ వై. బాపిరాజు
సంయుక్త కార్యదర్శులు :
శ్రీ యస్. సత్యనారాయణ
శ్రీ కె. దయానందరాజు

కార్యనిర్వాహక వర్గము : శ్రీయుతులు ఎ. సుబ్బారావు, యస్. బంగార్రాజు, పి. సత్యనారాయణరాజు, బి. వెంకటరత్నము, యం. రంగయ్యానాయుడు, యమ్. ఫణిశాస్త్రి, యం. అప్పయ్యశాస్త్రి, డి. శేషగిరిరావు, ఆర్. వి. జగ్గారావు, యం. నవసన్న, వి. వి. ఆర్. దీక్షితులు

★ ★ ★

ప॥ గోదావరి

అధ్యక్షుడు : శ్రీ కె. సత్యనారాయణమూర్తి
కార్యదర్శి : శ్రీ బి. బాపిరాజు
సంయుక్త కార్యదర్శులు :
శ్రీ పి. వెంకటరత్నం.
శ్రీ కొమ్మారెడ్డి చినఆంజనేయులు.

కార్యనిర్వాహకవర్గము : శ్రీయుతులు డి. నారాయణరాజు, ఎ. గోవిందాచారి, నెక్కలపు వీరయ్య, యస్. ఆర్. దాట్ల, ఎ. బాపన్న, మొహమ్మద్ ఘౌస్, డి. రామారావు, ఎ. సూర్యనారాయణ, ఉ. రామం, పి. పేర్రాజు.

★ ★ ★

తూ॥ కృష్ణా

అధ్యక్షుడు : శ్రీ కొల్లిపర సూరయ్య,
కార్యదర్శి : శ్రీ మండల వీరరాఘవయ్య
సంయుక్త కార్యదర్శులు :
శ్రీ మట్టా శంభరయ్య
శ్రీ దామర్ల పట్టాభిరామరామారావు

కార్యనిర్వాహక వర్గము : శ్రీయుతులు కొడాలి నరశింహారావు, పూనూరి వెంకారెడ్డి, దుగ్గిరాల బలరామ కృష్ణయ్య, చలసాని నాగభూషణం, వీరపనేని గోపాలకృష్ణయ్య, వేముల సల్లి వెంకటగోపాలరావు, ముదునూరి గుర్రాజు, సమ్మెట అక్కయ్యానాయుడు, చిగురుపాటి కుటుంబయ్య, ఈడ్పుగంటి లింగయ్య, సెక్కపాటి నాగేశ్వరరావు.

★ ★ ★

నెల్లూరు

శ్రీ బద్దెపూడి వెంకట నారాయణరెడ్డి
అధ్యక్షుడు
శ్రీ కె. యల్. నారాయణ
జనరల్ కార్యదర్శి
శ్రీ మన్నెపల్లి హనుమంతరావు
శ్రీ దువ్వూరి బలరామరెడ్డి
సహాయ కార్యదర్శులు

కార్యనిర్వాహక వర్గము:— శ్రీయుతులు రావిపాటి మహానందచౌదరి, కైపు వీరారెడ్డి, బత్తిన పెరుమాళ్ళనాయుడు, గూడూరు వీరరాఘవులునాయుడు, తిక్కవరకు రామిరెడ్డి, బట్టిపాటి రామిరెడ్డి, వెన్నెలకంటి రాఘవయ్య, జత్తిని కృష్ణారెడ్డి, వేణుంబాకం శంకరరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, తాడికొండ వెంకట సుబ్బానాయుడు.

★ ★ ★

గుంటూరు జిల్లా

శ్రీ షంతెన వెంకట్రాజు
అధ్యక్షుడు
శ్రీ వెలువోలు సీతారామయ్యచౌదరి
కార్యదర్శి
శ్రీ గుళ్ళపల్లి ఆదినారాయణ
శ్రీ మేడూరి నాగేశ్వరరావు
సహాయ కార్యదర్శులు

కార్యనిర్వాహక వర్గము:— శ్రీయుతులు సుంకర వెంకటసుబ్బారెడ్డి, మద్దుల గిరిరావు, పాటిబండ్ల గిరిరావు, పోతరాజు విశ్వనాథశర్మ తోట రామకోటయ్య; చావలి సూర్యనారాయణ; జనాబ్ గౌస్‌బేగు, చిన్నమనేని సూరయ్య, పుతుంబాక శ్రీరాములు, యడ్లపల్లి కోటయ్య, కల్లూరి వీరయ్య.

★ ★ ★

అనంతపురం

అధ్యక్షుడు : శ్రీ పప్పూరి రామాచార్యులు
కార్యదర్శి : శ్రీ కల్లూరి సుబ్బారావు
సంయుక్తకార్యదర్శులు :
శ్రీ కొట్టాలపల్లె వెంకటనాయుడు
శ్రీ యం. శంకరనారాయణగుప్త

కార్యనిర్వాహకవర్గము: శ్రీ టి. రామచంద్రారెడ్డి, పల్లం వెంకటేశులు. జి. రామశాస్త్రి; జి. వి. సత్యనారాయణ; దొన్నికోట సుబ్బరెడ్డి గంగవరం కృష్ణమూర్తి; డా॥ సూర్యనారాయణ శర్మ; యం. సి. వెంకటరెడ్డి; జి సి చిన్నారెడ్డి; అబ్దుల్‌రజీక్ సాహెబు; యస్ సంజీవరెడ్డి.

★ ★ ★

కడప

అధ్యక్షుడు : శ్రీ డి. రామసుబ్బారెడ్డి
కార్యదర్శి : శ్రీ కేతు వెంకటరెడ్డి
సంయుక్తకార్యదర్శులు :
శ్రీ చందన వెంకోబరావు
శ్రీ సంగమేశ్వరరెడ్డి

★ ★ ★

కర్నూలు

అధ్యక్షు : శ్రీ యన్. శంకరరెడ్డి
కార్యదర్శి : శ్రీ. కె. చెంచిరెడ్డి
సహాయకార్యదర్శులు :
శ్రీ బి. నారాయణమూర్తి
శ్రీ యన్. భాను

కార్యనిర్వాహకవర్గము : శ్రీ నివర్తి వెంకటసుబ్బయ్య; వి. వి. సుబ్బారావు: కె. యల్. లక్ష్మీనారాయణ; ఆళ్లగడ్డి యక్కలి రామయ్య; బైరెడ్డి శివారెడ్డి; స్వామి నారాయణాన..; సూరా రామిరెడ్డి; ఆర్ రామనాథన్; ఎ. సుబ్బారెడ్డి; డి. కుప్పురావు; మబ్బా శేషురెడ్డి.

★ ★ ★

బళ్లారి

అధ్యక్షులు : శ్రీమతి పి. ఎలిజబెత్
కార్యదర్శి : శ్రీ కె. బలరామశింగు
ఉపాధ్యక్షుడు : శ్రీ డాక్టరు లక్ష్మన్
కోశాధికారి : శ్రీ సి. కృష్ణరావు
ప్రచారపుకార్యదర్శి : శ్రీ రామిరెడ్డి

కార్యనిర్వాహక సభ్యులు:— శ్రీయుతులు మానాక్కపురం రామిరెడ్డి, లోకిరెడ్డి, డాక్టరు చందూరు కోసిగయ్య, హనుమంతయ్య, కామవరం నాగప్ప, యన్. కేశవరెడ్డి, ప్రసంగి హనుమన్న, స్వామిదాసు.

★ ★ ★

మద్రాసు ఆంధ్ర జిల్లా.

అధ్యక్షులు : శ్రీ సామి వెంకటాచెలంశెట్టి
ప్రధాన కార్యదర్శి : శ్రీ తట్టా రాఘవాచార్యులు
సంయుక్త కార్యదర్శులు :
శ్రీ వింజమూరి రంగాచార్యులు
శ్రీ పి. ఆర్. గోవిందస్వామి

కార్యనిర్వాహక సభ్యులు;— శ్రీయుతులు కొమాండూరి మంగాచార్యులు: జి. సుబ్బకృష్ణచెట్టి; నందూరి బాపిరాజు, బాగంటి సాంబశివరావు: గొల్లపూడి సూర్యనారాయణ శెట్టి: పి. జి. చంద్రకేతయ్య; రామచంద్రుని వెంకటప్ప; చెన్నూరి కృష్ణవేణమ్మ; భాగవతుల లక్ష్మీనారాయణ.

Published by M. Chandrasekhara Rao }
Printed by Tummala Venkata Ramiah } at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE